ఎమెస్కో

# లీడర్‌షిప్ ముచ్చట్లు

ఎ.జి.కృష్ణమూర్తి

ధీరూభాయిజమ్ & ఎదురీత పుస్తకాల రచయిత



ఎమెస్కో

# లీడర్‌షిప్ ముచ్చట్లు

ఎ.జి.కృష్ణమూర్తి

ధీరూభాయిజమ్ & ఎదురీత పుస్తకాల రచయిత

ఎమెస్కో

**లీడర్‌షిప్ ముచ్చట్లు**

**ఎ.జి.కృష్ణమూర్తి**
'శ్రీనివాస్', ప్లాట్ నెం. 743,
రోడ్ నెం. 38,
జూబ్లిహిల్స్, హైదరాబాద్ - 500 033
ఫోన్ : 040-23553632
e-mail : agkbrandconsult@yahoo.com, www.agkonline.com

సంపాదకులు
**డా॥డి.చంద్రశేఖర రెడ్డి**

ప్రథమ ముద్రణ: **డిసెంబరు, 2011**

©ఎ.జి.కృష్ణమూర్తి

వెల: రూ. **75/-**
ISBN - 978-93-80409-99-3

ముఖచిత్రం, బొమ్మలు : **రాంపా**

ప్రింటర్స్
**సాయిలిఖిత ప్రింటర్స్,**
హైదరాబాదు.

ప్రచురణ
**ఎమెస్కో బుక్స్**
1-2-7, బానూకాలనీ,
గగన్‌మహల్ రోడ్, దోమలగూడ,
హైదరాబాద్ - 500 029.
ఫోన్ & ఫ్యాక్స్ : 040-23264028.
e-mail : emescobooks@yahoo.com,
www.emescobooks.com

పంపిణీదారులు
**సాహితి ప్రచురణలు**
29-13-53, కాళేశ్వరరావు రోడ్డు,
సూర్యారావుపేట, విజయవాడ - 2.
ఫోన్ : 0866-2436643
0866-6460633
e-mail : sahithi.vja@gmail.com

## అంకితం

స్వర్గస్థులయిన  నా  తల్లిదండ్రులు

**శ్రీ  అచ్యుతుని  భుజంగరావు**

**శ్రీమతి  అచ్యుతుని  సీతారావమ్మ** గార్లకు

**ఎ.జి.కృష్ణమూర్తి**

**లీడర్ ఈజ్ ఏ లేడర్**

మనకు చేయూత నిచ్చి ముందుకు
నడిపించేవాడే నాయకుడు.

# విషయసూచిక


| | | |
|---|---|---|
| 1. | తొలి పలుకు | 7 |
| 2. | ఉపోద్ఘాతం | 10 |
| 3. | నమ్మకం నాయకత్వానికి తొలిమెట్టు | 16 |
| 4. | యథా రాజా తథా ప్రజా | 22 |
| 5. | ఓటమి అనాథ | 28 |
| 6. | అందరి వాడు నాయకుడు | 32 |
| 7. | పిండికొద్దీ రొట్టె | 38 |
| 8. | నీతి, నిజాయితీ, న్యాయవర్తన | 44 |
| 9. | స్వార్థపరులు నాయకులు కాలేరు | 50 |
| 10. | ప్రతిభకే పట్టం | 56 |
| 11. | నాయకులు మనలాంటి వారే... | 62 |
| 12. | గతం నాస్తి | 68 |
| 13. | అభయమిచ్చువాడే అసలైన నాయకుడు | 74 |
| 14. | సాలె పురుగు కథ | 80 |
| 15. | విచక్షణతోనే విజయం | 86 |
| 16. | లీడర్ అంటే మేనేజర్ కాదు | 92 |
| 17. | లీడర్లూ, మారండి... | 98 |
| 18. | లీడర్‌షిప్ రకాలు | 104 |
| 19. | సిట్యుయేషనల్ లీడర్ | 112 |
| 20. | ఫలితాలే ప్రధానం ఈ నాయకులకు | 118 |
| 21. | నిశ్శబ్ద నాయకులు | 126 |
| 22. | మార్పును తెచ్చే నాయకులు | 136 |
| 23. | నిచ్చెనలాంటి నాయకులు | 142 |
| 24. | మలి పలుకు | 148 |
| 25. | రచయిత పరిచయం | 154 |

# తొలిపలుకు

## ఎటువైపు వెళ్తున్నాం మనం?

ఉదయం నిద్రలేవగానే దిండు మీద తల ఆనించి అలాగే పది పదిహేను నిమిషాలు ఆలోచిస్తూ ఉండిపోవటం నా జీవితంలో ఒక భాగంగా మారిపోయింది. ఈ ఆలోచనలు సాధారణంగా నేడు మన దేశంలో, జీవితంలో జరుగుతున్న సంఘటనల చుట్టూనే తిరుగుతుంటాయి. కొన్ని సంఘటనలు ఎంతో వింతగా గోచరిస్తాయి. మంచినాయకులుంటే ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోవేమో అనిపిస్తుంటాయి.

డెబ్బై నాలుగేళ్ల అన్నా హజారే మనని పట్టి పీడిస్తున్న మహమ్మారి... లంచగొండితనం మీద యుద్ధం ప్రకటించాడు. దేశాన్ని ఒక తాటిపై నిలబెట్టాడు. ఏ ఒక్క యువనేతకి ఈ ఉద్దేశం ఎందుకు కలగలేదో ఆశ్చర్యంగా ఉంటుంది... భయంగా ఉంటుంది.

ఇదిలా ఉండగా అన్నా ప్రకటించిన యుద్ధం దేశంలోని లంచగొండి రాజకీయ వ్యవస్థ మీద, ప్రభుత్వ ఉద్యోగస్థుల మీద కాగా, కాంగ్రెస్ పార్టీ నానా తంటాలు పడి ఈ యుద్ధంలో ముఖ్య ప్రత్యర్థిగా తన స్థానాన్ని సుస్థిర పరుచుకొంది. ఎంత వెర్రితనం.

మన ప్రధాన మంత్రి గారు నీతి నిజాయితీలకు మారు పేరే! ఎలాంటి సందేహం లేదు. మనమంతా ఆయన నాయకత్వంలో కాస్తో కూస్తో నిజాయితీ గల పరిపాలన ఉంటుందని ఆశించాం. అయితే జరుగుతున్నది మరొకటి. ఎందుకని ఆయన్ని అడిగితే, ఆయన తన నీతి నిజాయితీల గురించి మాట్లాడుతాడు కాని, జరుగుతున్న అవినీతి గురించి కాదు! అవినీతిని అడ్డుకొనే ప్రయత్నాల గురించి కాదు! నాయకుడు తాను స్వచ్ఛంగా, సమర్థంగా ఉండగానే సరిపోదు. తాను నాయకత్వం వహిస్తున్న సంస్థ కూడా స్వచ్ఛంగా, సమర్థంగా ఉండాలి కదా! అప్పుడే కదా ఎవరైనా నాయకుడని పిలవబడే అర్హత పొందేది.

ఈ మధ్య మరోవింత మొదలైంది. డబ్బింగ్ సినిమాలు బాగా ఆడుతున్నాయట, తెలుగులో తీసిన సినిమాలు ఆడటం లేదట. అందువల్ల డబ్బింగ్ సినిమాలను నిషేధించాలనే ఆలోచనలో ఉందట తెలుగు సినిమా పరిశ్రమ. డబ్బింగ్ సినిమాలు ఎందుకు ప్రజాదరణ పొందుతున్నాయో గ్రహించి అంతకంటే మంచి సినిమాలు తీసి ప్రజాదరణ పొందుదామను కోవటం సాధారణంగా జరగాలి. అలా జరిగితే ఆశ్చర్యమేముంది? వింతే ముంటుంది? తెలుగు సినిమాలు హీరోల చుట్టూ పరిభ్రమిస్తూ ఉంటాయి. వరుసగా డాన్సు, స్టంటు, కామెడీ సీన్లే. ఇదే తంతు ప్రతి సినిమాలో. కథ నామ మాత్రంగా కూడా కనబడదు. మంచి కథలతో, మంచి సినిమాలు తీయాలనే తపన ఉండాలి కాని పరభాషా డబ్బింగ్ చిత్రాలను నిషేధించు కోవాలనుకోవటం వింతే కదూ!

ఇతర భాషా చిత్రాలను నిషేధించాలనుకోవటంలాంటి ఆలోచనలను పక్కనబెట్టి, మంచి తెలుగుసినిమాలకోసం ప్రయత్నిస్తే బాగుంటుందేమో! ఆ రంగానికి చెందిన నాయకులు ఆలోచించాల్సిన విషయం ఇది. సగటు తెలుగు సినిమా ప్రేక్షకుడిగా నా వేదన, నా అభిలాష ఇది.

మరో వింత, రోజూ నన్ను వేధిస్తూ ఉంటుంది. ఎంతో సదుద్దేశంతో, ప్లాస్టిక్ బ్యాగ్‌లను నిషేధించారు నగరంలో. దీని ఫలితం మాత్రం చాలా పెద్ద వింత. ఒక గొప్ప రోత! ఈ నిషేధానికి ముందు మనం కొన్న ప్రతి వస్తువును ఒక ప్లాస్టిక్ బ్యాగులో ప్యాక్ చేసిచ్చేవాళ్లు దుకాణదారులు. ఇప్పుడు అదే ప్లాస్టిక్ బ్యాగులను మనం కొనుక్కుంటున్నాం. ప్లాస్టిక్ బ్యాగ్‌కి ప్రత్యామ్నాయంగా పేపర్ బ్యాగులు, జూట్ బ్యాగులు ఇంకేవైనా ఇచ్చి వాటి కోసం మనం డబ్బులివ్వటం జరిగి ఉంటే ప్లాస్టిక్ సమస్యకు కొంతైనా పరిష్కారం లభించేది. ఊహూ అలా జరగటం లేదు. నిన్నటి దాకా మనకు ఉచితంగా సామాన్లతో వచ్చిన ప్లాస్టిక్ బ్యాగులకు నేడు మనం డబ్బులు ఇస్తున్నాం.

రెండు, మూడు దశాబ్దాల క్రితం షాపింగ్‌కి వెళ్లేటప్పుడు మన వెంట సంచులు పట్టుకెళ్లటం ఒక అలవాటుగా, ఆనవాయితీగా ఉండేది. ప్లాస్టిక్ యుగం వచ్చాక ఆ అలవాటు మరుగునపడిపోయింది. కనుక సహజంగానే నేడు మనం వెంట సంచి తీసుకెళ్లం. ఈ బలహీనతను ఆధారం చేసుకుని షాపుల వాళ్లు లాభపడుతున్నారు. ఊరికే ఇవ్వాల్సిన ప్లాస్టిక్ బ్యాగుల్ని

అమ్ముకుంటున్నారు. మనం గతిలేక కొనుక్కుంటున్నాం. రోత కలిగించే ఈ వింతకి పరిష్కారమేమిటో?

మరో వింత : ఇటీవల లండన్ మహానగరంలో జరిగిన అల్లర్లలో లూటీ చేయబడిన స్టోర్స్ చాలా మటుకు డిజైనర్, ప్రీమియమ్ వస్తువులను అమ్మేవట. ఈ లూటీ చేసిన వాళ్లు తిండికీ, బట్టకు లేని వాళ్లు కాదు! జేబులో బ్లాక్ బెర్రీ మొబైల్ ఫోన్, ఇంట్లో రకరకాల గాడ్జెట్లు ఉన్నవాళ్లు! వాళ్లు లూటీ చేసింది విలువగల వస్తువుల్ని. వింతగా లేదూ? భయంగా లేదూ? విలువలు లోపించటమే ఇటువంటి క్రూరమైన వింతలకు మూలకారణాలు.

విలువలంటే గుర్తుకొచ్చింది. మా చిన్నప్పుడు జరిగిన కొన్ని సంఘటనలు కళ్ల ముందు నేటికీ కొట్టొచ్చినట్లు కనబడతాయి. దిగువ మధ్య తరగతికి చెందిన కుటుంబంలో గడించింది నా బాల్యమంతా. అయినా వారాలు చేసుకొనే బీద కుర్రవాడికి మా అమ్మ వారంలో ఒక పూట భోజనం పెడుతూ ఉండేది. మా భోజనానికి ముందు ఒక పళ్లెంలో రెండు ముద్దల అన్నం కొంచెం పప్పుకూర వేరుగా ఉంచి మాదాకవళం అంటూ రోజూ వచ్చే బీదవానికి దానం చేసేది. ఇలా ఎన్నో.

ఇరుగుపొరుగూ ఒకరికి తోడుగా ఉండేవాళ్లు. తెనాలిలో మా పక్కింటి చౌదరి గారింటికి ఎన్నిసార్లు అప్పుకి వెళ్లేవాడినో. వాళ్లు ఎంతో ప్రేమగా, ఆదరంగా అప్పిచ్చేవాళ్లో నాకింకా బాగా గుర్తు. డబ్బున్నా, డాబుసరిగా ఉండటం సంఘంలో తప్పుగా భావించేవారు ఆ రోజుల్లో. నేటిలాగా నాడు కూడా విపరీతమైన పేదరికం ఉంది. అయితే ఒకటే తేడా... నేడు డబ్బుని విచ్చలవిడిగా విలాసాలపై ఖర్చు పెడుతూ, చుట్టుపక్కల ఉన్న బీదజనంలో కోపం, ఈర్ష్య, ఉద్రేకం రగులుస్తున్నారు. నాడు అలా జరిగేది కాదు.

మారిపోయిన విలువలు... మృగ్యమైపోతున్న మానవత్వం, కరుణ, జాలి... పేట్రేగిపోతున్న అరాచకం, లంచగొండితనం. మనం మన విలువల గురించి, సంప్రదాయాల గురించి తెల్సుకోవటం, మన పిల్లలకు నేర్పటం ఎంతో అవసరం. లేకుంటే అరాచకమే. మన సంస్థలకు, సంఘానికి, దేశానికి నాయకుల అవసరం మునుపెన్నడూ లేనంతగా నేడు ఉంది.

ముఖ్యంగా యువతరం నుంచి.

ఆలోచించాల్సిన విషయం ఇది.

# ఉపోద్ఘాతం

ఇరవై ఎనిమిది రాష్ట్రాలు. ఆరు కేంద్ర పాలిత ప్రాంతాలు. ఇవికాక ఢిల్లీ– నేషనల్ కేపిటల్ రీజయన్.

నూట ఇరవై కోట్ల పైబడిన జనాభా.

పదహారు వందల ఏభై రెండు మాతృభాషలు. వీటిలో ఇరవై రెండు ప్రభుత్వ పరంగా గుర్తింపడిన భాషలు. ఒక లక్షపైగా జనాభా మాట్లాడే భాషలు ముప్ఫై మూడు.

అపారమైన ఖనిజ సంపద దేశంలో నలు చెరగులా. అయినా భయంకరమైన బీదరికం.

2008 అంచనాల ప్రకారం, దాదాపు డెబ్బైవేలకుపైగా వార్తా పత్రికలు. రెండొందలముప్ఫైరెండు రేడియో స్టేషన్లు. 500 పైగా టీవీ చానల్సు. దేశంలో నివసిస్తున్న 2.23 కోట్ల కుటుంబాల్లో, ఎనభైశాతంపైగా టీవీ ఉన్న గృహాలు.

ఏటా అరవై వేలకోట్ల రూపాయలను మించిన బంగారాన్ని కొంటాం మనం. ఆకాశాన్నంటుతున్న బంగారం ధరతో, ఈ విలువ లక్షకోట్లు దాటిపోయి ఉంటుంది ఈ ఏడాదిలోనే.

అమెరికా, చైనా, యూరోపియన్ దేశాల ప్రజలకన్నా, మన దేశ ప్రజలు వయస్సులో ఎంతో చిన్నవారు. పాతిక కన్నా వయస్సు మించనివారు మనదేశంలో 54%. అంటే, ఇండియాను యంగ్ ఇండియా అని అనవచ్చు.

ఒకప్పటి వ్యవసాయదేశం, నేడు సర్వీసెస్ దేశంగా మారి, సాంకేతికంగా, ఎంతో అభివృద్ధిచెందింది. గత రెండు దశాబ్దాలు మన దేశ చరిత్రలో ఎంతో ముఖ్యమైనవి. మనం నేడు అనుభవిస్తున్న మెరుగైన జీవన ప్రమాణాలు ఈ రెండు దశాబ్దాలలో చోటుచేసుకున్నవే.

అయితే సమస్యల్లా ఈ మార్పుల వల్ల ధనవంతులు మరింత ధనవంతులుగా, బీదవారు మరింత బీదవారుగా మారిపోతున్నారు. దేశంలోని నూట ఇరవై కోట్ల జనాభాలో, దాదాపు డెబ్బైఐదు కోట్లుమంది రోజుకి ఇరవై రూపాయలకన్నా తక్కువ ఆదాయంతో బతుకుతున్నవారే. నమ్మశక్యంకాని నిజం.

పలురంగాల్లో మనం సాధించవలసింది ఎంతో ఉన్నప్పటికీ, ఒక రంగంలో మాత్రం చాలా దేశాల్ని మించిపోయాం. కరప్షన్ ఇండెక్స్‌లో 0–10 రేటింగ్ స్కేలులో మన స్కోరు 3.3. ఎంత ఎక్కువ స్కోరు వస్తే, అంటే డెన్మార్క్, సింగపూరు, న్యూజిలాండ్ లాగా 9.3 స్కోరు వస్తే అంత తక్కువ కరప్షను ఉన్నట్లు. ఎంత తక్కువ స్కోరువస్తే అంత ఎక్కువ కరప్షన్ ఉన్నట్లు. నూట ఇరవై కోట్ల భారతీయులు సిగ్గుతో తలలు దించుకోవాల్సిన స్కోరు మనది. భారత్ – 3.3., చైనా 3.5., పాకిస్తాను 2.3., శ్రీలంక 3.2.

మంచికి, నీతి నియమాలకు, సత్ప్రవర్తనకు, కరుణ దయలకు మారుపేరైన మన దేశంలో ఇంత అవినీతి ఎలా చోటుచేసుకుందో – ఆశ్చర్యమేస్తుంది. ఆవేదన కలిగిస్తుంది. నిరాశ నిస్పృహలలో ముంచేస్తుంది.

లార్డ్ మెకాలే అనే బ్రిటిష్ పార్లమెంటేరియన్ భారత దేశం గురించి తన అభిప్రాయాలను బ్రిటిష్ పార్లమెంట్‌కి ఎంతో స్పష్టంగా వివరించాడు దాదాపు 175 ఏళ్ల క్రితం.

ఆరోజు 2–2–1835.

ఒక దేశ చరిత్రలో 175 సంవత్సరాలు ఏమంత పెద్ద పీరియడ్ కాదు.

లార్డ్ మెకాలే మాటల్లో ఆనాటి భారతదేశం:

"నేను భారతదేశాన్ని సమగ్రంగా, నలుచెరగులా పర్యటించాను. ఎక్కడా ఒక్క ముష్టివాడు కనబడలేదు. దొంగలను చూడలేదు. ఎంతో సుసంపన్నమైన దేశం. ఎంతో ఉన్నతమైన నీతి నియమాలు. అంతే కాకుండా పలురంగాల్లో ఎంతో ప్రావీణ్యం, నైపుణ్యం కల దేశ ప్రజలు.

ఈ దేశాన్ని జయించటం మనవల్ల కాదు. జయించాలంటే ఒకటే మార్గం– భారతదేశానికి వెన్నెముకలాంటి ఆదేశీయుల ఆధ్యాత్మికతను, విలువలను, సంస్కృతిని, నాగరికతను నాశనం చేయటమే. సనాతనమైన వాళ్ల విద్యా విధానాలకు, వారి సంస్కృతికి బదులుగా కొత్త భాషను, కొత్త విద్యా విధానాన్ని ప్రవేశ పెట్టటం – అంతేకాకుండా ఇంగ్లీషు భాష, ఇంగ్లీషు బోధనా విధానాలు ఎంతో ఉత్తమమైనవిగా భారతీయులకి నమ్మకం కల్పించటం ఎంతో అవసరం. ఈ ప్రక్రియల ద్వారా భారతీయుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసి వారిని మనం పాలించవచ్చు..."

ఆనాడు ఇంగ్లీషు భాషా వ్యామోహం దేశాన్ని భ్రష్టుపట్టిస్తే, నేడు ధన వ్యామోహం దేశాన్ని పాతాళంలోకి విసిరేసింది.

## దేనివల్ల నంటారు ఈ మార్పు?

నాయకత్వలోపాలవల్లకాదూ?

నాయకత్వం అంటే సొంత కుటుంబీకులను, బంధువర్గాన్ని, సొంత కులాలవారి జీవితాలను మెరుగుపర్చాలనుకునే తప్పుడు నమ్మకాలు, విశ్వాసాలవల్ల కాదూ??

దీపం ఉండగానే ఇల్లు చక్కబెట్టుకోవాలనే ఆత్రుత, తపన, పేరాశవల్ల కాదూ??

ఇలా ఎన్నెన్నో కారణాలుండవచ్చు.

## నాయకత్వం అంటే

తన సహచరులకు గమ్యాలను, స్ఫూర్తినీ ఇచ్చి సమష్టిమేలుకై కృషి చేయటం.

గమ్యాలు! స్ఫూర్తి!! అందరి మేలు!!! ఈ మూడు ఎంతో ముఖ్యమైనవి. వీటిమీద అవగాహన, నమ్మకం లేనివారు ఎన్నటికీ నాయకులు కాలేరు. నేటి మన సమస్య ఇదే. గమ్యాలు, స్ఫూర్తి ఉంటాయి నాయకుల్లో... అయితే అవి తమ కుటుంబానికి మాత్రమే పరిమితమై ఉంటాయి. సంఘానికి, దేశానికి వర్తించవు.

గాంధీజి లాంటి వ్యక్తులు మనకు జ్ఞాపకాలుగా మిగిలిపోయారు, గోడలమీద పటాలైపోయారు తప్పితే, స్ఫూర్తి ప్రదాతలుగా కాదు.

మరో ముఖ్యమైన విషయమేమిటంటే, నాయకులు మనలాంటి వారే. ఇతర గ్రహాల వాసులుకారు. మనమూ కృషిచేసి నాయకులుగా మారొచ్చు. మన వ్యవస్థలో భాగస్వాములు కావచ్చు.

అంటీ ముట్టనట్లు ఉండటం; తనదాకా వచ్చిందాకా ఏదీ పట్టించుకోకపోవటం; దేన్నీ ప్రశ్నించకపోవటం; అంతా మన ఖర్మే అని సర్దుకుపోవటం మనందరినీ పీడిస్తున్న సమస్యలు.

ఇది మన దేశం కాదా? మన దేశ సమస్యలు మనవి కావా? నిమ్మకు నీరెత్తినట్లుగా, అన్నిటినీ నిరాశతో ఎందుకు అంగీకరిస్తాం? దేన్నీ ఎందుకు ప్రశ్నించం? పోరాడం??

మనలో చైతన్యం; మన హక్కులపైన అవగాహన; ప్రశ్నించే నైజం – అన్నిటికన్నా ముఖ్యంగా నాయకత్వ లక్షణాలపైన అవగాహన, మన బాధ్యతల గురించిన స్పృహ – ఇవి మన ఆయుధాలుగా మారాలి.

నాయకుడంటే ఒక దేశ ప్రధానమంత్రో; రాష్ట్ర ముఖ్యమంత్రో లేక మంత్రిగారో కానవసరం లేదు. కుటుంబ వ్యవస్థ నుంచి అన్ని వ్యవస్థలకు చిన్నా పెద్దా తేడా లేకుండా, నాయకులతో, నాయకత్వంతో అవసరం ఉంటుంది. సమర్థుడైన తండ్రి నీడలో ఎలాగ కొన్ని కుటుంబాలు మూడుపూవులు ఆరుకాయలుగా వృద్ధి చెందుతాయో, అలాగే సమర్థులైన నాయకుల నేతృత్వంలో నగరాలు, జిల్లాలు, రాష్ట్రాలు, దేశాలు సుఖశాంతులతో పురోగమిస్తాయి.

ఒక మంచి కమీషనరో లేక మేయరో నగర ప్రవేశం చేసి, దాన్ని పూర్తిగా సంస్కరించిన, మార్చి వేసిన సంఘటనలు మనదేశంలోనే ఉన్నాయి.

శ్రీ నితీష్ కుమార్ బీహార్ రాష్ట్రాన్ని పూర్తిగా సంస్కరించి, అభివృద్ధి దిశగా ఆ రాష్ట్రాన్ని నడపడం లేదా! ఇది నేటి మనదేశ చరిత్రే కదా!

అలాగే గుజరాత్ రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో ముందంజ వేయించడం లేదా ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నరేంద్ర మోడి.

శ్రీ ఎస్.ఆర్.రావ్ అని మన తెలుగువారే కొన్నేళ్లక్రితం గుజరాత్‌లోని సూరత్ నగరం ప్లేగు వ్యాధితో నానా కష్టాల్లో చిక్కుకుపోయాక, ఆ నగరాన్ని ఎంతో అభివృద్ధిచేసి సరికొత్త రూపాన్ని అందించారు.

చెప్పుకుంటూపోతే ఇలా ఎన్నో చరిత్రాత్మక విశేషాలు, సంఘటనలు కనబడ్తాయి మనకు.

మన దేశ సమస్యల పరిష్కారంలో మనందరికి బాధ్యత ఉంది. అది గుర్తిస్తే, సగం సమస్య సమసిపోయినట్లే. అలా కాకుండా, నేను సమస్యలను ఎత్తి చూపిస్తాను తప్పితే, వాటి పరిష్కారానికి బాధ్యుణ్ణి కానంటే, మనదేశ సమస్యలకు పరిష్కారం ఎన్నటికీ లభించదు.

మనం మనదేశ సమస్యల్లో భాగమా? లేక వాటి పరిష్కారంలో భాగమా – ఆలోచించి ఒక నిర్ణయానికి రావాలి.

విజ్ఞులైన వారిని ప్రశ్నిస్తే మనందరం పరిష్కారంలో భాగంగా మారాలని చెబుతారు.

నూట ఇరవై కోట్ల జనాభా సమస్యలని కేవలం ప్రభుత్వాలే, మన భాగస్వామ్యం లేకుండా, తీరుస్తాయనుకోవటం వెర్రికాక, మరేది కాదు.

ఇటువంటి అంశాలను, ముఖ్యంగా నాయకత్వానికి సంబంధించిన విషయాలను దృష్టిలో పెట్టుకొని ఈ చిన్న పుస్తకాన్ని రాయటం జరిగింది. ఇందులో చేర్చిన పలు వ్యాసాలు ఆంధ్రజ్యోతి దినపత్రిక, ఆదివారం సంచికలో 'ఎజికె వారం వారం' శీర్షిక క్రింద ప్రచురింపబడినవే. వాటికి లభించిన స్పందనే ఈ పుస్తకానికి స్ఫూర్తి. ఆంధ్రజ్యోతి బిజినెస్ ఎడిటర్ శ్రీనివాస్ గారికి 'ఎజికె వారం వారం'కు ఇచ్చిన ప్రోత్సాహానికి ధన్యవాదాలు.

పుస్తక రూపమిచ్చిన ఎమెస్కో కుమార్ గారికి, ఎమెస్కో అధినేత విజయ కుమార్‌గారికి హృదయ పూర్వక నమస్కారాలు.

తెలుగు భాషలో ఇది నా పదకొండవ పుస్తకం. అభిమానిస్తున్న తెలుగు పాఠకులకు ధన్యవాదాలు.

**చివరగా :**

మంచి నాయకత్వం, మంచి సమాజాన్ని, మంచి దేశాన్ని, మన వారసులకు మంచి భవిష్యత్తును అందిస్తుంది. మనందరం మన మన పరిధులలో నాయకత్వ బాధ్యతలను స్వీకరించి నాయకులుగా రూపాంతరం చెందొచ్చు.

అలా చెందుతామనే ఆశతో...

హైదరాబాదు, మీ

26-12-2011. **ఎ.జి.కృష్ణమూర్తి**

# 1

# నమ్మకం నాయకత్వానికి తొలిమెట్టు

‘నాయకత్వంలోని ముఖ్య లక్షణమిదే... నమ్మిన తన సహచరుల్లో భక్తి విశ్వాసం పెంపొందించి ఈ పని నా స్వంత పని అనే భావనను వారిలో కలిగించి అద్భుతమైన ఫలితాలు రాబట్టుకోవడమే.’



**న**మ్మి మోసపోయిన వాళ్లు లేరనేది సామెత. అయినా సరే నమ్మేవాళ్లు చుక్కల్లో చంద్రుడిలాగా నూటికో కోటికో ఒక్కళ్లుంటారు. నమ్మటం అంత కష్టమా? మన సహచరులను నమ్మి వారికి పూర్తి పగ్గాలు అప్పచెప్పితే, ఒక దెబ్బతో రెండు పిట్టల్లాగా రెండు ప్రయోజనాలు కలుగుతాయి.

మొదటిది: నమ్మి వారి మీద మనం పూర్తిగా ఆధారపడటంతో వారికి మన మీద గౌరవం, మర్యాద, వీటన్నిటి కన్నా మిన్నగా విశ్వాసం పెరుగుతాయి.

రెండోది: దీంతో వారి బాధ్యత పెరిగి వారు చేస్తున్న పనిని సొంత పనిలాగా మార్చుకొని మరింత మెరుగైన ఫలితాలనిస్తారు. నాయకత్వంలోని ముఖ్య లక్షణమిదే... నమ్మిన తన సహచరుల్లో భక్తి విశ్వాసం పెంపొందించి ఈ పని నా

స్వంత పని అనే భావనను వారిలో కలిగించి అద్భుతమైన ఫలితాలు రాబట్టు కోవడమే.

ఎవర్నీ నమ్మకుండా, ఎవరిపైనా ఆధారపడకుండా ఏకో నారాయణుడిలాగా తాను ఒక్కడే ఏవైనా విశిష్టమైన విజయాలు సొంతం చేసుకున్న సంకేతాలు కాని, దాఖలాలు కాని మనకెక్కడా కనిపించవు. ఈ విషయం చర్చకొచ్చినప్పుడల్లా ఒకవైపు ధీరూభాయి అంబానీ గారు దర్శనమివ్వగా, రెండో వైపు అహ్మదాబాదులో నాకు మొదటగా ఉద్యోగమిచ్చిన కేలికో డైరెక్టర్ బంధువు ఒకావిడ దర్శనమిస్తారు. అన్ని విషయాల్లో పూర్తి బాధ్యతను, నిర్ణయాలను నా మీద వదలి మొదటి నుంచే ముద్రా నా సొంత సంస్థ అనే భావం కల్పించి ధీరూభాయిగారు నా మనసులో ముద్రా తప్ప ఇతరమైన ఎటువంటి ఆలోచనలు లేకుండా చేశారు. ఫలితంగా ముద్రా నా సొంత సంస్థగా మారి రేయింబవళ్లు మనసా వాచా కర్మణా శ్రమపడేలా చేసింది.

ఇక రెండో ఉదాహరణకొస్తే నాలో ఒక రకమైన ఏహ్యాభావం కలుగుతుంది. ఈ సంఘటన జరిగి దాదాపు నాలుగు దశాబ్దాలు దాటినా ఎంతో ఎంతో తాజాగా నిలిచిపోయింది నా మనసులో.

నేను కేలికోలో చేరిన కొత్త రోజులు. ఒకరోజున డైరెక్టరుగారి తల్లిగారు నాకు ఫోను చేసి కేలికో ఆసుపత్రి నుంచి ఒక డాక్టరును తమయింటికి పంపమని నన్ను ఆజ్ఞాపించారు. సరేనని నేను ఆ డాక్టరుకి ఫోను చేశాను. ఆయన అడిగారు సమస్య ఏమిటని. నాకు తెలియదు, బహుశా సుస్తీగా ఉందేమోనన్నాను.

కొన్ని నిమిషాల్లో డైరెక్టర్‌గారి తల్లి మళ్లీ ఫోను చేసి, చెప్పిన పని వరకే చేయి; నాకు సుస్తీ అని నీకు చెప్పలేదు కదా; మరి డాక్టరు గారితో అలా ఎందుకన్నావని ఎడాపెడా దులిపేసింది. ఏడుపొక్కటే తక్కువ నాకు ఆ రోజున. నాలో ఉన్న సహజమైన ఉత్సాహాన్ని, ఏదైనా చేయాలనే ప్రేరణ, తపన, పట్టుదలను ఒకే ఒక్క దెబ్బతో తుడిచేసింది ఆవిడ. ఆపై ఇక 9–5 (నైన్ టు ఫైవ్) ఆఫీసు! మనస్సును, ఉత్సాహాన్ని, ఏదైనా సాధించాలనే తపనను ఇంట్లో వదిలి ఉత్త శరీరంతో ఆఫీసుకి ఉదయం తొమ్మిదికెళ్లి సాయంత్రం ఐదుకి ఇంటికి చేరే లక్షలాది, కోట్లాది ఉద్యోగస్థుల్లో నేను ఒకడిగా మారిపోయాను.

నాయకులకు ఉండాల్సిన ముఖ్య లక్షణం తన సహచరుల్లో తాము చేస్తున్న పని ఎంతో ముఖ్యమైంది, ఆ పని వారి సొంత పని లాంటిదే అనే భావన కలిగించటం. దీన్ని ఆంగ్లంలో సైకిక్ ఓనర్‌షిప్ అంటాం. నిజానికి చేస్తున్న పని మన సొంతం కాకపోయినా, మన సొంతమే అనే మనో భావనను కలిగి ఉండటమన్న మాట. ఈ భావాన్ని కల్గించే వారే నిజమైన నాయకులు. వీరు తమ సహచరులతో కలిసి అద్భుతాలు సృష్టిస్తారు. అలా కాని పక్షంలో టెన్నిస్ లేక చెస్ లాంటి ఒక్కరు మాత్రమే ఆడే గేమ్స్‌లో కాని లేక పెయింటర్ గానో, సింగర్ గానో వ్యక్తిగతంగా విజయాలు సొంతం చేసుకోవచ్చు. టీమ్ ఆటల్లోగాని, వృత్తి వ్యాపార రంగాల్లోగాని మరేదైనా రంగంలో గాని ఒక్కరిని మించిన అవసరమున్న చోట ఇతరుల్ని నమ్మితేనే ముందంజ.

అయితే ఇలా నమ్మి పగ్గాలు మరొకరికి అప్పచెప్పడానికి బోల్డంత ధైర్యం కావాలి. కొన్ని వందల వ్యాపార వేత్తలతో నాకు పరిచయముంది. ప్రతిచోట విలువైన ఉద్యోగులు కనబడ్డారు కాని ప్రతి చిన్న విషయం బాస్ దగ్గరకు పోవాల్సిందే. కొన్ని సంస్థల్లోనయితే బాస్ గారి సతీమణి దగ్గరకు! మరి ఈ విలువైన మనుష్యుల పటాలం దేనికో అర్థం కాని విషయం.

నాలుగు దశాబ్దాలుగా కార్పొరేట్ రంగంతో పరిచయమున్న వ్యక్తిని నేను... నాకు ఇంతవరకు ఏమాత్రం బోధపడని విషయం ఏదైనా ఉందా అంటే ఇదే.

కోట్లల్లో, లక్షల్లో వేతనాలు చెల్లిస్తూ ఎంతో విలువైనా ఉద్యోగస్థుల్ని వెతికి పట్టి బుజ్జగించి ఒప్పించి తెచ్చి మీ సంస్థల్లో చేర్చుకొన్నారే, మరి వారినెందుకు వారి వారి నిర్ణయాలను తీసుకోనివ్వరు?

డాక్టరు గారి దగ్గరికెళ్లి ఫలానా మందు రాసివ్వమనడం భావ్యమా?

అలాగే టీచర్‌కి పాఠాలు నేర్పడం సబబా?

కాపలా కుక్కని పెట్టుకుని మనం రాత్రులు నిద్రపోకుండా ప్రతి అలికిడికి లేచి భౌ భౌ మనడం సహజమేనా?

వివిధ రంగాల్లో నిష్ణాతులైన వారిని తమ సంస్థల్లో నియమించుకొని వారి కర్తవ్యాలను ఎలా నిర్వహించుకోవాలో ఎలాంటి నిర్ణయాలు తీసుకోవాలో వారికి

చెప్పటం న్యాయమేనా? వారు చేయాల్సిన పనిని ఎందుకు చేస్తాం మనం? ఆ పనిని చేయగల సామర్థ్యం వారిలో లేదా? మరెందుకు వారిని నియమించు కొన్నట్లు?

ఈ మధ్య ఒక ఐటి కంపెనీలో లీడర్‌షిప్ మీద ఉపన్యాసమిచ్చాను. ఆ కంపెనీ ఉన్నతాధికారి ఉపన్యాసం అయ్యాక నా దగ్గరకొచ్చి తాను ఎంతగానో మారాలి అని చెప్పి, తన కళ్లు తెరిపించినందుకు నాకు ధన్యవాదాలు చెప్పాడు. వందలమంది తన సంస్థలో పనిచేస్తున్నప్పటికి అన్నిట్లో వేలుదూర్చి నిర్ణయాలు చేస్తుండేవాడట ఈ పెద్దమనిషి.

ప్రకటన, ఇంకా మార్కెటింగ్ రంగాల్లో నలభైయేళ్లకు పైగా కృషి చేస్తున్నాను. కొంతమంది క్లయింట్లు ప్రకటనలు రూపొందించే ప్రక్రియలో నాకు గైడెన్స్ ఇస్తూ ఉంటారు. ఫలానా కలర్ బాగుంటుందా? ఫలానా పద ప్రయోగం ఎలాగుంటుంది?? అని. నా కన్నా నా రంగంలో వారికి ఎక్కువ ప్రావీణ్యం ఉంటే, మరి నన్నెందుకు సంప్రదిస్తున్నట్లు? ఈ మాటే వారితో అంటాను! సహృదయమున్నవాళ్లు, నా మనోభావాలను గౌరవించే వారైతే వెంటనే తమ తీరును మార్చుకుంటారు. నా పనిని నన్ను చేయనిస్తారు. ఇది నా సంస్థ, నా డబ్బు కనుక అన్నింట్లో తలదూర్చే అర్హత, అవసరముందనుకునే వారితో పనిచేయటం కష్టమై మానుకోవాల్సి వస్తుంది.

ఎవర్నీ నమ్మకపోవడం, ఎదుటివారి ప్రతిభా పాటవాలను గౌరవించలేక పోవటం, వారికి పూర్తి బాధ్యతలు అప్పగించక పోవడం, అడుగడుగునా ఇతరులను సూపర్‌వైజ్ చేయాలనుకోవడం ఒక పెద్ద సమస్య. మన ప్రగతిని అడ్డుకొంటున్న ఒక భయంకరమైన అంటు వ్యాధి. దీనికి మనం ఎంత తొందరగా స్వస్తి పలికితే అంత మంచిది.

నమ్మి మోసపోయిన వారు లేరని తెలుసు. ఒక వేళ ఎవరైనా మోసపోయినా లా ఆఫ్ యావరేజెస్... అంటే సగటు లెక్కల ప్రకారం మనం నమ్మిన ప్రతి పది మందిలో ఇద్దరో ముగ్గురో మనను మోసం చేసి ఉండొచ్చు లేదా మన అంచనాలను చేరలేక మనను నిరుత్సాహపరచి ఉండొచ్చు. మిగతా ఏడెనిమిది మంది సంగతేమిటి? అంటే 70 నుంచి 80 శాతం దాకా మన నమ్మకాన్ని వమ్ము చేయలేదు కదా.


నమ్మటం నేర్చుకోవాలి. ఇదే నాయకత్వానికి తొలిమెట్టు.

ఈ తొలిమెట్టే మిగతా మెట్లకు పునాదిగా మారి, మన ఎదుగుదలను బలోపేతం చేసేది...

# 2

# యథా రాజా తథా ప్రజా

'అమెరికన్లు అంటారు దీన్నే వాక్ ది టాక్ అని. చెప్పిందే చేయవయ్యా మహాశయా అని అర్థం వచ్చే నానుడి ఇది. రెండింటి భావాలు ఒకటే.. మనని చూచి మన సహచరులు నడుచుకుంటారని.'



ఎదుటి వారి మీద విశ్వాసం, వారి ప్రతిభా పాటవాలపై నమ్మకం లేనప్పుడు, అసలు ఎందుకు వారిని తమ సంస్థల్లోకి తీసుకున్నట్లు? నాలుగు దశాబ్దాలుగా భారతీయ వ్యాపార రంగంతో పరిచయమున్న నాకు ఈ ప్రశ్న నేటికీ కొరుకుడు పడని ప్రశ్నగానే మిగిలి పోయింది. నాయకత్వ లక్షణాలపై ఏ మాత్రం అవగాహన లేకపోవటం ఒక కారణం కాగా వికసించని వ్యక్తిత్వం మరో కారణం కావచ్చునేమో!

సహచరులు మన బరువులో, బాధ్యతల్లోఏదైనా భాగం పంచుకోవాలంటే కొంతకాలమైనా నిలకడగా, కాస్తో కూస్తో స్ఫూర్తితో పనిచేయాలి కదా! ఇక్కడే నాయకుడి నాయకత్వపు లక్షణాలకు పరీక్షా కాలం వచ్చేది. మంచి నాయకుడు లేనిదే, మంచి టీమ్ లేదు. మంచి టీమ్ లేనిదే మంచి భవిష్యత్తు లేదు మనకు, మన సంస్థకు.

సో, ప్రగతికి మూలాధారం నాయకత్వం. చూస్తున్నారుగా, నాయకత్వం లోపించిన మన దేశం ఎలా రోజుకో కుంభకోణంలో చిక్కుకొని దిక్కుదారి తోచక ఎలా అతలాకుతలమై పోతుందో! కుటుంబాలకి, సంస్థలకి, పల్లెలకు, పట్టణాలకు, రాష్ట్రాలకు, దేశానికి, ప్రపంచానికి మంచి పటిష్ఠమైన నాయకత్వం ఎంతో ముఖ్యం. మనకు బాగా తెలిసిన నానుడి.. 'యథా రాజా తథా ప్రజా...' అంటే రాజుగారి లాగే, వారి రాజ్యం, వారి ప్రజలూను. భోజరాజు, కాళిదాసుగార్ల కథను క్లుప్తంగా ఉదాహరిస్తానిక్కడ.

లక్ష్మీ సరస్వతుల ఆశీస్సులు పొందినవాడు భోజరాజు. గొప్ప కవి. అపర కుబేరుడు. ఎన్నో సద్గుణాల మధ్య జూదం అనే వ్యాధి పట్టి పీడిస్తుంది భోజరాజుని. ఎలాగైనా ఈ వ్యసనం నుంచి దూరం చేయాలనుకొన్నాడు కాళిదాసు.

ఒక రోజున భోజరాజు రోజూ జూదశాలకు వెళ్లే దోవలో ఒక మాంసం అమ్మే అంగడిలో మారు వేషంలో బేరం చేస్తూ కనబడ్డాడు కాళిదాసు.

భోజరాజు గారు తన రథాన్ని ఆపించి ఆ అంగడిలోకి ప్రవేశించి అన్నాడు..

"అయ్యా తమరు విప్రుల్లాగా ఉన్నారు. మాంసం కొనటం తగునా" అని.

కల్లుతో నంజుకోవటానికి మాంసం అవసరం కదా అన్నాడు ఆవిప్రుడు.

తమరు కల్లుకూడా తాగుతారా మహాప్రభో అన్నాడు భోజరాజు.

ఎప్పుడైనా వేశ్యాగృహానికి వెళ్లినప్పుడు మాత్రమే కల్లు సేవిస్తాను అన్నాడు ఆ బ్రాహ్మణుడు.

మరి వీటన్నిటికీ డబ్బు ఎలా వస్తుంది? అని ప్రశ్నించాడు రాజుగారు.

జూదం ఆడ్తానన్నాడు మారు వేషంలో ఉన్న కాళిదాసు.

భోజరాజు నోట్లో కరక్కాయ పడింది. ఆ రోజు నుంచి జూదశాల వైపు కన్నెత్తి చూస్తే ఒట్టు.

'యథా రాజా తథా ప్రజా'కి చక్కని ఉదాహరణ కదూ ఇది.

అమెరికన్లు అంటారు దీన్నే 'వాక్ ది టాక్' అని. చెప్పిందే చేయవయ్యా మహాశయా అని అర్థం వచ్చే నానుడి ఇది. రెండింటి భావాలు ఒకటే.. మనని చూచి మన సహచరులు నడుచుకుంటారని.

ప్రతి వ్యక్తికి ఎవరో ఒకరో, ఇద్దరో ఆరాధ్య వ్యక్తులు.. రోల్ మోడల్స్ ఉంటారు. అంటే వారు నమ్మి, వారిని అనుసరించే వ్యక్తులు. కనుక ఈ వ్యక్తులపై ఎంతో గురుతరమైన బాధ్యతలుంటాయి. వీరి ప్రతి కదలిక, వారి సహచరులకు వేద పాఠమై మార్గదర్శకంగా మారిపోతుంది.

నేను ముద్రాకు చైర్మన్‌గా ఉన్నప్పుడు ప్రతి రోజూ ఉదయం 9.15 కల్లా ఆఫీసు చేరేవాడిని. ఆఫీసు మొదలయ్యేది 9.30కి. ఎవరైనా ఆలస్యంగా వస్తే పెద్దా చిన్నా తేడా లేకుండా నిర్మొహమాటంగా అడిగేవాణ్ణి ఎందుకాలస్యమైందని. ఒక్క క్షణం ఊహించి చూడండి: నేను రోజూ ఆలస్యంగా ఆఫీసుకొస్తూ మిగతా వారిని ఎందుకు ఆలస్యంగా వస్తున్నావని అడిగితే నగుబాటే కదా!

మన దేశం నేడు ప్రపంచంలో అందరి నోళ్లలో నానటానికి, నగుబాట్లు కావడానికి, లంచం తప్పు అని చెప్పే నాయకుడు లేక పోవటం వల్లేకదా. అందరూ లంచాలు తీసుకునే వారే, లేకపోతే ఇచ్చే వారే! ఏమని చెప్పగలం లంచం తప్పని! అందుకే లంచాల భారతంగా మారిపోయింది మన దేశం. మరో స్వాతంత్ర్య ఉద్యమంటూ అన్నా హజారే లాంటివారు ఉద్యమించవలసి వస్తూంది! ఎంతటి దౌర్భాగ్యం.

టైమ్‌కి ఆఫీసుకి రావాలని చెప్పే బాస్ తను టైముకి రావాలి. లంచాలు అపచారం అని చెప్పే నాయకుడు లంచాలకు అతీతంగా ఉండాలి. అప్పుడే దీన్ని వాక్ ది టాక్ అనేది. చెప్పేది వేరు, చేసేది వేరు.. ఇది ఒక భయంకరమైన చీడ. నాయకుడికి ఓ రూలు, అనుచరుడికి మరో రూలు.. ఇది మరో చీడ.

చెప్పిందే చేసే విషయంలో కూడా మన గాంధీ మహాత్ముడిని ఒక గొప్ప రోల్ మోడల్‌గా తీసుకోవచ్చు మనం.

ఒక రోజున గాంధీ మహాత్ముడి వద్దకు ఒక తల్లి తన పిల్లవాడితో వచ్చి ఆయన్ను అభ్యర్థించింది తన కొడుకును విపరీతంగా బెల్లం తినే అలవాటు నుంచి

ఎలాగైనా మాన్పించమని. రెండు వారాల తర్వాత తిరిగి రమ్మన్నారు గాంధీజీ ఆమెను తన కొడుకుతో సహా. ఎందుకో అర్థం కాకపోయినా సరేనని, రెండు వారాల తర్వాత తల్లీ, కొడుకు తిరిగి వచ్చారు.

అప్పుడు గాంధీగారు చెప్పారు ఆ అబ్బాయికి బెల్లం అతిగా తినడం మంచిది కాదు కనుక ఆ అలవాటుని వెంటనే మానుకోమని.

ఆశ్చర్యపోయిన తల్లి గాంధీగారిని అడిగింది: ఆ మాట మీరు రెండు వారాల క్రితం మేము వచ్చినప్పుడు చెప్పి ఉండవచ్చు కదా అని.

దానికి గాంధీగారి సమాధానం... అప్పుడు నాకు బెల్లం తినే అలవాటుంది, దాన్ని ఈ రెండు వారాల్లో మానేశాకే మీ అబ్బాయికి బెల్లం తినడం మానేయమనే సలహా ఇచ్చాను అని.

ఎవరికైనా తాను చేసే పనినే ఇతరులకు చేయమని చెప్పే నైతిక అధికారం ఉంటుంది. లేకుంటే నేటి భారతం లాగా మారిపోతుంది. నాయకులు అంజనం వేసి చూసినా కనబడరు! నాయకులమని చెప్పుకునే వారు, చెప్పేదొకటి, చేసేదొకటి! గాంధీ లాంటి వారికి చెప్పేది చేసేది రెండు ఒకటే. అందుకే వారు మహాత్ము లయ్యారు. మనం ఇలా మిగిలి పోయాం. మహాత్మాలాంటి వారి ప్రసంగాలు దేశానికి మార్గదర్శకమయ్యాయి. మనవి వుత్తి మాటలుగా, వ్యర్థ ప్రసంగాలుగా మిగిలి పోతున్నాయి.

మరో చిన్న ఉదాహరణ చెప్తాను నాయకులకు ఇతరులకు ఉన్న వ్యత్యాసం గురించి.

ఒకసారి రతన్ టాటా గారు తన సహచరులతో కలిసి కారులో ప్రయాణం చేస్తున్నారట. మధ్యలో కారు ఆగిపోయింది. అందరూ కారు దిగారు. డ్రైవరు కారుని సరిదిద్దే ప్రయత్నంలో మునిగి పోగా ఇతరులు రకరకాల పనుల్లో బిజీ అయ్యారు.. కబుర్లు, స్మోకింగ్ వగైరాలు, ఒక్కరు మినహా ! రతన్ టాటా గారు! ఆయన డ్రైవర్ దగ్గరి కెళ్లి అతనికి సహాయం చేయసాగాడు.

ఎంతో చిన్న సంఘటన ఇది. అయితే ఒక వ్యక్తి నాయకత్వ లక్షణాలను మనకు ఎంతో క్లియర్‌గా బలంగా చెప్పే సంఘటన ఇది. అలాంటి లక్షణాలు


కలవాడు కనుకే రతన్‌టాటా తాను గత మూడు దశాబ్దాలుగా నేతృత్వం వహించిన టాటా గ్రూప్‌ను ఒక అంతర్జాతీయ వ్యాపార సామ్రాజ్యంగా అందరూ గౌరవించేలా రూపుదిద్దగలిగారు.

యథా రాజా తథా ప్రజా అనే సత్యాన్ని గుర్తించి, ఆచరించటం నాయకత్వ లక్షణాల్లో ఎంతో ముఖ్యమైన సూత్రం.

# 3

# ఓటమి అనాథ

‘‘సక్సెస్ హేస్ ఎ మిలియన్ ఫాదర్స్... ఫెయిల్యూర్ హేస్ నన్’. అంటే ప్రతి విజయాన్ని తమదే అని సొంతం చేసుకునే వారు పది లక్షల మంది ఉండగా... ఓటమిని సొంతం చేసుకునే వారు ఒక్కరూ ఉండరు. ఓటమి అనాథ.’



మరో సూత్రం : విజయాలను పంచు. అపజయాలను సొంతం చేసుకో.

ఆంగ్లంలో ఒక సామెత ఉంది. 'సక్సెస్ హేస్ ఎ మిలియన్ ఫాదర్స్... ఫెయిల్యూర్ హేస్ నన్'. అంటే ప్రతి విజయాన్ని తమదే అని సొంతం చేసుకునే వారు పది లక్షల మంది ఉండగా... ఓటమిని సొంతం చేసుకునే వారు ఒక్కరూ ఉండరు. ఓటమి అనాథ.

ఇది నూటికి నూరుపాళ్లు నిజం.

ఈ అనుభవం మనకు నిత్యం ఎదురవుతూనే ఉంటుంది ప్రతి చిన్నా, పెద్దా విషయంలో. ఏదైనా మంచి జరగ్గానే అందరూ కాలర్లెత్తుత్తారు. పని వికటించగానే పక్కవారి మీదకు నెట్టేస్తారు. ప్రతి విజయం నాదీ అని సొంతం

చేసుకునే ప్రలోభం నుంచి బయటపడ్డ వాడు మాత్రమే నాయకుడు కాగలడు. విజయాన్ని స్వాహా చేసి, అపజయాన్ని ఇతరుల ముంగిట్లోకి తోసేవాడు నాయకుడిగా ఎప్పుడూ ఎదగలేడు.

ఈ పద్ధతి ఒక సంస్థకి గాని, ఒక టీముకు గాని చేసే అపకారం అనూహ్యామైంది. స్వయంకృతం కాని అపజయాలకు బాధ్యత వహించి అప్రతిష్ఠ పాలు కావడం ఎవ్వరూ ఓర్చుకోలేరు. పరిణామంగా అలాంటి సంస్థల నుంచి ముందుగా మంచి వారు నిష్క్రమిస్తారు. పనికిరానివారు, బాస్‌లను కాకా పడ్తూ, జేజేలు కొట్టేవారే మిగిలిపోతారు.

అటువంటి వారి వల్ల ఏం ప్రయోజనముందో చెప్పండి.

జె.ఆర్.డి టాటా పేరు వినే ఉంటారు మీరు. భారతదేశం గర్వించదగ్గ వ్యాపారవేత్తల్లో వీరు ఒకరు. ఆయన నేతృత్వంలో టాటా గ్రూపు ఒక గొప్ప సంస్థగా రూపు దిద్దుకుంది. ఆయన ప్రతిభకు ఎన్నో గుర్తింపులు సత్కారాలు లభించాయి. ఎవరైనా టాటా గ్రూపు ప్రగతికి తనని మెచ్చుకున్నప్పుడు ఆయన ఇలా స్పందించేవారు: ఎయిరిండియా పురోగతికి తాను ఎంతో కొంత ప్రశంసలకు అర్హుడే కాని, టాటా కంపెనీల పురోగతికి, ఉన్నత ప్రమాణాలకు ఆయా కంపెనీలను నడుపుతున్న ఉన్నత ఉద్యోగులే కారణమని నిర్మొహమాటంగా చెప్పేవారు.

ఈ శైలే లీడర్‌ను నిలబెట్టేది. వారిని వారి సంస్థలను ముందుకు నడిపించేది.

శ్రీ దర్బారీ సేఠ్ టాటా గ్రూప్‌లో చాలా సీనియర్. పేరు ప్రతిష్ఠలు, అందరి మన్ననలను పొందిన వ్యాపారవేత్త. వారు జె.ఆర్.డి టాటా గురించి వ్యాఖ్యానిస్తూ "టాటా గ్రూప్‌లో సొంత వ్యక్తిత్వం, అభిప్రాయాలు గల పలువురు సీనియర్ ఉద్యోగులను ఉత్సాహపరుస్తూ, వారి బలాల్ని ప్రశంసిస్తూ, బలహీనతల్ని పట్టించుకోకుండా తన నాయకత్వ బలంతో గ్రూప్‌ను ఎంతో వృద్ధి చేశారు" అని అన్నారు.

టాటా గ్రూప్‌లో ఎందరో అతిరథులు, మహారథులు పనిచేశారు. సర్ హోమి మోడి, సర్ అర్దెషియర్ దలాల్, సర్ జహంగీర్ గాంధీ, రూసీ మోడి, సుమంత్ ముల్‌గాంకర్, దర్బారీ సేఠ్ వీరిలో ముఖ్యులు. వీరందరూ అంతర్జాతీయంగా ప్రసిద్ధి గాంచి, వారి వారి రంగాల్లో నిష్ణాతులుగా పేరుపొందారు. ఇలాంటి ఉద్దండులను తన నాయకత్వ చాతుర్యంతో, తన సంస్థలకు కొన్ని దశాబ్దాల

పాటు సేవలందించేలా చేశారు టాటా. ఇది అంత సులభమైన ప్రక్రియ కాదు. పలు సంస్థల్లో దిగ్గజాల్లాంటి సీనియర్ ఉద్యోగులను పలు ప్రలోభాలతో అనూహ్యమైన వేతనాలతో చేర్చుకొని కొన్ని నెలలు కూడా వారిని సద్వినియోగ పరచుకోకపోవటం వల్ల వారు బయటి కెళ్లి పోవడం, తరచూ మనకు కనిపిస్తూనే ఉంటుంది. ఇలాంటి సంస్థలు వందల్లో వేలల్లో ఉండగా.. టాటా లాంటి సంస్థలను వేళ్ల మీద లెక్క పెట్టొచ్చు.

ఉద్యోగులు సంస్థలకు అందించే విశిష్ట సేవలకు గుర్తింపుగా, సంస్థ లాభాలలో వీరిని భాగస్వాములను చేయడం, సంస్థ షేర్లను వీరికి కేటాయించడం ఒక గొప్ప నాయకత్వ లక్షణం. 1990వ దశకంలో నారాయణ మూర్తి ఈ పథకాన్ని ఇన్ఫోసిస్‌లో ప్రవేశపెట్టారు. ఈ సంస్థ సాధించిన అనూహ్య ప్రగతికి దీన్ని ఒక కారణంగా చెప్తారు పలు వ్యాపార విశ్లేషకులు.

**నాయత్వంలో మరో ముఖ్య అంశం : నాయకులు ముందుండి నడిపించడం.** ఆర్మీలో నాయకులు ముందుండి సిపాయిలను నడిపిస్తారు. రిమోట్ ద్వారానో లేక వెనుక నుంచో కాదు.

ముద్ర ప్రారంభ దశలో ఆ సంస్థ ఎంతో చిన్నదిగా ఉన్నప్పుడు అనుదినం దాదాపుగా అందరం కలుసుకొని, కలిసి మెలిసి పనిచేస్తుండే వాళ్లం. సంస్థ పెద్దదై దేశమంతా విస్తరించి వందల్లో ఉద్యోగులు ఉన్నప్పుడు అందరినీ కలుసు కోవడం, కలిసి పనిచేయటం అసాధ్యం. అందువల్ల సందర్భాలు కల్పించుకొని ప్రతి పట్టణానికి సంవత్సరానికి రెండు మూడుసార్లయినా వెళ్లి అందర్నీ కలిసి పరామర్శించే వాడిని. ప్రతి ఉద్యోగి జన్మదినానికి ఏదో ఒక చిన్న బహుమతి నివ్వడం, మంచి ఫలితాలను గుర్తించి మెచ్చుకోలుతో పాటు తగిన బహుమతు లివ్వటం అనవాయితీగా మార్చాం. టీమ్ డేలని, యానివర్సరీలని రకరకాల కార్యక్రమాల ద్వారా అందర్నీ కల్సుకోవటం, ఒకరంటే ఒకరికి మక్కువ, గౌరవం పెరిగేలా చేసే వాళ్లం.

ఇంతేకాదు ప్రతి దీపావళికి సంస్థలోని ప్రతి మేనేజర్ సతీమణికి ఒక చీర, ఆమె భర్త సేవలను ప్రశంసిస్తూ ఒక లెటర్ పంపేవాళ్లం. ఈ ప్రక్రియ సంస్థ మీద వారి గౌరవం పెంచింది. సంస్థకు తాము ఎంతో ముఖ్యమనే నమ్మకాన్ని కలిగించింది. ఇది ముద్రాకు ఎంతో మేలు చేసింది.

# 4

# అందరి వాడు నాయకుడు

'మీరెప్పుడైనా చెప్పా పెట్టకుండా నన్ను కలుసుకోవచ్చు అని ధీరూభాయ్ అంబానీ మాతో చెప్పేవాడు. అలాగే చేసేవాడు. అందుకే వారు నేతలయ్యారు. వారితో మనం గడపిన క్షణాలు మన జీవితాల్లో పాఠాలుగా, మార్గ దర్శకాలుగా మారినాయి.'



పీపుల్ వర్క్ ఫర్ పీపుల్ నాట్ ఫర్ ది ఆర్గనైజేషన్స్ అనేది ఎంతో నిజం.

ఎన్నోసార్లు గమనించాను నేను పలు సంస్థల్లో ఒక లీడరు ఏదైనా సంస్థతో తెగతెంపులు చేసుకుంటే, ఆయనతో పాటు ఆయన మీద గురి ఉన్న పలువురు ఉద్యోగులు ఆ సంస్థను వీడి వెళ్లిపోవటం. ఎందుకంటే మనలో చాలామందికి సంస్థ అంటే మనం గుర్తించిన నాయకుడు మాత్రమే. సంస్థ అంటే నాయకులు, వారు అవలంబించే విలువలే కాని, ఆ సంస్థకు చెందిన నేమ్ బోర్డో లేక ఇతర సరంజామానో కాదు కదా!

నాయకత్వం ప్రతి సంస్థకు లైఫ్‌లైన్ లాంటిది. జీవనాధారం.. అది అదృశ్యంగా ఉంటే నిరాశే మిగిలేది సంస్థలో. అందుకే నాయకత్వం కనబడుతూ ఉత్సాహపరుస్తూ తమ టీమ్‌లను, సంస్థలను పురోగమింప చేయాలి.

వాల్‌మార్ట్ ప్రపంచంలోని నెంబర్‌వన్ రిటైల్ సంస్థ. అమెరికన్ కంపెనీ ఇది. అమెరికన్ల జీవితాలతో పెనవేసుకుని ఒక ముఖ్యమైన భాగంగా మారిన గొప్ప సంస్థ వాల్‌మార్ట్. ఆ సంస్థ స్థాపకుడు సామ్ వాల్టన్ తన సిబ్బందిని ముందుండి నడిపించే తీరు ముచ్చటగా ఉంటుంది. మేనేజ్‌మెంట్‌లో ముఖ్యంగా నాయకత్వ లక్షణాలను తన వైఖరిలో ప్రతిబింబించేలా చూడటంలో సామ్ వాల్టన్‌ని ఒక గొప్ప పాత్రంగా చెప్పుకోవచ్చు.

వాల్‌మార్ట్ ప్రపంచంలో నలుమూలలా విస్తరించిన సంస్థ. దానికి సొంత విమానం ఉంది. దానికి సామ్ వాల్టన్ పైలట్‌గా కూడా వ్యవహరించగలడు. డాబుకో దర్పానికో కొన్న విమానం కాదది. తనకెప్పుడు వీలైతే అప్పుడు ముందు చెప్పకుండా వివిధ నగరాలకెళ్లి, తన సిబ్బందిని కలుసుకుని ఆశ్చర్యపరచటం, ఆనందపరచటం, వ్యాపారం అభివృద్ధి చేయడానికై కృషి చేయడం కోసం కొన్న విమానమది. ఇలాంటి ఒక విజిట్‌లో సామ్‌వాల్టన్‌ను కలుసుకుని అమితంగా ప్రభావితమైన ఒక వాల్‌మార్ట్ ఉద్యోగి కథనం:

అనుకోకుండా ఒక రోజు ఉదయం స్టోర్‌లోని ఉద్యోగులు వచ్చే వేళ 7 గంటలకు సామ్ వాల్టన్ మా స్టోర్‌కొచ్చాడు. స్టోరంతా చూశాక, మా అందరితో ఒక మీటింగ్ ఏర్పాటు చేశాడు. ఇది ముందుగా ప్లాన్ చేసుకున్న మీటింగ్ కాకపోవటం వల్ల కుర్చీలు, బల్లలు ఏమీ లేవు. మేమందరం నేల మీద కూర్చున్నాం. సామ్ మోకాళ్ల మీద కూర్చొని మాతో మాట్లాడాడు. ముఖ్యంగా కస్టమర్లని ఎలా సంతృప్తిపరచాలో అనే విషయం మీద. ఆ రోజున ఈ మీటింగ్ పాల్గొన్న అందరు ఉద్యోగులు అమితానందం చెందారు. అంతే కాదు తమ సంస్థ గురించి, అందులో తమకు పనిచేసే అవకాశం దొరికినందుకు అందరూ ఎంతో గర్వంగా ఫీలయ్యారు. అటువంటి సంస్థలో పని చేస్తున్నందుకు మమ్మల్ని మేమే అభినందించుకొన్నాం.

మాలో ఒకడిగా మమేకమై మనందరం ఒక గూటి పక్షుల్లాగా అందరం సమానమేనన్న భావోద్రేకాన్ని మాలో కలిగించాడు సామ్. తాను పెద్ద ధనికుడనని, ఆ సంస్థకు యజమానినని, మేము అక్కడ పనిచేసే సామాన్య వర్కర్లమనే భావన ఏ మాత్రం కల్గనీయలేదు. ఆయన్ను మేమెటువంటి ప్రశ్నలనైనా అడగవచ్చు అనే ధైర్యం, చనువు కల్పించాడు ఆ మీటింగ్‌లో.

సామ్ వాల్టన్ దొరికిన ప్రతి అవకాశాన్ని ఉపయోగించుకున్నాడు తన ఉద్యోగులతో సంబంధ బాంధవ్యాలని పెంచుకోవటానికి: తమ హెడ్‌క్వార్టర్స్‌లో ఉన్న స్టూడియో నుంచి తన ఉద్యోగులతో రేడియో ద్వారా, టీవీ ద్వారా టచ్‌లో ఉండేవాడు. వాళ్ల సాధకబాధకాలు తెలుసుకుని వాటి నివారణ ఉపాయాలు చెప్పేవాడు. యూనియన్స్ తెచ్చే పలు సమస్యలని నేరుగా తన ఉద్యోగులతో టచ్‌లో ఉండటం వల్ల నివారింపగలిగాడు. గొప్ప నాయకులు, తాము అందరికీ అందుబాటులో ఉన్నామని, తమని ఎప్పుడైనా ఎవరైనా వచ్చి కల్సుకోవచ్చనే భావనని కల్గిస్తారు. అదే నిజమైన నాయకత్వ లక్షణం.

'మీరెప్పుడైనా చెప్పా పెట్టకుండా నన్ను కలుసుకోవచ్చు' అని ధీరూభాయ్ అంబానీ మాతో చెప్పేవాడు. అలాగే చేసేవాడు. అందుకే వారు నేతలయ్యారు. వారితో మనం గడపిన క్షణాలు మన జీవితాల్లో పాఠాలుగా, మార్గదర్శకాలుగా మారినాయి.

**మరో ముఖ్య నాయకత్వ లక్షణం: నాయకత్వం స్వచ్ఛంగా, పారదర్శకంగా ఉండాలి.** పారదర్శకత లేని నాయకత్వం రాణించదు. నిజానికి అది అసలు నాయకత్వమనబడదు. ప్రతి వ్యవహారంలో, ప్రతి వారితో జరిగే కార్యకలాపాల్లో స్వచ్ఛత, పారదర్శకత ఉండాలి. తన పరభేదముండ కూడదు. అప్పుడే తనతో పనిచేస్తున్న అందరికీ నాయకత్వం మీద నమ్మకం, గురి, విశ్వాసం ఏర్పడేలా చేసి, సంస్థను గమ్యం దిశగా అడుగులో అడుగు కలిపి విజయపథంలో నడిపిస్తారు.

ఒక సంస్థకు కొన్నాళ్లు అడ్వైజర్‌గా పనిచేశాను. ఆ సంస్థకు చెందిన ఒక వ్యక్తి నాతో అన్న మాటలు నిజమేనా అని నేటికీ నాకు అనుమానంగా ఉంటుంది. మేము  ఫలానా కులానికి చెందిన వాళ్లం, మా కస్టమర్స్ కూడా అదే కులానికి చెందితే బాగుంటుంది, అటువంటి ప్రయత్నాలే చేస్తున్నాం అని. నా ఈ దీర్ఘ వ్యాపార ప్రయాణంలో నేను మొదటిసారిగా ఇలాంటి భావోద్రేకాలను, కులాభిమానాన్ని చూశాను. ధీరూభాయిగారి రిలయన్స్‌లో ఎంతోమంది దక్షిణాదికి చెందిన వ్యక్తులు కీలకమైన పదవుల్లో ఉండేవారు. ధీరుభాయిగారు గుజరాతీ. మాకెప్పుడూ మరో ప్రాంతానికి, భాషకి చెందిన వారమనే భావన అణువంతైనా కలగలేదు.

దాదాపు నలభైయొక్క సంవత్సరాలు... నేను నా కుటుంబం గుజరాత్‌లో జీవించాం. ఏనాడు మనం ఈ ప్రాంతం వారం కాదు అనే భావన మా కుటుంబంలో ఎవ్వరికీ కలుగలేదు. అందుకే గుజరాత్ నేడో అగ్రగామి రాష్ట్రం మనదేశంలో. అంతెందుకు ఎన్ని లక్షలమంది తెలుగువాళ్లు నేడు అమెరికాలో విజయవంతమైన జీవితాలు గడపటం లేదు నిరాటకంగా! ఆ దేశం వారు కూడా రంగు, దేశం, మాతృభాష అంటూ ఉంటే ఇది సాధ్యపడేదేనా? నాయకునికి తన మన తేడా లేకుండా పారదర్శకతతో వ్యవహరిస్తేనే తన సంస్థ అభివృద్ధి చెందేది. అందుకు కావాల్సిన ముఖ్య ఇంధనం... కులమతాలకు, భాషలకు, ప్రాంతాలకు అతీతంగా తన టీము సభ్యులని ఎన్నుకొని, వారికి తన సంస్థలో అందరూ సమానమే, అందరికీ అభివృద్ధి చెందే అవకాశాలు సమానంగా ఉన్నాయని మాటల ద్వారా, చేతల ద్వారా చూపించడమే!

ఈ విషయంలో ఐటి సంస్థలు ముందంజ వేస్తున్నాయేమోననిపిస్తుంది. వేలల్లో ఉద్యోగస్థుల నియామకం జరుగుతుంటుంది. కుల, మత, ప్రాంతీయ భేదాలు లేకుండా ప్రతిభకే పట్టం కడ్తారు ఆ రంగంలో. అందుకే ఆ రంగం దినదినాభివృద్ధి చెందుతుంది. నిజానికి ఐటి రంగం వల్లే కదా మనలాంటి ఎన్నో లక్షల మధ్యతరగతి భారతీయులు ముఖ్యంగా తెలుగువారు, గతంలోని కడగళ్లను పక్కకు నెట్టి నేడు సొంత గృహాలతో, వాహనాలతో పిల్లలకు మంచి చదువులు చెప్పిస్తూ, ఘనంగా పెళ్లిళ్లు పేరంటాలు జరిపిస్తున్నది.

ఆ రంగంలో ఎంతో మంది ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన నాయకులు కనబడ్తారు మనకు. ఇన్ఫోసిస్ నారాయణమూర్తి, విప్రో ప్రేమ్‌జీ... ఇలా ఎందరో మహానుభావులు... విద్యావంతులైన మధ్యతరగతి భారతీయులకు మంచి భవిష్యత్తును అందిస్తున్న ప్రతిభావంతులు, అసామాన్యులు వీరు. విశిష్ట నాయకత్వానికి, సృజనాత్మకతకు అద్దం పట్టే రంగం ఐటి రంగం.

ప్రావీణ్యతకు, ఫలితాలకు పెద్ద పీట వేసే ఏ రంగమైనా అభివృద్ధి చెందుతుంద నటంలో ఎలాంటి సందేహమూ లేదు. లేకపోతే ఎక్కడ్నుంచో గుజరాత్ వెళ్లిన నాకు, ముద్రాను స్థాపించే అవకాశం, దాన్నో ఉన్నత సంస్థగా తీర్చిదిద్దే భాగ్యం లభించేనా? ప్రతిభకు పట్టం, పారదర్శకత వల్లే కదా అవి సాధ్యమయ్యాయి.

న్యాయం, నిష్పక్షపాతాలను అవలంబించే సంస్థలకు, నాయకులకు జరిగే శుభపరిణామాలు అన్నీ ఇన్నీ కావు. మంచి ఉద్యోగులు సంస్థను, టీమును వీడి వెళ్లరు. మెండుగా కృషి చేస్తారు. వ్యాపారాభివృద్ధి జరుగుతుంది. లాభాలు పెరుగుతాయి. సంస్థకు ఉద్యోగస్థులకు పేరు ప్రతిష్ఠలు లభిస్తాయి. విన్–విన్ అంటామే, ఉభయులకు శ్రేయస్కరమవుతుంది ఇలాంటి పద్ధతుల ద్వారా.

మంచి విలువలకి ఎన్ని మంచి ఫలితాలో గమనించారా!

# 5

# పిండి కొద్దీ రొట్టె

'తరచి చూస్తే జీవితమంతా ఇస్తినమ్మా వాయనం, పుచ్చుకొంటినమ్మా వాయనం లాంటిదే కదా! నాయకునికి, అతని అనుచరులకి ఉన్న సంబంధం కూడా ఇలాంటిదే. ఎంత ఎక్కువ నమ్మకం ప్రేమ, గౌరవం, బాధ్యతలు అప్పగిస్తే అంత గొప్పగా వాటికి ప్రతిఫలం అందిస్తారు అనుచరులు తమ నాయకునికి.'



**పిం**డి కొద్ది రొట్టె... విత్తనం కొద్ది పంట... మన సామెతలు ఇవి.

నాయకునికి తన అనుచరుల నుంచి లభించే స్పందన కూడా ఇలాంటిదే. నిజానికి కొంచెం తరచి చూస్తే జీవితమంతా ఇస్తినమ్మా వాయనం, పుచ్చు కొంటినమ్మా వాయనం లాంటిదే కదా! నాయకునికి, అతని అనుచరులకి ఉన్న సంబంధం కూడా ఇలాంటిదే. ఎంత ఎక్కువ నమ్మకం ప్రేమ, గౌరవం, బాధ్యతలు అప్పగిస్తే అంత గొప్పగా వాటికి ప్రతిఫలం అందిస్తారు అనుచరులు తమ నాయకునికి. దుర్యోధనుడికి, కర్ణుడికి మధ్య గల స్నేహం, నమ్మకం, ఇచ్చిపుచ్చు కొన్న ధోరణి జగద్విదితమే కదా.

నా జీవితంలో జరిగిన సంఘటనలివి. ముంబైలో కమ్యూనల్ రైట్స్ అతి భయంకరంగా జరుగుతున్న రోజుల్లో నేను చెన్నై నుంచి ముంబై చేరటం జరిగింది

రాత్రి దాదాపు పదకొండు గంటలకి. ఆ మర్నాడు ఉదయం ఆరు గంటలకు నేను అహ్మదాబాద్ వెళ్లాలి. నగరమంతా కర్ఫ్యూ. షూట్ ఎట్ సైట్ ఆర్డర్స్ సిటీలో! అటువంటి విపరీత పరిస్థితుల్లో నన్ను ఎయిర్‌పోర్టులో రిసీవ్ చేసుకుని పది పన్నెండు కిలోమీటర్ల దూరంలో ఉన్న తమయింటికి తీసుకెళ్లి వసతి, డిన్నర్ ఏర్పాటుచేసి, ఆ మర్నాడు ఉదయం నన్ను ఎయిర్‌పోర్టులో డ్రాప్ చేశాడు ఆ రోజుల్లో ముద్రా ముంబై ఆఫీసుకి హెడ్‌గా పనిచేస్తున్న కౌశిక్ రాయ్ అనే ఓ మంచి మనిషి. ఇద్దరి వ్యక్తుల మధ్య ఉన్న అనుబంధం, నమ్మకమే కదా దీనికి కారణం.

అలాంటి మరో సంఘటన. అహ్మదాబాద్‌లో కుంభవృష్టి... ఒక రోజులో దాదాపు మూడొందల మిల్లీ మీటర్ల వర్షం పడి నగరం నిలువెత్తు నీళ్లలో మునిగిపోయింది. నగర వీధుల్లో బోటు చూడటం అదే తొలిసారి, ఆఖరుసారి నా జీవితంలో నేటిదాకా. ఈ పరిస్థితుల్లో, నాకు ముంబై వెళ్లాల్సిన అవసరమొచ్చి పడింది. టిక్కెట్టు ఆఫీసులో ఉంది. ఆఫీసుకి వెళ్లటం, దాన్ని ఇంటికి తెచ్చుకుని, మర్నాడు ఉదయం ఎయిర్‌పోర్టు చేరటం అసాధ్యమనిపించింది. అసాధ్యాలను సుసాధ్యాలు చేయటమే కదా మానవ జీవితానికున్న ఏకైక గమ్యం. ఆనాడు అలాగే జరిగింది. రాత్రి పది గంటల వేళకి మా ఇంటి కాలింగ్ బెల్ మోగింది. వాన తగ్గిపోయినా రోడ్లన్నీ ఇంకా జలమయంగానే ఉన్నాయి. ఈ వేళ ఎవరా అనుకుంటూ తలుపు తీసాను.

నా సెక్రటరీ ట్రీసా ఫెర్నాండెస్ వాకిట్లో నిల్చోనుంది! చేతిలో కవరు!! ఆశ్చర్యం, భయం రెండూ ఒక్కసారే నన్ను ముంచెత్తినాయి. వీధుల్లోని జల ప్రళయాన్నెలా ట్రీసా జయించిందోననే ఆశ్చర్యం ఒక వైపు, ఏమైనా అపాయం ఆమెకు సంభవించి ఉంటే? అనే భయం మరోవైపు. నేటికి ఒళ్లు జలదరించే సంఘటన ఇది. మర్నాడు ఉదయం నా ప్రయాణం కోసం టిక్కెట్టు తీసుకొని వచ్చింది ఆ కాళరాత్రి ట్రీసా. ట్రీసా, కౌషిక్‌రాయ్ వీరందరూ పది పన్నెండేళ్ల పైనే ముద్రాలో పని చేశారు. వీరే కాదు మరెందరో...

మా అందరి మధ్య ఒకరిపై మరొకరికి నమ్మకం, విశ్వాసం, పెనవేసుకు పోయిన మాటలకందని ఒక బంధం. లేకుంటే ఇలాంటి సాహసకృత్యాలు చేయాలనే ఆలోచన కూడా రాదు కదా మనకి. అలాకాకుండా సంకుచిత భావాల్తో,

కులాలంటూ, మతాలంటూ, ఇంకేదో అంటూ తన వారిని చేరదీస్తే చివరకు మిగిలేది ఓ పెద్ద సున్నాయే! ఒక్కసారి చూడండి మన చుట్టుపక్కల ఎన్ని ఇలాంటి సంస్థలున్నాయో!

ప్రసిద్ధి గాంచి, మూడు పువ్వులు ఆరు కాయల్లా విరబూస్తున్న సంస్థల్లో గొప్ప నాయకులు, వారిలోని పారదర్శకత, నిష్పక్షపాతం కొట్టొచ్చినట్లు కనబడతాయి. నిస్తేజంగా, నీరసించిపోయిన సంస్థల్లో బంధుప్రీతే కాకుండా రకరకాల పక్షపాత ధోరణులు కొట్టొచ్చినట్లు కనబడతాయి. పక్షపాత రాహిత్యంతోనే సంస్థల్లో బంధాలు, నమ్మకాలు, ఒకరిపై మరొకరికి గురి బలపడేవి.

ఒక చిన్న నీతి కథ ప్రస్తావిస్తాను ఇక్కడ. చిన్న పిల్లల నీతికథల పుస్తకాలు తెరిస్తే మన కళ్లు తెరిపించే ఎన్నో చక్కని కథలు కనబడతాయి మనకు. బుల్లి బుల్లి కథలు, అందరికీ అర్థమయ్యేలా సులభ శైలిలో ఉంటాయి ఈ కథలన్ని.

అదో కుగ్రామం. ఆ కుగ్రామంలో ఒక రైతు. నివాసం ఓ బుల్లి గుడిసెలో. జీవనోపాధికై కొంచెం దూరంలో కూస్తంత పొలం. ఆ పొలం దున్నుకుంటూ అది అందించే ఆదాయం మీద నిర్విచారంగా జీవితం వెళ్లదీస్తున్నాడు. ఈ రైతన్నకు తన పనంటే గౌరవం, ప్రేమ, చిత్తశుద్ధి ఉన్నాయి. తన వృత్తిలో ఉపయోగపడుతూ తనతోనే ఎన్నో ఏళ్లుగా ఉంటున్న పార అతనికున్న ఒకే ఒక్క పనిముట్టు. దాన్నెంతో ప్రేమగా చూసుకునేవాడు, అదో సజీవ వ్యక్తి ఏమో అనేలా. వర్షాకాలం రాకముందే చక్కగా పారతో తన పొలాన్ని తవ్వి దాన్ని రెడీగా ఉంచుకునేవాడు. వానలు పడగానే విత్తనాలు నాటేవాడు. ప్రతి ఉదయం పారతో పొలం వెళ్లి, నీళ్లు పెట్టి చెత్తా చెదారం తవ్వి తీసి పొలాన్ని శుభ్రంగా ఉంచేవాడు.

ఫలితంగా మంచి పంట వచ్చేది ప్రతి ఏడు. ఈ ఏడు కూడా మంచి పంటే వచ్చింది. కోత కోయటానికి మన రైతు తయారవుతుండగా "అయ్యా రైతన్న" అంటూ ఎక్కడ్నుంచో పిలుపు వినబడింది. "ఎవరది" అన్నాడా రైతు. "రైతన్నా నా మాట వినబడుతుందా" అందా స్వరం. రైతు నలుదిశలా పరికించగా దూరంలో తనవైపే దూసుకువస్తున్న ఓ యువకుడు కనబడ్డాడు. కుంటుతూ వస్తున్నాడు. "ఎవరయ్యా నువ్వు? ఎందుకలా కుంటుతున్నా" వన్నాడు రైతు. "నేను నీలాగే ఓ బడుగు రైతును. నా పొలం అప్పుల్తో హరించుకుపోయింది. కూలీగా

పనిచేయడం మొదలుబెట్టాను... మా యజమాని ఒక పరమ లోభి. ఈ ఏడు నాసిరకం విత్తనాలు తెచ్చి నా చేత నాటించాడు. ఫలితంగా పంట పాడైపోయింది. తన పిసినారితనాన్ని ఒప్పుకోకుండా, పంట పాడవటానికి నేనే కారణమని నన్ను దూషిస్తూ ఈ రోజు చావబాదాడు. అందుకే కుంటుతున్నాను. పైగా నష్టమైన పంటను ఇంకెక్కణ్ణుంచైనా తెచ్చి తనకివ్వమంటున్నాడు".

"నిజంగా ఎంతో విచారకరమైనదీ విషయం. నేనేమన్నా నీకు సహాయ మందించగలనా" అన్నాడు మన రైతన్న. కొంచెం తటపటాయిస్తూ అన్నాడు ఆ యువకుడు... "నష్టమైన పంటను మా యజమానికి ఇవ్వకపోతే నన్ను చంపటం ఖాయం. నీ పంటను నాకిస్తే దాన్ని తీసుకెళ్లి మా యజమానికిచ్చి ప్రాణాలు కాపాడుకొంటాను".

మన రైతన్న పెద్ద సందిగ్ధంలో పడిపోయాడు. తనకున్న ఒకే ఒక్క ఆధారం ఈ పంట. సంవత్సరమంతా కష్టపడితే ఈ పంట చేతికందింది. దీన్ని మరొకరికిస్తే తనకు మరో ఆధారమే ఉండదు. ఇవ్వకపోతే ఆ యువకుడు ప్రాణాలు కోల్పోతాడు... ఎలాగా?? పరోపకారి, జాలి గుండె కలవాడు మన రైతన్న. కొంచెం ఆలోచించి తన పంటను ఆ యువకుడికి ఇవ్వటానికి అంగీకరించాడు. ఇక మన రైతన్నకు ఆకలే మిగిలింది. దిగాలుగా గుడిసెలో ఓ పక్కన కూర్చోనున్నాడు. పార మెల్లగా రైతన్న వద్దకు చేరింది. "ఇక నేను నీకెందుకూ పనికిరాను.. అందువల్ల నన్ను అమ్మేసి ఆ డబ్బులతో నీ ఆకలిని తీర్చుకో" అంది.

ఎవరా మాట్లాడుతున్నది అని నలువైపులా పరికించి చూసాడు రైతన్న. ఎవ్వరూ కనబడలేదు. "ఇటు చూడు నీ వెనకాలే ఉన్నాను నీ పారను" అంది పార. వెనక్కి చూస్తే పార. బిత్తరబోయాడు రైతన్న... మాట్లాడే పారా? "అవును నేను నీ సహచరుణ్ణి, పారను. ఎన్నో ఏళ్లుగా నీతో కలిసి మెలసి పనిచేస్తూ వస్తున్నాను. నీవు దయ, జాలి కలవాడవు. పరోపకారివి. నీ అవసరాల కన్నా, ఇతరుల అవసరాలే ముఖ్యం నీకు. అలాంటి నీవు, రోజూ ఇలా తిండి తిప్పలు లేకుండా పస్తులుండటం నేను చూడలేను. మళ్లీ విత్తనాలు నాటే దాకా నేను నీకు ఎందుకూ పనికిరాను. అందుకని నన్ను అమ్మి ఆ డబ్బులతో నీ ఆకలిని తీర్చుకో" అంది పార.

"నిన్ను అమ్మాలా?? ఇన్నేళ్లుగా నా జీవితంలో ఒక భాగంగా నా జీవనోపాధికి సహకరించిన నిన్ను అమ్మేయాలా? ఎవరికో నిన్ను అమ్మేస్తే, వాళ్లు నిన్ను నిర్దాక్షిణ్యంగా హింసిస్తేనో? నిన్నో అంటరానిదాన్నిగా, గడ్డిపోచలా విసిరి ఓ మూల పారేస్తేనో? వచ్చే వానాకాలం దాగా ఆగుతా..." "ఇట్లా పస్తుంటూనా?" "అవును నిన్ను అమ్మే ప్రసక్తే లేదు" అన్నాడు రైతన్న దృఢ నిశ్చయంతో. "సరే అయితే నే చెప్పిన పని చేస్తావా" అంది పార. "సరే"నన్నాడు రైతన్న. "నన్ను తీసికెళ్లి గుడిసె మధ్యలో తవ్వు" అంది. తవ్వటం మొదలుపెట్టాడు. అకస్మాత్తుగా పారవెళ్లి దేన్నో కొట్టుకొని ఖంగు ఖంగుమనే శబ్దం వచ్చింది. "అదేమిటో చూడ"మంది పార. బరువుగా ఉన్న ఇత్తడి బిందె – దాని నిండా బంగారం, రత్నాలు, ముత్యాలు. "రైతన్నా ఈ సంపదంతా నీదే" అంది పార.


బంధానికి, విశ్వాసానికి చక్కని రూపమిచ్చిన కథ కదూ ఇది.

వీటిని పెంచటం ఒక ముఖ్యమైన నాయకత్వ లక్షణం.

# 6

# నీతి, నిజాయితీ, న్యాయవర్తన....

'పలు సంస్థల్లో ఎలాంటి నీతి, నియమాలు, పద్ధతులూ ఉండవు. అన్ని విషయాలు యజమానులు నిర్ణయిస్తారు. వేలల్లో ఉద్యోగులు తమ సంస్థల్లో పని చేస్తున్నప్పటికీ అన్ని వ్యవహారాలు వాళ్లే స్వయంగా చూసుకుంటారు. అన్ని నిర్ణయాలు చిన్నా పెద్దా తేడా లేకుండా వారే తీసుకుంటారు. గందరగోళం సృష్టిస్తారు.'



**చి**త్తశుద్ధి లేకపోవడం, న్యాయాన్యాయాల మధ్య తేడా తెలియక పోవటం, ధర్మాధర్మ విచక్షణ లేకపోవడం, నాయకత్వ లక్షణాలు అనిపించుకోవు. అటువంటి వారు ఎన్నడూ నాయకులు కాలేరు. వారున్న సంస్థలు ప్రగతిని సాధించలేవు.

అంతర్జాతీయ కంపెనీ పెప్సికోలో జరిగిన ఉదంతమిది. ప్రపంచమంతా వ్యాపించి లక్షల కోట్లలో వ్యాపారం చేస్తున్న ఎంతోపెద్ద సంస్థ ఇది. ఈ కంపెనీకి ముఖ్యమైన ప్రత్యర్థి కోకా కోలా. కొన్ని దశాబ్దాలుగా ఈ రెండు సంస్థల మధ్య ఎంతో భయంకరమైన పోటీ. ఎందుకంటే మార్కెట్లో ఆధిపత్యం కోసం.

ఇంత పోటీ ఉన్నప్పటికీ ఈ సంస్థలు ధర్మాధర్మ విచక్షణను కోల్పోలేదని తెలిపే సంఘటన ఇది.

కోకా కోలా కంపెనీలో పని చేసిన ఒక ముఖ్యవ్యక్తి ఆ కంపెనీ నుంచి బయటకొచ్చి కొన్ని రహస్య పత్రాలను, కోకా కోలా వారి కొత్త డ్రింక్ శాంపుల్‌ని పెప్సికోకు అమ్మజూపాడు. ఇటువంటి అవకాశాన్ని నీతి నిజాయితీ లేని ఏ సంస్థ అయినా రెండు చేతుల్తో ఆహ్వానించి ప్రత్యర్థిని నష్ట పరచి లాభాలు పొందాలని చూసేది. కానీ పెప్సీకో అలా చేయలేదు. ఆ ఆఫర్ అందిన వెంటనే దాన్ని తిరస్కరించి, కోకా కోలా కంపెనీకి ఆ విషయం తెలిపింది.

దీన్నేమంటారు? ఇంటిగ్రిటీ కదూ? న్యాయవర్తన, నిజాయితీకి పరాకాష్ఠ కదూ ఈ ఉదంతం.

## మరో సంఘటన

జిరాక్స్ కంపెనీకి కొత్త సిఇఒగా ఎన్‌ముల్ చాహే అనే మహిళ వచ్చింది. ఐదు నెలల్లో కంపెనీ బాగోగులను ఆకళింపు చేసుకున్న తర్వాత ఫైనాన్సియల్ మార్కెట్లకు తెలియపరచింది తమ కంపెనీ ఆర్థిక పరిస్థితి నిరాశాజనకంగా ఉందని. అంతేకాదు తన కంపెనీలో పనిచేస్తున్న ఉద్యోగులకు తెలిపింది కంపెనీని తిరిగి ఆరోగ్యవంతం చేయటానికై తాను తీసుకోబోయే చర్యల గురించి.

మసిబూసి మారేడు కాయచేసి, ప్రజల నుంచి డబ్బును దండుకొంటున్న సంస్థలు పుష్కలంగా ఉంటున్న ఈ రోజుల్లో ఎంతమందికి ఇలాంటి ఇంటిగ్రిటీ, నిజాయితీ, న్యాయవర్తన ఉంటాయో ఆలోచించండి. అలా ఉన్నవారు జిరాక్స్‌లాగా తిరిగి జవసత్వాలు పొంది వెలుగుతూ ఉంటారు. లేనివారు కొంత కాలం, కొంత మందిని మోసం చేసి ఆపై కాలగర్భంలో కలసిపోతారు పేరు ఊరు లేకుండా.

డెల్ కంప్యూటర్ పేరు విన్నారు కదా! నీతి, నిజాయితీలకు ఉదాహరణగా నిలిచే మరో సంస్థ ఇది. ఎంతో పారదర్శకత, నిజాయితీ, న్యాయవర్తనతో తన వ్యాపారాన్ని నిర్వహించటంలో ఈ కంపెనీకి మంచిపేరు ఉంది. ఆ కంపెనీ వెబ్‌సైట్‌కి వెళ్లి చూడండి, డెల్ సంస్థ చిత్తశుద్ధితో అమలు చేస్తున్న అనేక పద్ధతులను చూస్తే ఎంతో ఆనందం కలుగుతుంది. డెల్‌లోని ఉద్యోగుల నడవడిక, విలువల గురించి స్పష్టమైన మార్గదర్శకాలు ఉన్నాయి. తమ సంస్థ ఎలా నడుస్తూ ఉందో

జనం ఊహలకు వదలలేదు ఈ కంపెనీ. సంస్థ పద్ధతుల గురించి 'ది సోల్ ఆఫ్ డెల్' అనే పుస్తకం వెలువరించి తమ పనితీరును అందరికీ తెలియజేసింది.

పలు సంస్థల్లో ఎలాంటి నీతి, నియమాలు, పద్ధతులూ ఉండవు. అన్ని విషయాలు యజమానులు నిర్ణయిస్తారు. వేలల్లో ఉద్యోగులు తమ సంస్థల్లో పని చేస్తున్నప్పటికీ అన్ని వ్యవహారాలు వాళ్లే స్వయంగా చూసుకుంటారు. అన్ని నిర్ణయాలు - చిన్నా పెద్దా తేడా లేకుండా వారే తీసుకుంటారు. గందరగోళం సృష్టిస్తారు.

ఒక చిన్న బ్రాండ్‌ను ముద్రాలో మేము, ఆ సంస్థను స్థాపించిన వారు కలిసి దాదాపు రెండు దశాబ్దాల పాటు ఎంతో శ్రమించి దేశం గుర్తించిన ఒక అతిపెద్ద బ్రాండ్‌గా తీర్చిదిద్దాం. ఆ సంస్థ ఓనరు కొడుకు రంగప్రవేశం చేసి, అన్ని వ్యవహారాల్లో తలదూర్చి, మిడిమిడి జ్ఞానంతో ఊహాతీతమైన నిర్ణయాలు తీసుకుని సంస్థను నిర్వీర్యం చేశాడు.

మరో సంస్థకు సిఇఒగా ఓ ఈగోయిస్టిక్ మహానుభావుడు వచ్చాడు. అంత అహంకారిని అందాకా నేను చూడలేదు. మూడు పువ్వులు, ఆరు కాయలుగా వెలిగిపోతున్న ఆ వస్త్ర సామ్రాజ్యం ఈ అహంకారి చేతుల్లో పేరు ఊరు లేకుండా నాశనమై పోయింది. పరిచయం లేని రంగాల్లో వేలు దూర్చి నిర్ణయాలు తీసుకోవటమే ఈ పతనానికి మూల కారణం.

ఇలా ఎన్నో...

నాయకత్వం గురించి ఎలాంటి అవగాహన లేకపోవటం, చిన్న చిన్న విషయాలపై దృష్టి పెట్టి, పెద్ద విషయాలను గాలికి వదిలేయటం ఈ పతనాలకు మూల కారణాలుగా చెప్పుకోవచ్చు.

ఈ విషయం ప్రస్తావన రాగానే మదిలో ఎన్నడో చదివిన ఓ కథ జ్ఞాపకాని కొస్తోంది.

పూర్వకాలంలో, నేటి అధునాతన వాహనాలు లేని రోజుల్లో ఓ పెద్దమనిషి పొరుగూరు పోవాల్సి వచ్చింది. ప్రయాణం కోసం ఓ గాడిదను మాట్లాడుకొన్నాడు.

ఈ పెద్దమనిషి, ఆ గాడిదను నడిపే యజమాని బయల్దేరారు ఓ రోజు ఉదయాన్నే. మధ్యాహ్నం దాకా ప్రయాణం చేశారు. ఎండవేడి భయంకరంగా ఉంది. తట్టుకోలేక ఆగిపోయారు. నలు దిశలా పరికించారు ఎక్కడైనా నీడ దొరుకుతుందేమోనని కాసేపు విశ్రాంతి తీసుకోవడానికి. కనుచూపు మేరలో ఏదీ కనపడలేదు. మన పెద్దమనిషికి గాడిద పక్కన ఆ గాడిద నీడ కనబడింది. గబుక్కున వెళ్లి అక్కడ కూర్చొన్నాడు. ఇది చూసిన గాడిద యజమాని ఆ పెద్ద మనిషిని అక్కడి నుంచి లేవమన్నాడు. ఎందుకంటే గాడిద తన సొంతమని, దాని నీడ తనకే చెందుతుందని. దీనికి ఒప్పుకోలేదు పెద్దమనిషి. గాడిదను ప్రయాణం కోసం అద్దెకు తీసుకున్నాను కనుక ఆ గాడిదకు చెందిన నీడ కూడా ఆ రోజు తనకే చెందాలని వాదించాడు పెద్దమనిషి.

ఎంతకూ తెగలేదు ఈ వాదోపవాదాలు. మరో పక్క ఎండవేడి ఉధృత మవుతోంది. ఆ వేడిమి తట్టుకోలేక గాడిద పారిపోయింది ఎక్కడైనా నీడ దొరుకుతుందేమోనని. అయినా ఈ ఇరువురి పోరు మాత్రం సమసి పోలేదు.

చిన్న విషయాల మీద దృష్టి పెట్టి అసలు విషయాలు విస్మరిస్తే జరిగేదిదే.

ఒక సంస్థ లాభాల బాటలో నడవడం ఎంత ముఖ్యమో, ఆ లాభాలు న్యాయమార్గంలో నిజాయితీగా సంపాదించడమూ అంతే ముఖ్యం. అవినీతి ద్వారా సంపాదించే లాభాలు ఎప్పటికీ నిలిచే లాభాలు కావు. తాత్కాలికంగా కొంత ప్రయోజనం కలిగినా చివరికి సంస్థ నిర్వీర్యంకాక తప్పదు.

సంస్థ తన కస్టమర్ల పట్ల న్యాయంగా వర్తించినట్లే తన ఉద్యోగుల పట్లకూడా న్యాయంగా వ్యవహరించాలి.

సంస్థ కార్యకలాపాలు ఎంత పారదర్శకంగా ఉంటే సంస్థ అంత సక్రమంగా నడుస్తుంది.


ఈ విషయంలో నాయకత్వమే మార్గదర్శకంగా ఉండాలి. నాయకులలో లేని పారదర్శకత, నీతి నిజాయితీలు, క్రమశిక్షణ కింది ఉద్యోగులలో ఉంటాయని ఎలా ఊహిస్తాం. అందువల్ల నాయకులే మార్గం చూపాలి.

అలాగే నాయకులు తమ బాధ్యతగా వ్యవస్థ యొక్క నీతి నియమాలు, అది అవలంబించాల్సిన పద్ధతులపై దృష్టి సారించి, చిన్నచిన్న విషయాలను తమ అనుచరుల బాధ్యతగా చేయటం కూడా ఎంతో ముఖ్యం.

# 7

# స్వార్థపరులు నాయకులు కాలేరు

'బ్రిటీష్ వారు డివైడ్ అండ్ రూల్‌తో మనని విభజించి, పాలించి పబ్బం గడుపుకొన్నారు. చాలా సంస్థల్లో, టీముల్లో ఇది నేటికీ కనబడుతుంది. తమ మీద తమకు నమ్మకం లేని నాయకులు ఆచరించే వ్యూహమిది. స్వ, పర భేదాలు సృష్టించి టీమును, దాని పనిని సర్వనాశనం చేస్తారు ఈ ప్రబుద్ధులు. స్వార్థం మితిమీరితే వచ్చే పరిణామమిది.'



**ము**ద్రా 8 కోట్ల రూపాయల వ్యాపార సంస్థగా ఉన్నప్పుడు ఆ సంస్థలో పనిచేస్తున్న మా 40 మందికి అనిపించింది కలలతో, గమ్యాలతో, కఠోర దీక్ష శ్రమలతో రెండేళ్లలో సంస్థను 40 కోట్ల రూపాయల వ్యాపార సంస్థగా తీర్చి దిద్దవచ్చని. అలాగే జరిగింది.

సంస్థకు గానీ, ఒక టీముకి గాని విజన్ ఉండం, ఆ విజన్‌లో అందరూ భాగస్వాములు కావటం ఎంతో ముఖ్యం. ఇది నాయకుని బాధ్యత. విజన్‌లో అందరూ భాగస్వాములు కాకపోతే గమ్యాలు నెరవేరనివిగా మిగిలిపోయే ప్రమాదముంది.

రెండేళ్లలో 8 కోట్ల నుంచి 40 కోట్ల రూపాయల టర్నోవర్ అనే విజన్‌ని మా టీములోని అందరి స్వప్నంగా, గమ్యంగా మార్చాము.

ఈ కల సాకారమైతే పెరగబోయే మా అందరి పరువు, ప్రతిష్ఠ, రాబడి అందరికీ అర్థమయ్యేలా విశదీకరించి వారికి అవసరమైన ప్రేరణ అనే ఇంధనాన్ని సమకూర్చాం. కష్టపడి పనిచేయడం మీవంతు. మా వంతుగా మీ భవిష్యత్తు, మీ కుటుంబ బాగోగులన్నీ మావే అనే నమ్మకాన్ని కలిగించాం.

సంస్థ పని మా అందరి సొంతపనిగా మారిపోయింది. ఏదైనా పని సొంతపని అయితే దాన్ని ఎలా మనం ప్రేమించి, తపించి చేస్తామో మనకందరికి తెలిసిన విషయమే.

సో... ఏదైనా విజన్ అది అందరి విజన్‌గా మారటం ఎంతో ముఖ్యం.

**మరో ముఖ్య విషయం. టీము సభ్యులకు చేయూత ఇవ్వడం, అన్ని సహాయ సహకారాలు చేకూర్చటం.** ఇది గుర్తించే ముద్రాలో టీము సభ్యులకు పలు విధాల సహాయ సహకారాలు అందించాం.

ఫలితంగా ఏకాగ్రత, కష్టించి పనిచేయటం, ఓటమిని అంగీకరించకపోవటం, ఎన్ని అవాంతరాలు కలిగినా గెలవాలనే తపన మా అందరి సొంతమయ్యాయి.

**చేస్తున్న పనిని నిరంతరం మెరుగు పరచుకోవటం మరో ముఖ్యమైన అవసరం.** నాయకుడన్న వాడు నిత్యం తమ పనులను మెరుగు పరచుకోవాలి, టీముకి తోవ చూపించాలి. మారుతున్న కాలానికి అనుగుణంగా మారకుంటే చరిత్ర పుటల్లో చేరిపోతాము.

వేగంగా మారుతున్న మన జీవితాల్లో మారందల్లా ఒక్కటే : మార్పు. ఈ మార్పును ప్రేమించి, దాంతో మారే మనస్తత్వాన్ని, కొత్తను శోధించే తపనను టీములో పెంపొందించాల్సిన బాధ్యత నాయకుడిదే. పాత పద్ధతులతో అంతరించిపోయిన సంస్థలు, వ్యక్తులు కోకొల్లలు.

**ఉత్సాహపరచడం మరో అంశం.** ఈ విషయంలో ధీరూభాయిని మించిన వ్యక్తిని నేను నేటిదాకా చూడలేదు.

కొంచెం తప్పు జరగ్గానే ప్రళయం వచ్చినట్లు తల్లడిల్లి పోయి, తిట్టిన తిట్టు తిట్టకుండా తిట్టే నాయకులు ఎందరో! వీరు నిజంగా నాయకులేనా?

తప్పు చేయని మనిషి ఈ ప్రపంచంలో ఎవరైనా ఉన్నారా? పడిలేచి నడక నేర్చుకునే బాలుడిలా మనందరం తప్పులు చేసే ఒప్పులు నేర్చుకుంటాం. అయితే నాయకుడి బాధ్యత ఏమిటంటే, తన టీము సభ్యులు సంస్థ కోలుకోలేనంతగా తప్పులు చేయకుండా చూడటమే. సంస్థలో ఉన్న పద్ధతులు ఈ విషయంలో ఎంతో సహాయ పడతాయి. ఇటువంటి పద్ధతులు ప్రతి సంస్థలో, టీములో ఉండటం ఎంతో ముఖ్యం.

మేమేదైనా తప్పు చేస్తే ధీరూభాయి మమ్మల్ని కోప్పడిన సందర్భం నాకు గుర్తు లేదు. ప్రతి పది నిర్ణయాల్లో ఒకటో రెండో వికటించి నష్టపరుస్తాయి. మిగతా ఎనిమిది మంచి నిర్ణయాల మాటేమిటి? వాటిని విస్మరించి, బెడిసికొట్టిన రెండు నిర్ణయాల మీదే దృష్టి కేంద్రకరిస్తే ఎవ్వరూ నిర్ణయాలు తీసుకునే ధైర్యం చేయరు.

అందరూ పరమభక్తులుగా, చెంచాలుగా మారిపోయి, చెప్పిందే చేస్తారు నాయకుడికే అన్ని నిర్ణయాలను వదిలేసి. దీనంత దరిద్రం మరేమి ఉండదు. నష్టం నాది, లాభాలు మనందరివీ అని ధీరూభాయి మమ్మల్ని ఉత్సాహ పరుస్తూ ఉండేవారు. అలాంటి నాయకులతో పనిచేసే సామాన్యులందరూ అసామాన్యులుగా మారుతారు.

**దీనితో జత పడిందే టీము సభ్యులని సొంత నిర్ణయాలు తీసుకునేలా ప్రోత్సాహపరచటం.** తప్పులను చూసీ చూడనట్లు ఉండటమే కాదు, నిర్ణయాలను తీసుకునే బరువు బాధ్యతలు టీము సభ్యులకు అప్పజెప్పటం ఎంతో ముఖ్యం.

తండ్రిచాటున పెరిగే కుటుంబ వ్యవస్థ మనది. అన్ని నిర్ణయాలు తండ్రి తీసుకుంటాడు.

నిర్ణయాలు ఎలా తీసుకోవాలో అనే విషయం మీద మనకెలాంటి అవగాహన ఉండదు. కాబట్టి నిర్ణయాలు తీసుకోమంటే భయపడతాం. నిర్ణయాలు

తీసుకునే పద్ధతుల గురించి విశదీకరించటం, తప్పులను మార్గదర్శకాలుగా మార్చటం, మంచి నిర్ణయాలను మెచ్చుకోవటం నాయకుని కనీస బాధ్యత.

ఈ బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించిన వారు గొప్ప నాయకులవుతారు. వారి శిక్షణలో పనిచేసిన టీము సభ్యులు కూడా కాలక్రమేణా మంచి నాయకులవుతారు.

కొన్ని అంతర్జాతీయ సంస్థల్లో నాయకులు వ్యాపారాన్ని ఎంతగా పెంచారు, ఎంత గొప్పగా లాభాలు ఆర్జించారు అనే విషయాలపైనే కాకుండా నాయకులు తమతో పనిచేస్తున్న వారిని భావి నాయకులుగా ఎలా తీర్చి దిద్దారో కూడా ఒక ముఖ్యాంశంగా పరిగణిస్తారు. అలా చేయలేని వారిని విజేతలుగా పరిగణించరు. సంస్థల నుంచి అలాంటి వారిని బయటకు పంపడం కూడా జరుగుతుంది. ఒక్కసారి ఆలోచించండి, నేటి యువతరమే రేపటి నాయకులు కదా. మరి నేటి నాయకులు వారికి తగిన శిక్షణ, అనుభవం పొందే అవకాశం ఇవ్వకపోతే అధోగతే కదా.

బ్రిటీష్ వారు డివైడ్ అండ్ రూల్‌తో మనని విభజించి పాలించి పబ్బం గడుపుకొన్నారు. చాలా సంస్థల్లో, టీముల్లో ఇది నేటికీ కనబడుతుంది. తమ మీద తమకు నమ్మకం లేని నాయకులు ఆచరించే వ్యూహమిది. స్వ పర భేదాలు సృష్టించి టీమును, దాని పనిని సర్వనాశనం చేస్తారు ఈ ప్రబుద్ధులు. స్వార్థం మితిమీరితే వచ్చే పరిణామమిది.

స్వార్థపరులు ఎన్నటికీ నాయకులు కాలేరన్నది నిజం.

విభజించి పాలించే ఈ ప్రబుద్ధులు కూడా ఎన్నటికీ నాయకులు కాలేరు. విజేతలు అసలుకాలేరు.

టీముని ఏకతాటి పైకి తెచ్చి వారిలో మంచిని పెంచి అందరూ మమేకమై ఒకే గమ్యం కోసం శ్రమించేలా చేయగలిగిన వాడే నాయకుడు. అదే నాయకత్వ లక్షణం.

**అంతేకాకుండా టీములో అందరూ కవలల్లా ఒకేలా కాకుండా వైవిధ్యంగా ఉంటే, ఆ టీము ఆలోచనా రీతిని అది ఎంతో బలపరుస్తుంది.** కొన్ని సంస్థలు కావాలనే వైవిధ్యాన్ని ప్రోత్సాహపరుస్తాయి. ముద్రాలో దేశంలోని అన్ని ప్రాంతాల వారు, భాషలవారు, మతాల వారు, కులాల వారు కలిసి మెలిసి పనిచేసే వారు.

ప్రతి విషయంలో వివిధ అభిప్రాయాలు ఉండటం సహజమే. ఈ వైవిధ్యం సంస్థ నాయకుని ఆలోచనా రీతిని, నిర్ణయ ప్రక్రియను బలోపేతం చేస్తుంది.

వెరైటీ ఈజ్ ది స్పైస్ ఆఫ్ లైఫ్ అంటారు.

వైవిధ్యం జీవనాధారం.

ఈ వైవిధ్యాన్ని, వివిధ భావాల ప్రకటనను పెంపొందించే సంస్థలు, నాయకులు ముందంజ వేస్తూనే ఉంటారు.

# 8

# ప్రతిభకే పట్టం

'గుర్తింపు ఆక్సిజన్ లాంటిది. ప్రాణవాయువు జీవితాన్ని కొనసాగిస్తే, గుర్తింపు జవసత్వాల నిస్తుంది. ఇంత శక్తిమంతమైన ఆయుధాన్ని సరిగ్గా ఉపయోగించు కోలేని వాడు నాయకుడు ఎన్నటికీ కాలేడు.'



నాయకత్వానికి మరో ముఖ్యావసరం – టీము సభ్యుల్లోని ప్రతిభా పాటవాలకు పట్టం కట్టడం.

పెద్దలు మనిషికి రెండు ముఖ్యావసరాలుగా వీటిని పేర్కొన్నారు. అవి: మొదటిది గుర్తింపు. రెండోది సుఖం. మొదటిది సుఖమని చెప్పలేదు. గుర్తింపును మనిషి మొదటి అవసరంగా పేర్కొన్నారు పెద్దలు. వ్యాపార సంస్థల్లో ఎన్నెన్ని లక్షల్లో, కోట్లల్లో జీతాలిచ్చినా సక్రమ బాధ్యతలను, గుర్తింపును ఇవ్వని సంస్థల్లో ప్రతిభావంతులు నిలువరు.

గుర్తింపు ఆక్సిజన్ లాంటిది. ప్రాణవాయువు జీవితాన్ని కొనసాగిస్తే, గుర్తింపు జవసత్వాలనిస్తుంది. ఇంత శక్తిమంతమైన ఆయుధాన్ని సరిగ్గా ఉపయోగించుకోలేని వాడు నాయకుడు ఎన్నటికీ కాలేడు.

ఈ విషయంలో కూడా ధీరూభాయి అంబానీ అగ్రగణ్యుడే. ప్రతి మంచి పనిని గుర్తించి, ఏదో ఒక బహుమతినిచ్చే వాడు మాకు. దీన్ని కొనసాగిస్తూనే ముద్రాలో మంచి పనికి, పుట్టిన రోజుకి, వివాహ దినోత్సవాలకు – ఇలా రకరకాల సందర్భాలకు బహుమతులిచ్చే వాళ్లం. దీని వల్ల ముద్రాకు చాలా మేలు జరిగింది. మేధావులు కూడా నిలకడగా సంస్థలో మమేకమయ్యారు. దీర్ఘకాలం సంస్థల్లో పనిచేశారు.

గుర్తింపు, మెప్పులేని జీవితం ఉప్పులేని ఆహారంలాగా మారుతుంది. ఆహారంలో ఉప్పు ఎలాగో, జీవితానికి గుర్తింపు అలాంటిది.

**మరో నాయకత్వ లక్షణం: టీము సభ్యుల్లో ధైర్యాన్ని పెంచి, ప్రయోగాలు చేసేలా ప్రోత్సాహపరచటం.**

ప్రతి ప్రయోగం రిస్క్‌తో కూడుకున్నదే కదా! రిస్కు తీసుకోకుండా ఉన్న వాటితోనే జీవితాన్ని వెళ్లబుచ్చుతుంటే మనిషి ప్రగతి ఎప్పుడో ఆగిపోయి ఉండేది.

మనుగడకు, పురోగతికి రిస్క్ తీసుకోవడం ఎంతో ముఖ్యం.

అజ్ఞానిలా, మూర్ఖుడిలా రిస్క్ తీసుకోవడం ఒక పద్ధతైతే, అన్ని విషయాలు కూలంకషంగా చర్చించి రిస్క్ తీసుకోవడం మరో పద్ధతి. రెండో పద్ధతిని ప్రోత్సహించే వాడే నాయకుడు.

దేశంలో ప్రకటనల రంగం ముంబై, ఢిల్లీ వంటి మహానగరాలకు పరిమితమైన రోజుల్లో ముద్రా అహ్మదాబాద్‌లో ప్రధాన కార్యాలయం స్థాపించి, హైదరాబాద్, కొచ్చిన్, పూణె వంటి నగరాల్లో బ్రాంచీలను ఏర్పాటు చేసింది.

మరో విషయమేమంటే ధైర్యంతో, సాహసంతో ఎంతో రిస్కు తీసుకొని మైకా – (ముద్రా ఇనిస్టిట్యూట్ ఆఫ్ కమ్యూనికేషన్స్, అహ్మదాబాద్) స్థాపన. దేశంలో కమ్యూనికేషన్ రంగంలో తొలి పోస్ట్ గ్రాడ్యుయేట్ స్కూలు ఇది.

ధైర్యే సాహసే లక్ష్మీ అంటారు ఆర్యులు. రిస్క్ తీసుకునే గుణాన్ని నాయకుడు అవలంబించడమే కాదు, తన టీములోనూ పెంపొందించాలి. అప్పుడే పురోగతి సొంతమయ్యేది.

అలాకాకుండా ఎక్కడ వేసిన గొంగళి అక్కడే ఉన్నట్టుగా ఉంటే సంస్థలు కాలగమనంలో అంతర్ధానం కావడం లేదా ప్రతిభావంతులైన ఉద్యోగుల్ని కోల్పోవటం జరుగుతుంది.

చలనం లేని ఏ సంస్థల్లోనూ ఉద్యోగులు నిలవరు.

ముందడుగు వేయటానికి రిస్క్ తీసుకోవటం ఎంతో అవసరం. అయితే ఆ రిస్క్ గుడ్డెద్దు చేలో పడ్డ రీతిన కాకుండా లోతు తెల్సుకొని నీటిలో దిగేలా ఉండాలి.

**మరో ముఖ్య విషయమేమంటే వృత్తి మనకు ఆనందాయకంగా, సరదాగా ఉండాలి.** ప్రతిరోజు పనికి వెళ్లటానికి మనసు ఉవ్విళ్లూరాలి. ఎందుకొచ్చిన గోలరా భగవంతుడా అనే భావన కలిగితే అటువంటి సంస్థలు, ఆ సంస్థలో నాయకులమని చెప్పుకునే వారు పూర్తిగా విఫలమైనట్లే.

పని ఎప్పుడు సరదాగా మారుతుంది? ఇష్టమైన పని చేస్తున్నప్పుడే కదా!

పని ఎప్పుడు ఇష్టమౌతుంది! కొత్త సవాళ్లను ఎదుర్కొంటున్నప్పుడు, విజయాలు గుర్తింపబడినప్పుడు, వృత్తిలో ఎదుగుదల ఉన్నప్పుడు – ఇలా ఎన్నెన్నో...

వీటన్నిటికన్నా ముఖ్యంగా మన బాగోగులను, మన భవిష్యత్‌ను గమనిస్తూ మనకు ముందంజ వేయటంలో మార్గదర్శకుడిగా మారిన నాయకుడు ఉన్నప్పుడు.

నాయకుడి మీద నమ్మకం, విశ్వాసం, కలగటం ఆటోమెటిక్‌గా జరిగిపోదు. ముందు చెప్పుకున్న పద్ధతులను, సూత్రాలను నాయకుడు అమలుచేస్తేనే అది సాధ్యమవుతుంది.

చూసిన దాన్ని నమ్ముతాం. చూడని దాన్ని నమ్మటాన్ని విశ్వాసమంటాం.

ఓసారి ఒక టైట్‌రోప్ వాకర్ (తాడు మీద నడిచే వ్యక్తి) రెండు భవనాల మధ్య తాడును ఇరవై అడుగుల ఎత్తులో బిగించి సునాయాసంగా నడిచాడు. ప్రేక్షకులు ఎంతో ఆనందించారు. చప్పట్లు, హర్షధ్వానాలతో ముంచెత్తారు.

ఆ వ్యక్తి అంతటితో ఆగక రెండేళ్ల కుర్రాడిని మెడపై ఎక్కించుకొని అదే విన్యాసం మళ్లీ చేశాడు.

ప్రేక్షకులకు మరింత ఆనందం, ఆశ్చర్యం కలిగాయి.

తాడు మీద నుంచి దిగివచ్చాక, ఆ వ్యక్తి తన విన్యాసాలను చూసిన ప్రేక్షకులను అడిగాడు... తాడు మీద మనిషి నడవొచ్చు కదా అని. అందరూ అవునన్నారు. ఎందుకంటే అందరూ ఆ విన్యాసాన్ని చూశారు కనుక నమ్మారు. మీరు నడుస్తారా అని అడిగాడు. ఎవ్వరూ సమాధానం చెప్పలేదు. ఎందుకంటే ఆ పని చేయగలమనే విశ్వాసం లేకపోవడం వల్ల.

చూడని దాన్ని నమ్మటం విశ్వాసం.

ఆ విశ్వాసానికి ప్రతిఫలం నమ్మిన దానిని చూడటం.

ఇలాంటి విశ్వాసం కలిగించే వ్యక్తే నాయకుడు.

నాయకులుగా మారాలనుకునే వారికి చిన్న సలహా. మీరు నమ్మిన వ్యక్తులందరూ మీరూహించిన రీతిగా మారతారనే రూలు ఎక్కడా లేదు. విశ్వాసముంచిన పదిమందిలో ఒకరిద్దరు ఆశలను, ఆశయాలను వమ్ము చేయవచ్చు.

నేను స్వయంగా రుచి చూసిన ఒక చేదు అనుభవం చెబుతాను.

గుజరాత్‌లో ముద్రా ఉండటం వల్ల అందులో ఒకరిద్దరు తెలుగువారు మినహా అందరూ ఇతర ప్రాంతాలకు చెందినవారే. ఉద్యోగార్థమై అహ్మదాబాద్‌కు వచ్చిన ఓ తెలుగు వ్యక్తికి ఉద్యోగమిచ్చి, సహాయ సహకారాలందించి చేయూత నిచ్చా.

దీనికి ప్రతిఫలంగా ఆ ప్రబుద్ధుడు మాకుటుంబ వ్యక్తుల సంతకాలను ఫోర్జరీ చేసి పెద్ద మొత్తం డబ్బు కాజేశాడు.

ఇది మాకో పెద్ద షాక్.

రెండుసార్లు ఆ వ్యక్తి జైలుకెళ్లటం, అతనికుటుంబం కష్టాల ఊబిలో కూరుకుపోవటం జరిగాయి.

చెరపకురా చెడేవు – నిజమే. విశ్వసించిన వ్యక్తి ఘోరంగా మోసం చేయటం కొరుకుడు పడదు. అయితే మనం గ్రహించవలసింది ఇలాంటి సంఘటనలు చెదరు మదురుగా జరుగుతాయని ముందుగానే ఊహించటం.

ఒడిదుడుకులు, ఎత్తుపల్లాలు, జీవన యానంలో జరిగే సంఘటనలుగా గుర్తించటమే దీనికి కొంత విరుగుడు.

ఎప్పుడూ మేలే జరగాలనుకోవడం కించిత్ అసహజం, అసాధ్యం కదా!

# 9

# నాయకులు మనలాంటి వారే...

'మన సొంతశక్తి సామర్థ్యాలపై అందరికీ అనుమానాలు, భయాలు ఉంటాయి. కనుక ఇది మన ఒక్కరికే సంక్రమించిన ప్రారబ్ధమని అనుకోకుండా ఉంటే సగం సమస్య తీరిపోతుంది. కార్యోన్ముఖులుగా మారుతాం.'



**మ**నందరిలో సహజంగా ఉద్భవించే అనుమానం... నాయకులు వేరు, మనం వేరు అని. నాయకులు మరో గ్రహవాసులని, పుట్టుక నుంచే అన్ని విషయాల్లో వారు మనకన్నా ఎంతో ఉన్నతులని, మనం నాయకులుగా రూపాంతరం చెందటం, విజేతలుగా రూపుదిద్దుకోవటం అసాధ్యాలుగా గోచరిస్తాయి. ఈ భావాలు, అనుమానాలు నిజమా? నాయకులు మరో గ్రహవాసులా?మనకన్నా ఎన్నో రెట్లు ఉన్నతులా?

ఈ సమస్యకి పరిష్కారం మొదలవుతుంది మనలాగే మిగతా అందరికీ తమ తమ శక్తి సామర్థ్యాలపై అనుమానాలుంటాయనే నిజం మనం గ్రహిస్తే. ఇది నూటికి నూరుపాళ్లు నిజం. ప్రతి కొత్త పని మొదలు పెట్టబోయే ముందు నా వల్ల ఈ పని సాఫల్యమవుతుందా అనే అనుమానం ఊహ తెల్సిన దగ్గరినుంచి

నన్ను వెంటాడుతుంటూనే ఉంది. కొన్ని వేల ప్రకటనల సృష్టి, వాటిలో పలు విజయ వంతమైనవి ఎన్నో ఉన్నప్పటికీ, నేడు కూడా ప్రతి కొత్త ప్రకటన సృష్టి జరిగాక ఇది విజయవంతమవుతుందా అనే అనుమానం నన్ను పీడిస్తూనే ఉంటుంది.

కొన్ని వందలసార్లు పలు వేదికల నుంచి ఉపన్యసించి ఉంటాను. అయినప్పటికీ ప్రతి ఉపన్యాసం ముందు రోజునుంచి టెన్షన్ మొదలవుతుంది. రాసుకుని చదివే అలవాటు లేదు నాకు ఉపన్యాసాల్లో. అందువల్ల ముందు రాత్రి రిహార్సల్స్ చేస్తాను. అయినా అనుమానంగా ఉంటుంది. ముఖ్యమైన విషయాలు మర్చిపోతానేమోనని, ఉపన్యాసం అభాసుపాలవుతుందేమోనని.

నా ఒక్కడికే ఉన్న సమస్య కాదు ఇది. మన సొంత శక్తి సామర్థ్యాలపై అందరికీ అనుమానాలు, భయాలు ఉంటాయి. కనుక ఇది మన ఒక్కరికే సంక్రమించిన ప్రారబ్ధమని అనుకోకుండా ఉంటే సగం సమస్య తీరిపోతుంది. కార్యోన్ముఖులుగా మారుతాం. మిగతా సగం తీరిపోతుంది మనం ప్రేమించే గౌరవించే నాయకుల జీవిత చరిత్రలను తెల్సుకొని వీటిని అనుసరించటం మొదలుపెట్టగానే. పలుసార్లు చెప్పాను, నా ఆలోచనారీతినిఎంతో ప్రభావితం చేసి నాకు, నాలాంటి కొన్ని లక్షల మందికి స్ఫూర్తిని, మార్గదర్శకాన్ని ప్రసాదించింది ధీరూభాయ్ మహాశయుడని. సందేహాలతో అనుమానాలతో నిత్యం అతలాకుతల మయ్యే మనలాంటి సామాన్యులకు ఒక గురువు లేదా గురుతుల్యుడు, వారిపై అచంచలమైన విశ్వాసం ఏర్పరచుకోవటం ఎంతో ముఖ్యం. లేదా మహోన్నతుల జీవిత చరిత్రలు మనకు స్పూర్థిని, మార్గదర్శకమిచ్చేలా చేసుకోవాలి.

సీక్రెట్స్ ఆఫ్ సక్సెస్... విజయరహస్యాలగురించి చర్చించుకునే సందర్భాల్లో పలు మంది వక్తలు అతిరథ మహారథులు గురించి, వారి విజయాలను, ఆ విజయాల కోసం వారు అవలంబించిన పద్ధతులనే కాకుండా కొన్ని అసాధారణ ఉదాహరణలను ప్రస్తావిస్తారు.

చీమ... ఎంత చిరు ప్రాణి...

జిమ్ రాన్ అనే ఓ స్ఫూర్తి ప్రధాత ఏన్ట్స్ ఫిలాసఫీ అని చీమల నడవడి, అలవాట్ల మీద కొన్ని సూత్రాలను కనుగొని విశదీకరించాడు.

అల్పమైన చీమ... అతి అల్పమైన దాని జీవితం... కొన్ని సూత్రాలకి, అవీ నాయకత్వ లక్షణాల మీద చీమల ప్రవర్తన మనకు మార్గదర్శకంగా మారటం, నమ్మటానికి కొంచెం కష్టంగానే ఉంది కదూ! పదండి ముందుకు.

జిమ్ రాన్ యొక్క చీమల తత్త్వసూత్ర ప్రకారం : మొదటగా... చీమలు ఎప్పుడూ ఓటమిని అంగీకరించవు (ఏన్ట్స్ నెవర్ క్విట్). మీరు పలుసార్లు గమనించే ఉంటారు చీమల ప్రయాణంలో ఏవైనా అడ్డంకులొస్తే పక్క నుంచి వెళతాయి. మీరు వాటి దోవలో ఏదైనా అడ్డంకిని సృష్టించండి. ఉదాహరణకు ఒక వేలు పెట్టండి వాటి దోవలో. అవి అక్కడే నిలబడి, గంటల తరబడి విచారించవు అయ్యో ఎందుకీ అడ్డంకీ అని. లేదా వెనుతిరిగిపోవు. మరో దోవ గుండా ముందుకు సాగిపోతాయి.

మన ప్రయాణంలో ఏదైనా ఒక తలుపు మూసుకుపోతే మరో తలుపో లేక కిటికీనో తెరుచుకుంటుందని పలు అశావాదులు నమ్ముతారు. ఎదురైన అడ్డంకినే తదేకంగా చూస్తూ నిరాశ నిస్పృహలకు లోనుకాక మరో తోవలో పయనిస్తారు చీమల్లాగా... పట్టువదలని విక్రమార్కుడిలాగా ఓటమిని అంగీకరించక విజయం కోసం ప్రయత్నిస్తూ ఉండటమే మన కర్తవ్యం. ప్రత్యామ్నాయాల కోసం నిరంతరం వెతకటమే మన ముందున్న ఏకైక మార్గం. చిరు చీమలే మరో దోవ ఎంచుకొని ముందుకెళ్తున్నప్పుడు మనం ఆ మాత్రం చేయలేమా? విన్‌స్టన్ చర్చిల్ చెప్పినట్లుగా నెవ్వర్ గివప్... నెవ్వర్ నెవ్వర్ గివప్... ఓటమిని ఎప్పుడూ అంగీకరించకు.

రెండోది : ఎండాకాలంలో చీమలు చలికాలం గురించే ఆలోచిస్తూ ఉంటాయట. చీమలకు తెలుసు వాటికి ఎంతో హాయినిచ్చే ఎండాకాలం అలా శాశ్వతంగా ఉండిపోదని... త్వరలోనే చలికాలం వస్తుందని, నానా బాధలు తెస్తుందని. మంచీ చెడులు, ఎత్తు పల్లాలు, వెలుగు నీడలు, కష్ట సుఖాలు ఇలాంటి వాటిని ద్వంద్వాలు అంటారు. సహజంగా అందరికీ అనుభవంలోకి వచ్చేవే. మంచి జరిగినప్పుడు ఎగిసిపడటం, చెడు జరిగినప్పుడు పాతాళంలోకి క్రుంగిపోవటం నిషేధాలన్న మాట. గెలుపు ఓటములు చవిచూడని వ్యక్తి నేటి దాకా జన్మించలేదు. ఇరవై మూడేళ్లు ధీరూభాయ్‌తో కలిసి పనిచేశాను. ఎన్నో విజయాలు, మరెన్నో అపజయాలు ఆయన జీవితంలో. ఒడిదుడుకులు లేని జీవితం

అసాధ్యం కనుక మంచీ చెడులను జీవితంలో, వృత్తిలో అంతర్భాగంగా చేసుకోవటం ఎంతో అవసరం. ఇదే చీమ ఇచ్చే సందేశం. ఎందుకంటే హాయిగా గడిచిపోతున్న వేసవి తర్వాత దుర్భరమైన చలికాలం రాకమానదు. ఆపైన మళ్లీ ఎండాకాలం రాక మానదు.

మూడోది: చీమకు చలికాలమంతా వేసవి గురించి ఆలోచనట. ఎంత అద్భుతమో కదా ఈ జీవన రీతి. చలికాలం ఓ శాపం లాంటిది చీమలకు. అయినా సరే చలికాలం అందించే కష్టాలను అనుభవించాల్సిందే. దీనికో చక్కని మార్గాన్ని కనిపెట్టాయట... చీమలు. చలికాలమంతా హాయినివ్వబోయే ఎండాకాలం గురించి ఆలోచించటం! వేసవి సూర్యుడు తన తొలి కిరణాలను ప్రసరింప చేయగానే, సంతోషంతో తమ పుట్టల్లోంచి బారులు తీరి బయటకు వస్తాయి చీమలు. పనిపాటలతో హాయిగా జీవించటానికి! ఈ ఆలోచనే చలికాలంలో చీమ ఎదుర్కొనే కష్టాలను కొంచమైనా సులభతరం చేసేది. అందుకే రాబోయే ఎండాకాలం గురించి ఆలోచనలు, ఎదురుచూపులు. మనకీ అంతేనేమో. కష్టాలు వచ్చినప్పుడు, రాబోయే మంచి రోజుల ఊహాగానం ఎంత హాయినిస్తోందో ఒక్కసారి ఆలోచించి చూడండి. 'దిస్ టూ షల్ పాస్' అని ఆంగ్లంలో ఒక సామెత ఉంది. కష్టాలు కలకాలం నిలవవు లాంటి సామెత. చీకటి తర్వాత వెలుగు లాగా, చెడు తర్వాత ఇక మంచే కదా! ఎంత హాయైన ఆలోచన.

ఇక నాలుగోది: చీమలు సర్వశక్తులు ఒడ్డి పనిచేస్తాయట. ఎండా కాలంలో చీమలు తమ ఆహారాన్ని పోగు చేస్తాయి రాబోయే చలికాలం కోసం. ప్రతి చీమ ఎంత వీలైతే అంత ఆహారం పోగు చేస్తుంది. తన శక్తికి ఎంత సాధ్యమో అంత కృషి చేస్తుంది. మిగతా చీమలు ఎంత ఆహారం పోగు చేసినాయి; తన కన్నా ఎక్కువా తక్కువా లాంటి తర్జన భర్జనలోకి పోవు మనలాగా. తనకిచ్చిన పనిని నూటికి నూరుపాళ్లు చేయటమే చీమ యొక్క వృత్తి, ప్రవృత్తి. మనలాగా పక్కవాడి మీద దృష్టి ఉంచవు సర్వవేళ సర్వావస్థలయందు. ఇతరులు తక్కువ పనిచేసి, ఎక్కువ లాభాలు పొందుతున్నారనే మీమాంసలో చిక్కుకు పోవు చీమలు మనలాగా. తమ కృషి తాము చేసుకుంటూ పోతాయి. హాయిగా సంతోషంగా ఉంటాయి.


సుఖ సంతోషాలు, విజయాలు మన వృత్తిని నిజాయితీగా, నూటికి నూరు శాతం కష్టపడి పనిచేసినప్పుడే కదా లభించేది. ప్రతి నాయకుడు, ప్రతి విజేత అవలంబిస్తున్న సూత్రాలే ఇవి. ఓటమిని అంగీకరించకపోవటం; జయాపజయాలు జీవితంలో ఒక భాగంగా అంగీకరించటం; తదనుగుణంగా తన ఆలోచనా రీతిని మలుచుకోవటం; నూటికి నూరు శాతం శ్రమించి సంతోషాలను, విజయాలను సొంతం చేసుకోవటం...

ఇటువంటి నాయకులే మనకు స్ఫూర్తినిచ్చేది, మార్గదర్శకులయ్యేది.

# 10

# గతం నాస్తి

‘ మనందరం గతాన్ని పట్టుకొని, విడవకుండా చింతిస్తూ ఉండేవాళ్లమే. నిన్నటి గురించి, రేపు గురించే మన చింత అంతా. నేటి గురించి ఎలాంటి చింతన ఉండదు. జీవితమన్నాక ఎత్తుపల్లాలు, సుఖ దుఃఖాలు, గెలుపు ఓటములు సహజమని సర్దుకుపోము. ’



ఓ జ్ఞాని ఒక సభలో చక్కని జోకు వేశాడు. శ్రోతలు విరగబడి నవ్వారు.

కొంచెం సేపాగిన తర్వాత మళ్లీ అదే జోకు వేశాడు! ఈసారి కొంతమంది శ్రోతలు మాత్రమే నవ్వారు.

మరికొంచెం ఆగి మళ్లీ అదే జోకుచెప్పాడు. నామమాత్రంగానైనా ఎవ్వరూ నవ్వలేదు.

అప్పుడన్నాడు ఆ మహాశయుడు "ఒకే జోకుకు మాటి మాటికి నవ్వని మీరు, ఏదైనా సమస్య వస్తే పదేపదే దాని గురించే ఎందుకు చింతిస్తారు, విలపిస్తారు?" అని. ఆలోచింప చేసే ప్రశ్నే కదూ ఇది.

మనందరం గతాన్ని పట్టుకొని, విడవకుండా చింతిస్తూ ఉండేవాళ్లమే. నిన్నటి గురించి, రేపు గురించే మన చింత అంతా. నేటి గురించి ఎలాంటి చింతన

ఉండదు. జీవితమన్నాక ఎత్తుపల్లాలు, సుఖ దుఃఖాలు, గెలుపు ఓటములు సహజమని సర్దుకుపోము.

కడపలో నాకో అభిమాని ఉన్నాడు. వ్యాపారి. షేర్ మార్కెట్‌లో కూడా లావాదేవీలు చేస్తాడాయన. షేర్ మార్కెట్లో కాని ఇంకేదైనా ట్రేడింగ్‌లో కాని ధరల హెచ్చుతగ్గులు, తద్వారా లాభనష్టాలు రావటం ఎంతో సహజంగా జరుగుతుంటాయి.

లాభాలొచ్చినప్పుడు స్వర్గ సుఖాల్ని, నష్టాలొచ్చినప్పుడు నరక బాధల్ని అనుభవించటం ఏమంత సమంజసమో ఒక్కసారి ఆలోచించండి. ఈ విషయం తెలియని వాడు కాదు నా కడప అభిమాని. అయినా నష్టాలొచ్చిన ప్రతిసారి క్రుంగిపోవటం జరుగుతూ వస్తుంది. దీంట్లోంచి బయటపడే సలహా కోసం ఎదురు చూస్తున్నాడు ఈ పెద్ద మనిషి.

లాభనష్టాలకు చలించని వారెవ్వరూ ఉండరు. అయితే ఎంత తొందరగా ఆ సుఖదుఃఖాల నుంచి విముక్తులమై తిరిగి మన సహజ జీవితాన్ని పునరుద్ధరించు కుంటామా అనేది ఎంతో ముఖ్యమైన విషయం.

ఎప్పుడైతే ద్వందాలు మన జీవితాల్తో ముడిపడి ఉన్నవన్న నగ్నసత్యాన్ని గ్రహించి నేటిలో జీవించటం మొదలు పెడ్తామో, అప్పుడు ఈ సుఖదుఃఖాలు అంతగా మనని బందీలుగా ఉంచుకోవు.

శాంతిమయ జీవితానికి కొంత ఫిలాసఫీ, కొంచెం వైరాగ్యం అవసరమేమో ఆలోచించండి.

నిన్న గతం... రేపు అనిశ్చిత...నేడు నిజం.

కనుక నేటిలోనే జీవిస్తాను.

ఈ ఆలోచన, ఈ నిజం మన జీవితాన్ని కొంచెమైనా దిగులు, చింతల నుంచి దూరం చేయవచ్చు. ఈ ప్రక్రియలో ఒక గురువు కాని, మన నాయకుడు గాని ఎంతోసహాయపడతారు.

గతంలో చర్చించుకున్నాం. ధీరూభాయ్ అంబానీ ఎన్నో ఒడిదుడుకులకు లోనయ్యారని. ఆయన రకరకాల పోరాటాలు చేశాడు. ధైర్యాన్ని, ఆత్మ స్థైర్యాన్ని

ఆయన కోల్పోవటం నా ఇరవై మూడు సంవత్సరాల అనుబంధంలో నేనెప్పుడూ గమనించలేదు.

పోరాటం ఆయనెంచుకొన్న దోవ.

ధైర్యం ఆయన ఆయుధం.

ఆరోగ్యం కానీయండి, వ్యాపారాలు కానీయండి, ధైర్యంగా నిలబడి ఎదుర్కొనటమే ఆయనకు తెలిసిన విద్య.

నాకు మరో గురువున్నారు... డాక్టర్ వర్గీస్ కురియన్ గారు. తన కలలను సాకారం చేసుకోవడం కోసం ఆయన ఎన్నో యుద్ధాలు చేసారు. అమూల్ సృష్టికర్తగా, మన దేశాన్ని ప్రపంచంలో పాల ఉత్పత్తుల్లో అగ్రగామి దేశంగా తీర్చిదిద్దటంలో శ్రీ కురియన్ కృషి అమోఘం. ఇలా తన ఎన్నో కలలను సాకారం చేసుకోవడం కోసం నిరంతరం పోరాడిన వ్యక్తి శ్రీ కురియన్. వీరితో కూడా దాదాపు పదిహేను సంవత్సరాలుకలిసి పని చేశాను. సమస్యలు ఎదురైనప్పుడు డాక్టర్ కురియన్ గారు డిప్రెషన్‌లోకి వెళ్లటం కాని లేక ఎందుకొచ్చిన తలనొప్పి అని, అన్నీ వదిలేసి వెళ్లిపోదామని ఆలోచించటంకాని నేనెన్నడూ చూడలేదు.

నాయకులు క్విట్టర్స్ కాదు.

ఈ సత్యాన్ని గ్రహించిన వారే ధీరోధాత్తులవుతారు.

సత్యమేమిటంటే...జీవితం ఒడిదుడుకుల మయం. దాన్ని అలాగే మనం అంగీకరించాలి.

విజయంలో మిడిసిపాటు, అపజయంలో అన్నీ కోల్పోయామన్న భావన పనికిరావు. ఎన్ని అడ్డంకులు ఎదురైనా, పలాయనం చిత్తగించరు నాయకులు. సహనం, ఓర్పు, ముందు చూపు వీరు ఎంచుకొన్న ఆయుధాలు.

చీమలు ఎలా వాటికి దుర్భరమైన చలికాలమంతా రాబోయే హాయినిచ్చే ఎండాకాలం గురించి ఆలోచిస్తూ, కష్టాలను అధిగమిస్తాయో చర్చించుకున్నాం. నాయకులందరూ అంతే. దిస్ టూ షల్ పాస్... ఈ ఇక్కట్లు కూడా పోయేవే అనే పాజిటివ్ దృక్పథం కలిగిన వారే తప్ప, పిరికిపందలు కారు నాయకులు.

**మరో ముఖ్యాంశం ఏమిటంటే, తమని తాము కించపరుచుకోరు.** తామెందుకూ పనికిరాని వారమనే భావోద్వేగానికి లోనుగారు.

ఆత్మబలం వారికున్న ఘన సంపద.

ముందుచూపు వారి అండ.

ముందుచూపు లేకుండా జీవించగలమా మనం.

ముందుచూపు అంటే రేపటి గురించి నిరంతరంగా విచారించటంకాదు. రేపు అనిశ్చయం అన్నారు కదా, మరి రేపటి కోసం ఎలా ప్లాన్ చేయటం, ఎందుకు ప్లాన్‌చేయటం అని మీరడగొచ్చు.

మంచి ప్రశ్నే!

ఒక రాజుగారు తన రాజ్యంలోని పలుప్రాంతాల్లో పర్యటిస్తూ అందరి బాగోగులు కనుక్కోవటం రివాజు. ప్రతిచోట ప్రతివ్యక్తికి ఏదో ఒక ఈతి బాధ, దిగులు, చింత! ఎక్కడా సంతోషంగా, తృప్తిగా ఉన్న వ్యక్తి తారసపడలేదు మన రాజుగారికి.

నా రాజ్యంలో ఒక్కడైనా లేడా ఎలాంటి దిగులు చింతా లేకుండా హాయిగా ఉండే వ్యక్తి అని అనుమానంగాఉండేది ఆయనకు. అలాంటి వ్యక్తి కోసం ఆయన వెతకసాగాడు. ఒక రోజున ఒక కుగ్రామంలో ఆయన వెళ్తుండగా ఓ వృద్ధుడు తన పొలంలో ఒక గుంట తవ్వుతూ కనబడ్డాడు.

గుర్రాన్ని ఆపి, ఆ వృద్ధుడిని ప్రశ్నించాడు రాజు "ఎవరయ్యా నీవు ఎందుకీ గుంట తవ్వుతున్నావు" అని.

రాజు గారిని గుర్తుపట్టిన వృద్ధుడు సంభ్రమాశ్చర్యాలకు లోనయి ఇలా అన్నాడు.

"రాజా... మామిడిచెట్లు నాటటానికని గుంత తవ్వుతున్నాను".

"ఎన్నాళ్ల తర్వాత ఈ మామిడి చెట్లు పండ్లనిస్తాయి" అని అన్నాడు రాజు.

"ఐదారేళ్లలో" అన్నాడు ఆ వృద్ధుడు.

"అయితే ఏం ప్రయోజనం" అన్నాడు రాజు. "నీవేమో వయోవృద్ధుడి లాగున్నావు. ఈ మామిడిచెట్టు పండ్లు ఇయ్యబోయే దాకా నీవు జీవించి ఉంటావా? ఇలా అడుగుతున్నందుకు ఏమీ అనుకోకు. నీ మనస్సులోని ఆలోచనను తెల్సుకుందామని అడుగుతున్నాను" అన్నాడు రాజు మళ్లీ.

"రాజా ఈ సంగతి నాకూ బాగా తెలుసు. నా కోసమని ఈ మామిడిచెట్లు నాటటం లేదు. నా పిల్లల కోసం, వారి పిల్లల కోసం నాటుతున్నాను. వీటి ఫలితాలు వారు అనుభవిస్తారు. నిజానికి ఈ మామిడిచెట్ల విత్తనాలు నాకు నా పూర్వీకుల నుంచి సంక్రమించినాయి. ముందు తరాల వారి కోసం నేను నేడీ చెట్లు నాటుతున్నాను" అన్నాడు ఆ వృద్ధుడు.

రాజు గారికి తన రాజ్యంలో సంతోషంగా జీవిస్తున్న వ్యక్తి కనబడ్డాడు. ముందు చూపు ఉన్నవ్యక్తి కూడా కనబడ్డాడు.

నిజానికి ముందు చూపు ఉన్నవారే సంతోషంగా జీవిస్తారేమో!

నలుగురికి మార్గదర్శకులవుతారేమో!

**అందుకే నాయకుడికి అవసరమైన ఎంతో ముఖ్యమైన అర్హత – ముందుచూపు కలిగి ఉండటం.** నేటిని సంపూర్ణంగా జీవిస్తూ, తనవారికోసం, సమాజం కోసం రేపటి గురించి ఆలోచించే వాడే నాయకుడు. విజేత.

# 11

# అభయమిచ్చువాడే అసలైన నాయకుడు

'ఆత్మన్యూనతను ఎదుర్కొనే మార్గాలు మీకు గోచరించటం లేదా? ఒక గొప్ప నాయకుడు మన అనుమానాలకు, సందేహాలకు విముక్తి కలిగించే మార్గదర్శకుడుగా గోచరించటం లేదా. మనలోని పిరికితనాన్ని, భయాన్ని పోగొట్టి మనలో నిద్రాణమైన నాయకత్వ లక్షణాలను వెలికితీసేవాడే అసలు సిసలైన నాయకుడు.'



**ఓ**వర్ కాన్ఫిడెన్స్ లేక లో సెల్ఫ్ ఎస్టీమ్...

స్వశక్తిపై మితిమించిన నమ్మకం లేదా ఆత్మన్యూనత – ఈరెండింటిలో ఏదో ఒక దానికి మనలో చాలామందిమి గురి అవుతాం. ఎక్కువ మోతాదులో ఆత్మ న్యూనతకే అని నిస్సందేహంగా చెప్పవచ్చు.

నా అభిమానులు ఎంతోమంది నాకు ఇ–మెయిల్ ద్వారా రాస్తూ ఉంటారు: భయంభయంగా ఉంటుంది. ఫలానా పని చేయాలనే తపన ఉంటుంది, చేయ గలమా లేదా అనే భయం, అనుమానం పీకుతుంటాయి. ఎలా వీటిలోంచి బయట పడాలో తెలియటం లేదని.

ఒక నాయకుడి అతిముఖ్య లక్షణం... సామాన్యులను అసామాన్యులుగా తీర్చిదిద్దటం, తన అనుచరులలో స్వాభావికంగా సంక్రమించిన సందేహాలను, భయాందోళనలను పారద్రోలటం. ఈ కార్యక్రమంలో కూడా ధీరూభాయ్ అందె వేసిన చేయి. నాలాంటి పలువురు సామాన్యులను తన టీములో చేర్చుకొని, ధైర్య సాహసాలు, ఆత్మ గౌరవం పెంపొందించి మార్గదర్శకులయ్యారు. ఏదైనా పని అసాధ్యంలాగా గోచరించినప్పుడు, అసాధ్యాలంటూ ఏవీ లేవు అన్నీ సుసాధ్యాలే అని నచ్చ చెప్పేవారు. ఏదైనా నష్టం సంభవిస్తే, నష్టాలు తనవి, లాభాలు మన అందరివీ అనేవారు. అంటితో ఆగకుండా తాను ఎలా కష్టపడి పైకొచ్చిందీ పదేపదే ఉదాహరిస్తూ ఉండేవారు. పుట్టుకతో విజేతలు ఎవ్వరూ ఉండరని, అందరూ శ్రమించి పైకొచ్చిన వారే అనేవారు.

మహాత్మాగాంధీ మనకో చక్కని ఉదాహరణ.

అందరి లాగా మీరూ, గాంధీజీ బాల్యంనుంచే అత్యంత ప్రతిభావంతుడని అనుకుంటూ ఉంటే అది సత్య దూరమే. స్కూల్‌లో కాని, యవ్వనంలో కాని ఆయన సాధించబోయే అసామాన్య విజయాల సంకేతాలు ఏవీ గోచరించవు మనకు.

చదువులో అతి సామాన్యమైన విద్యార్థి. అంతే కాదుఎంతో బిడియస్థుడు. ఇవేవీ ఆయన జాతిపిత కావటానికి అడ్డంకులు కాలేదు.

ఎంతో స్ఫూర్తిదాయకమైన నిజం ఇది!

సామాన్య జీవితాలు గడిపే మనలాంటి ఎందరికో ధైర్యాన్ని, మార్గదర్శకత్వాన్ని చేకూర్చేది గాంధీజీ జీవితం.

గమ్యాలతో, పట్టుదలతో, శ్రమతో మనం కూడా ఏదైనా సాధించవచ్చనే నిజాన్ని మన కళ్లముందుంచే ఇటీవలి జీవిత గాథ.

పురాణ కాలం నాటి కథకాదు ఇది.

మనకు తెల్సిన ఒక నిజజీవిత గాథ.

సామాన్య కుటుంబంలో, సామాన్య కులంలో పుట్టినగాంధీకి తన మీద తనకు ఎంతో తక్కువ అభిప్రాయం, ఆత్మన్యూనత ఉండేవి. ఫలితంగా స్కూల్లో ఇతరులతో కలిసి మెలిసి ఉండటం గాని, చదువు మినహా ఇంకా ఎలాంటి కార్యక్రమాల్లో పాల్గొనటం కాని చేసేవాడు కాదు. తన అసమర్థతను ఇతర విద్యార్థులు గుర్తించి, కించపరుస్తారేమోననే భయం దీనికి మూలకారణం. ఇల్లు, క్లాసు రూము, ఇల్లు – ఇదే కార్యక్రమం.

చిన్నతనంలోనే... పదమూడేళ్లవయస్సులోనే గాంధీజీకి పెళ్లయింది. గాంధీజీ ఆత్మన్యూనత ఇక్కడా ప్రతిబింబించేది.

అసహనం, ఈర్ష్య, అసూయలతో నిండిపోయింది ఆయన కాపురం.

కథ ఇక్కడితో ఆగలేదు.

చదువులో కూడా ఎన్నో తిప్పలు. ఎలాగోలా స్కూలు చదువు ముగించుకొని, మెడికల్ కాలేజీలో చేరాడు. అయితే ఇది మూణ్ణాళ్ల ముచ్చటగానే మిగిలిపోయింది. మెడికల్ కాలేజీలో ఘోరంగా విఫలంకావటంతో, కాలేజీ నుంచి తీసివేయబడ్డాడు. ఎంత అవమానమో కదూ! ఆయన మెడికల్ విద్య కేవలం ఐదు మాసాలే సాగింది.

గాంధీని ఎలాగోలా చదువులో గట్టెక్కించే ప్రయత్నంలో భాగంగా ఆయన్ను ఇంగ్లాండ్ పంపిద్దామనే నిర్ణయానికొచ్చారు ఆయన, ఆయన కుటుంబ సభ్యులు. న్యాయశాస్త్రం చదవ గలడనే ధైర్యంతో, కుటుంబ వనరులనుపోగు చేసి గాంధీజీని లండన్ పంపారు, ఒక కొత్త అధ్యాయం మొదలవుతుందనే నమ్మకంతో.

అక్కడా ఎన్నో సమస్యలు, ఎదురు దెబ్బలు!

లండన్ వాతావరణానికి సర్దుకుపోవటం చాలా కష్టమైంది గాంధీకి. పైగా ఆయన వేసుకునే డ్రస్సు, ఆయన ఇంగ్లీషు భాష నగుబాటుకి కారణా లయ్యాయి. పూర్ డ్రెస్ సెన్సు, తక్కువ ఇంగ్లీషు భాషా పరిజ్ఞానం ఈ నగుబాటుకి కారణాలు.

దీని లోంచి బయటపడటానికని ఎంతో కష్టపడి చదివేవాడు, మంచి మార్కులొస్తే తనను ఇతరులు గౌరవిస్తారేమోనని. ఫ్రెంచి భాష నేర్చుకోవటం,

కొత్త సూట్లు వేసుకోవటం, డాన్సింగ్‌లో ప్రావీణ్యం పొందాలనుకోవటం, ఆత్మన్యూనత నుంచి, ఇతరుల నగుబాట్ల నుంచి విముక్తి పొందటానికే.

అయితే జరిగింది వేరొకటి. డబ్బు త్వరగా కరిగిపోవటం మొదలైంది. పొదుపు ఉద్యమంలో భాగంగా, ఉంటున్న హోటల్‌ని ఖాళీచేసి ఒక చిన్న రూములోకి మారాడు. కాలేజీకి బస్సులో వెళ్లటం మానేసి, నడుస్తూ వెళ్లేవాడు. ఆహార అలవాట్లను పూర్తిగా మార్చుకున్నాడు. అందుకే అలవాటుపడిన ఇంగ్లీష్ మీల్స్ నుంచి పూర్తి శాకాహారానికి మారిపోయాడు. ఈ అలవాట్లే మున్ముందు తాను అవలంబించబోయే సింపుల్ లివింగ్‌కి, ఆరోగ్య సూత్రాలకి మూలాధారాలైనాయి.

లా పరీక్షల్లో పాస్ కాగానే, లండన్ బార్‌లో అడ్మిషన్ దొరికింది. అయితే మాతృదేశాన్ని చూడాలనే తపనతో ఇండియాకు బయల్దేరాడు. ఆయన ప్రయాణంలో ఉండగానే తల్లి మరణం గురించి వినాల్సి వచ్చింది.

బాంబేలో అయితే తల్లి జ్ఞాపకాల నుంచి బయటపడవచ్చనే భావనతో అక్కడ లాయర్‌గా ప్రాక్టీసు మొదలు పెట్టాడు. ఈ ప్రయత్నమూ దెబ్బతీసింది గాంధీని. ఇండియన్ లాస్ గురించిన పరిజ్ఞానం తక్కువగా ఉండటంతో ఆయనకు కేసులు వచ్చేవి కావు. అతి కష్టం మీద ఒక కేసు వచ్చింది. అయితే అదీ ఎంతో అవమానంతో ముగిసింది. స్టేజ్ ఫ్రైట్‌తో (సభా పిరికితనం) కేసును వాదించలేక కోర్టులోంచి నిష్క్రమించాడు. ఆయనతోటి లాయర్ ఆ కేసును వాదించాడనుకోండి అది వేరే విషయం. రాకరాక ఒక కేసు రావటం, దాన్ని సభా పిరికితనంతో వాదించలేక తప్పుకోవటం ఎంత అవమానమో ఆలోచించి చూడండి.

ఒక్కసారి గాంధీజీ జీవితంలోకి తిరిగి చూస్తే చిన్నప్పటి నుంచి తన వ్యక్తిత్వంపై ఎన్నో అనుమానాలు, భయాలు, ఆత్మన్యూనత; భార్య మీద అసూయ చిరాకు; చదువు సమస్యలు.... లండన్‌లో ఇతర విద్యార్థుల నుంచి నగుబాట్లకు లోనుకావటం, డబ్బుల్లేక ఆహార ఆలవాట్లు మార్చుకోవటం... ఇలా ఎన్నెన్నో.... వీటన్నిటిని అధిగమించి మన దేశానికి స్ఫూర్తిని, స్వాతంత్ర్యాన్ని, గౌరవాన్ని ఇచ్చాడు. జాతిపిత గాంధీజీగా మన గుండెల్లో నిలిచాడు. మన ఇళ్లల్లో పూజలందుకుంటున్నాడు.

ఇది చదివాక, ఆత్మన్యూనతను ఎదుర్కొనే మార్గాలు మీకు గోచరించటం లేదా? ఒక గొప్ప నాయకుడు మన అనుమానాలకు, సందేహాలకు విముక్తి కలిగించే మార్గదర్శకుడుగా గోచరించటం లేదా.

మనలోని పిరికితనాన్ని, భయాన్ని పోగొట్టి మనలో నిద్రాణమైన నాయకత్వ లక్షణాలను వెలికితీసేవాడే అసలు సిసలైన నాయకుడు.

# 12

# సాలె పురుగు కథ

‘ఎన్నో బలహీనతలు, సందేహాలు, ఇవేవీ ఆ మహాత్ముణ్ణి ఆపలేదు. జాతిపితగా ఎదగటంలో అడ్డుపడలేదు. మనమూ అంతేనేమో! ఏవీ మనకు అడ్డంకులు కావేమో!! మనను నేడు ఎదుర్కొంటున్న సమస్యలను, మనమూ తొలగించు కోవచ్చునేమో!’



పేరున్న ఓ ప్రొఫెసర్ గారు తనఉపన్యాసాన్ని సరికొత్త రీతిలో మొదలు పెట్టారు. జేబులోంచి ఐదొందలరూపాయల నోటుని తీసి, తన శ్రోతలకు చూపించి "ఇది ఎవరికి కావాలో చేతులెత్తండి" అన్నారు.

దాదాపుగా అందరూ తమతమ చేతులెత్తారు.

ఐదొందల రూపాయల నోటుని ఉండచేసి మళ్లీ అడిగారు తన శ్రోతలను: "ఈ నలిగిపోయిన నోటు ఎవరికి కావాలో చేతులెత్తండి" అని.

కొంతమంది మినహా మళ్లీ అందరూ చేతులెత్తారు.

ఈసారి ఐదొందల నోటుని తన బూటు కాలుతో ఫుట్‌బాల్‌లాగా ఆడుకుని మళ్లీ ప్రశ్నించారు : "హీనావస్థలో ఉన్న ఈ నోటు ఎవరికి కావాలో చేతులెత్తం"డని.

ఈసారి కూడా చాలమందే చేతులెత్తారు.

"ఇదీ సంగతి... ఎంత హీన స్థితిలో ఉన్నా డబ్బు తన విలువ ఎలా కోల్పోదో, మనం కూడా అంతే. ఎన్ని కష్టనష్టాలు ఎదుర్కొన్నప్పటికి, మన విలువ సమసిపోదు. అలాగే ఉండిపోతుంది. దానిని గుర్తించి సరైన మార్గంలో ఉపయోగించుకోవటమే మన గమ్యంగా మారాలి"...

చప్పట్లతో క్లాస్‌రూమ్ మార్మోగిపోయింది.

పలు శంకలతో, అనుమానాలతో మనని మనం చిన్న చూపు చూసుకుంటూ, జీవితాన్ని అస్తవ్యస్తం చేసుకోవాల్సిన పనిలేదు. భగవంతుడు మనందరికి ఏదో ఒక సామర్థ్యం ఇచ్చాడు పుట్టుకతోనే. దాన్ని గుర్తించి మెరుగుపరుచుకుని, ధైర్యంగా ముందుకు సాగిపోవచ్చు.

ఒక మార్గదర్శకుడు, ఒక గురువు, ఒక నాయకుడు, ఒక టీమ్ లీడర్ మనకెంతో మేలు చేస్తారు మన ప్రయాణంలో.

మానవ మనస్సును పలు విధాలుగా విశ్లేషించారు పెద్దలు.

అసలే కోతిట!

ఆ పైన కల్లు తాగిందట!

ఆ కల్లు తాగిన కోతిని తేలు కుట్టిందట!!

కథ ఇంతటితో ఆగలేదు. కల్లు తాగిన కోతిని తేలు కుట్టటమే కాకుండా, దాన్నో దయ్యంబట్టిందట.

ఇంత రాద్ధాంతం జరిగిన కోతి లాంటిది మన మనస్సు అని వర్ణించారు పెద్దలు.

నిలకడ కావాలి.

ప్రోత్సాహం కావాలి.

గైడెన్స్ కావాలి.

వీటిని సమకూర్చేది మనం నమ్మి గౌరవించే నాయకుడు.

అటువంటి నాయకుని లక్షణాల గురించి వ్యవహార తీరును గురించి మనం ముచ్చటించు కొంటున్నాం. ప్రతి వ్యవస్థకి ఒక నాయకుడు ఎంతో అవసరం. నాయకుడు లేని వ్యవస్థ అల్లకల్లోలమౌతుంది. సమర్థుడైన నాయకుని వల్ల అతనికే కాక అతని వ్యవస్థలోని సభ్యుల్లో కొంతమంది కాలక్రమేణా ప్రతిభా పాటవాలు గల నాయకులుగా మారుతారు. నాయకుడికి ఎంత బాధ్యత ఉందో అనుచరుడికి అంతే బాధ్యత ఉంటుంది, ఏదైనా మంచి జరాగలంటే.

నాయకులుగా రూపాంతరం చెందిన పలు వ్యక్తులు, మనలాగే సామాన్యులుగా జీవితాలు ఆరంభించి, గమ్యాలతో, కృషితో ముందంజ వేశారు. గత వ్యాసంలో మహాత్మా గాంధీ గురించి చర్చించుకున్నాం.

ఎన్నో బలహీనతలు, సందేహాలు, సమస్యలు... ఇవేవీ ఆ మహాత్ముణ్ణి ఆపలేదు. జాతిపితగా ఎదగటంలో అడ్డుపడలేదు. మనమూ అంతేనేమో! ఏవీ మనకు అడ్డంకులు కావేమో!! మనను నేడు ఎదుర్కొంటున్న సమస్యలను, మనమూ తొలగించు కోవచ్చునేమో!

నా చదువు ఎస్ఎస్ఎల్సితో ఆగిపోయింది. పరిణామంగా ఇంగ్లీషు భాష మీద పట్టుచిక్కలేదు. ఉచ్చారణలో పలు సమస్యలు ఎదురయ్యేవి. ఏదో సినిమాలో అమితాబ్ బచ్చన్ చెప్పినట్లు, ఇంగ్లీషు చాలా ఫన్నీ లాంగ్వేజి.... బి యూ టిని బట్ అంటారు. పి యూ టిని పట్ అనరు – పుట్ అంటారు – రకరకాల ఉచ్చారణలు.

కొన్నేళ్లు కాలేజీలో, ఇతరత్రా గురువుల వద్దనో ఇంగ్లీషు భాషను అభ్యసించకపోతే, పలు సమస్యలు ఎదురౌతాయి. ఈ సమస్యలన్నీ కొన్ని దశాబ్దాల పాటు ఎదుర్కొన్నాను. ఒక సహోద్యోగి అయితే నాముఖం మీదే అనేశాడు నీ ఇంగ్లీషు చాలా భయంకరంగా ఉంటుందయ్యా అని. ముప్పైయేళ్లు దాటినా నేను దాన్ని మరచిపోలేదంటే ఎంతగా హర్ట్ అయ్యానో మీరు ఊహించుకోవచ్చు.

మరో సమస్య...

అవసరానికి మించిన బిడియం !

ఒక పక్కన వ్యాపార భాష అయిన ఇంగ్లీషు మీద పట్టు లేకపోవటం, మరో వైపు అంతులేని బిడియం. ఎవరితోనైనా మనసు విప్పి మాట్లాడాలన్నా, కొత్త పరిచయాలు చేసుకోవాలన్నా మహాకష్టంగా ఉండేది. ఈ కారణాల వల్ల భయంకరమైన ఆత్మన్యూనత పెరిగింది నాలో.

సరైన క్వాలిఫికేషన్లు లేవు, మిత్రులు లేరు.

ఇంగ్లీషు భాష సరిగ్గా రాదు.

దేశం కాని దేశంలో గుజరాత్‌లో నివాసం...

వీటికి తోడుగా చాలా ఏళ్లు లోటు బడ్జెట్.... ఎప్పుడూ డబ్బుకి ఇబ్బందే. ఇవన్నీ పెను సమస్యలే కదా! అయినా సరే వీటన్నిటిని అధిగమించి, కలలను సాకారం చేసుకోగలిగాను.

మా గురువుగారు ధీరుభాయి నాకు ధైర్యాన్ని, గమ్యాల్ని, మార్గదర్శకత్వాన్ని ఇచ్చారు. సో ఒక గురువో, గురుతుల్యులో లేక మనం ఆరాధించే ఒక వ్యక్తో మనకు ఎంతో అవసరం. లేకుంటే అనుమానాలు అనుమానాలు గానే, బలహీనతలు బలహీనతలుగానే మనలో మిగిలిపోతాయి. మనలో గూడుకట్టుకు పోయిన నిరాశ, నిస్పృహలను పారదోలటం కష్టతరమై పోతుంది.

ఒక గురువంటూ దొరికాక గుడ్డిగా నమ్మటమే; లేకుంటే అవే సమస్యలు అనుమానాలు.

స్వామి వివేకానంద గురించి చదివే ఉంటారు. గురువు కోసం ఎంతో అన్వేషణ చేశాడు. రామకృష్ణ పరమహంస గురించి విని ఆయన వద్దకు వెళ్లి సూటిగా ప్రశ్నించాడు మీరు దేవుణ్ణి చూచారా? అని. ఆ చూచాను, ఎదురుగా ఉన్న ఆ గోడ ఎంత స్పష్టంగా ఉందో అంత స్పష్టంగా.... అన్నాడు ఆ పరమహంస. మరి నాకూ చూపిస్తారా అన్నాడు వివేకానంద. తప్పకుండా.... నాతో ఉండిపోతే, నేను చెప్పింది చేస్తే అన్నాడు పరమహంస.

గురువు... గురువుకు తగ్గ శిష్యుడు... రామకృష్ణ పరమహంస, వివేకానందులు. జ్ఞాన దీపికలు.... మహోన్నతులు, మార్గదర్శకులు, భారతీయ ధర్మానికి, సంస్కృతికి పట్టం కట్టిన మహానుభావులు.

మంచి గురువుని ఎంచుకొని సంపూర్ణంగా నమ్మటం, మనందరి ముందున్న ఒక మంచి దారి. మనలో ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించి, గమ్యాన్ని ఏర్పరచగలడు ఈ మహాశయుడు.

ఒకప్పుడు రెండు రాజ్యాల మధ్య పోరులో పెద్ద సైన్యం కల రాజుగారు, చిన్న సైన్యం కల రాజు గారిని ఇట్టే ఓడించగలిగాడు. ఓడిపోయిన రాజు నశించిపోయిన తన సైన్యాన్ని చూచి, యుద్ధరంగం నుంచి పారిపోయి ఒక కొండ గుహలోపడుకున్నాడు. దిక్కుతోచక గుహలో తన కెదురుగా ఉన్న గోడను అదేపనిగా చూస్తున్నాడు.

ఒక సాలెపురుగు తన గూడు చేరుకోవటానికి నానా అవస్థలు పడుతూంది. జారిపడను, తిరిగి ఎక్కను, మళ్లీ జారిపడను, ఎక్కనూ.... విసుగూ విరామం లేకుండా శ్రమించి చివరికి తన గూడు చేరుకుంది సాలె పురుగు.

ఇంత అల్పజీవి కష్టాలను ఎదుర్కొని గమ్యాన్ని చేరుకొన్నప్పుడు, నేను ఒక రాజునై ఉండి నా గమ్యాన్ని చేరుకోలేనా అని అనుకుని తన రాజ్యానికి వెళ్లి కొత్త సైన్యాన్ని తయారు చేసుకొని, పోరాడి తిరిగి తన రాజ్యం సంపాదించుకున్నాడు.

రాజుగారి గురువు ఎవరో తెలుసా!

చిరు ప్రాణి సాలె పురుగు.

అంకుంఠిత దీక్షతో, శ్రమతో గమ్యం చేరుకొంది... మార్గం చూపించింది రాజుగారికి.

సాలె పురుగుకి ఉన్న ఓర్పు, పట్టుదల మనకి లేవా?

# 13

# విచక్షణతోనే విజయం

'స్వతహాగా బలహీనులం మనం. మన బలహీనతలే మనకు కొట్టొచ్చినట్లు మన కళ్లముందు నిలబడ్తాయి. మన బలం మరుగున పడిపోతుంది. అందుకే మనం చేసే ప్రతిపనీ ఇతరుల మెప్పు పొందాలని ఆశిస్తాం. మనం ఎవర్నుంచి మెప్పు పొందాలని ఆశిస్తున్నామో, వారూ మనలాంటి వారే కదా!! అంటే వారూ బలహీనులే కదా! మరి వారి మెప్పు దేనికి మనకు?'



**ఒ**క రోజున ఓ పెద్దమనిషి, ఆయన కొడుకు పట్నం వెళ్లారు గుర్రం కొందామని. చాలా గుర్రాలను చూచాక, చివరికి ఒక జాతి అశ్వాన్ని కొన్నారు బోల్డెంత డబ్బు పోసి.

ఆనందంగా గుర్రమెక్కి తండ్రికొడుకులు బయల్దేరారు స్వగ్రామం దిశగా.

దారిలో కొంతమంది ఎదురయ్యారు వీరికి.

వారిలో ఒకడు వీరిద్దరినీ చూచి "ఏం మనుషులయ్యా వీళ్లు... ఒక పక్క ఆ గుర్రం వీరి బరువును మోయలేక రొప్పుతూ ఉంటే ఏం పట్టకుండా వీళ్లిద్దరు ఎంతో సంతోషంగా స్వారీ చేస్తున్నారు?" అని అన్నాడు.

తండ్రీకొడుకులు నిశ్చేష్టులయ్యారు.

తండ్రి తక్కున గుర్రం మీది నుంచి దిగి, గుర్రం పక్కనే నడవటం మొదలుబెట్టాడు.

కొంచెం దూరం వెళ్లాక ఒక కుగ్రామం, కొన్ని దుకాణాలు కనిపించాయి.

ఓ దుకాణాదారుడు వీరిని చూచి "సిగ్గు ఎగ్గు లేదు ఆ యువకుడికి ! ఎంచక్కా గుర్రం స్వారీ చేస్తున్నాడు! పెద్దాయనేమో పక్కన కాళ్లీడ్చుకుంటూ నడుస్తున్నాడు. కలియుగం, కలియుగం" అని విస్తుబోయాడు.

కొడుకు మనస్సు చివుక్కుమన్నది. గుర్రం దిగి తండ్రిని స్వారీ చేయమన్నాడు.

తండ్రి స్వారీ చేస్తుండగా కొడుకు పక్కనే నడుస్తున్నాడు.

కొంచెం దూరం వెళ్లాక ఒక చిన్న చెరువు, దాంట్లో బట్టలు ఉతుక్కుంటూ పలువురు ఆడా మగా కనబడ్డారు వీరికి.

వారిలో ఒకావిడ "ఎంత వింతకాలమొచ్చి పడింది. కొడుకు అలాగా నడుస్తూ ఉండటమేమిటి? తండ్రి గుర్రం స్వారీ చేయటమేమిటి!?! ఎంత దుర్మార్గుడో కదా ఆ తండ్రి" అని వాపోయింది.

తండ్రి వెంటనే గుర్రం దిగేశాడు.

తండ్రికొడుకు లిద్దరికి కోపోద్రేకాలు ముంచు కొచ్చినాయి.

గుర్రాన్ని కొన్నందుకు తమని తాము దూషించుకొని ఆ గుర్రాన్ని బలంగా తన్నారు. అది క్షణాల్లో పారిపోయింది ఎవ్వరికీ అందనంత దూరంగా.

తండ్రీకొడుకు హాయిగా ఊపిరి పీల్చుకొని తమ గ్రామానికెళ్లారు.

ఎంత వెర్రివాళ్లో కదా!

తరచి చూస్తే అటువంటి వాళ్లు, అటువంటి మనస్తత్వం మనలో చాలా మందిలో ఉంటుందేమో.

రామాయణ కాలంలో ఎవరో చాకలాయన మహాసాధ్వి సీత గురించి అవాకులు చవాకులు పేలితే, ఆమెను రామచంద్రుడు అడవిపాలు చేశారని విన్నాం కదా... మనపై ఇతరులకున్న అభిప్రాయాలు ఎంతో ప్రాముఖ్యత సంతరించు

కుంటాయి. ఎందుకో మనకే తెలీదు! ఇరుగమ్మలు, పొరుగమ్మల దగ్గర్నుంచి ప్రతివారు మన గురించి మంచిగా ఆలోచించాలనే తపన మనలో పొంగిపొరలుతూ ఉంటుంది.

ఎందుకంటారు?

ఎందుకంటే స్వతహాగా బలహీనులం మనం.

మన బలహీనతలే మనకు కొట్టొచ్చినట్లు మన కళ్లముందు నిలబడ్తాయి. మన బలం మరుగున పడిపోతుంది. అందుకే మనం చేసే ప్రతిపనీ ఇతరుల మెప్పు పొందాలని ఆశిస్తాం. మనం ఎవర్నుంచి మెప్పు పొందాలని ఆశిస్తున్నామో, వారూ మనలాంటి వారే కదా!! అంటే వారూ బలహీనులే కదా! మరి వారి మెప్పు దేనికి మనకు? మనల్ని మనం మెచ్చుకోలేని వాళ్లం, ఇతరుల మెచ్చుకోలును కాంక్షించటం కొంచెం హాస్యాస్పదంగా ఉంటుంది కదా!

బలహీనతల్ని జయించటమే సర్వత్రా వ్యాపించిన ఈ సమస్యకు పరిష్కారం. ముందుగా మన బలహీనతలేమిటో గుర్తించి వాటి నుంచి విముక్తులవటమే మన ముందున్న ప్రాథమిక కర్తవ్యం.

మరొకరి మెప్పు కాదు మనకి కావల్సింది, ఏది సవ్యమో, ఏది అపసవ్యమో గ్రహించే తెలివితేటలు, విజ్ఞత, నేర్పరితనం మనం సంపాదించు కోవటమే ఈ సమస్యకి పరిష్కారం. దీన్నే కదా విచక్షణా జ్ఞానం అనేది.

తుఫాను మధ్యలో నిల్చొని, తుఫానుని నిందిస్తే నిష్ప్రయోజనమే కదా! తుఫాను నుంచి బయటపడే మార్గం కోసం ప్రయత్నించాలి.

సీతారామాంజనేయం గురించి వినే ఉంటారు మీరు. రావణుడి వధ పిదప శ్రీ సీతారామచంద్రులు పట్టాభిషిక్తులై తమకు సహకరించిన అందరికీ ధన్యవాదాలు చెప్తారు. తర్వాత వారందరినీ తగురీతిన సత్కరించే పనిలో ఉంటారు. అందరికీ సత్కారాలు ముగుస్తాయి ఒక్క హనుమంతుడికి మినహా.

అతి మూల్యమైన బహుమతితో ఆంజనేయుని సత్కరించాలనేది సీతా రామచంద్రుల అభిలాష. కోశాగారం అంతా వెతికి ఒక అమూల్యమైన వజ్రాల హారాన్ని తెప్పించి అది ఆంజనేయునికి బహుకరిస్తారు సీతారాములు.

దాన్ని ఎంతో దీక్షగా పరీక్షించి, ఆ వజ్రాలను పగలగొట్టడం మొదలుబెట్టాడు హనుమంతుడు! ఎంతో విస్మయులై, ఎందుకలా చేస్తున్నావని అడగగా, ఈ వజ్రాల్లో చైతన్యమూర్తి అయిన శ్రీరాముడున్నాడేమోనని పరీక్షిస్తున్నానంటాడు హనుమ.

తమ శిష్యుని ఆలోచనను మెచ్చుకొని, ఆంజనేయునికి సీతారాములు సత్యాన్ని బోధిస్తారు. దాన్నే సీతారామాంజనేయం అంటారు.

జ్ఞానం గురించి, విజ్ఞానం గురించి విశదీకరిస్తారు సీతారాములు హనుమకి.

ఆకలైనప్పుడు ఆహార వర్ణన కాదు, ఆహారం కావాలి.

బీదవాడికి భోగభాగ్యాల వర్ణన, కాదు కొంచెం ధనం కావాలి. ఇలా ఎన్నో ఉపమానాలిస్తారు జ్ఞానానికి, విజ్ఞానానికి మధ్య ఉన్న తేడా గురించి.

అనుభవంతో కూడిన జ్ఞానాన్ని విజ్ఞానమంటారు. కేవలం విషయ అవగాహనను జ్ఞానమంటారు. సైన్సులో థియరీ, ప్రాక్టికల్స్ క్లాసెస్ లాంటివి ఈ రెండు. థియరీ సిద్ధాంతం కాగా, ఆ సిద్ధాంతాన్ని అనుభవంగా మార్చుకోవటం ప్రాక్టికల్ క్లాసు – విజ్ఞానం.

మన జ్ఞానాన్ని విజ్ఞానంగా చేయగల సమర్థుడు మన గురువు, మన నాయకుడు. మన కోచ్.

తుఫానులో చిక్కుకొని ఉంటే ఎలా బయటపడాలో చెబుతాడు ఈ మహాశయుడు.

ముద్రా సంస్థ నిర్వహణలో కాని, ఇతర విషయాల్లో కాని దరీ దోవ కానక చింతాక్రాంతుడనైన నాకు ఎన్నోసార్లు దారి చూపించారు మా గురువుగారు ధీరూభాయి.

మనలోని బలహీనతలు, ఇతరులకూ ఉంటాయనే సత్యం మనం గ్రహిస్తే అడుగడుగునా ఇతరుల మెచ్చుకోలుతో అవసరముండదు.

ప్రతిపనికి ఇతరుల మెచ్చుకోలు అవసరమయితే ఈ వ్యాసం మొదట్లో మనం చెప్పుకొన్న కథలాగా మన జీవితాలు దీనంగా మారిపోతాయి.

మన జీవితాలు మనవి. వాటిని నిర్దేశించే హక్కు ఎవ్వరికీ లేదు.

ఆత్మన్యూనత, బలహీనతల నుంచి బయటపడి, జీవిత సాఫల్యం కోసం ప్రయత్నించటమే మన ముందున్న ఏకైక మార్గం. ఈ ప్రయత్నంలో చేయూతనిచ్చి, మార్గదర్శకం చేయగలిగేది మన నాయకుడు మాత్రమే. ఏమంటారు?

# 14

# లీడర్ అంటే మేనేజర్ కాదు

'మేము నాయకులమనుకునే వారు పలు సార్లు మేనేజర్‌కి, లీడర్ షిప్‌కి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని గమనించక రెండూ ఒకటే అనుకుంటారు. ఇది మొదటి తప్పిదం. మేనేజర్ ఒక బాధ్యతను నిర్వర్తించగలగాలి. లీడర్ కొంతమంది సమష్టి కృషికి, ఫలితాలకు, ఉన్నతికి బాధ్యత వహించాలి.'



ది ఆర్గ్యుమెంటేటివ్ ఇండియన్ – అనే పుస్తకం ఉంది మీరు చదివారో లేదో? "వాదించే భారతీయుడు" అని చెప్పుకోవచ్చు తెలుగులో.

ఈ మధ్య ఒక ఇంగ్లీషు టీవీ చానల్ టాక్‌షోలో పాల్గొన్న అందరూ ఒక్క విషయం మీద మటుకు ఏకాభిప్రాయాని కొచ్చారు. మన భారతీయులందరం ఎంచక్కా ఎల్లవేళలా అన్ని విషయాల మీద వాదించుకుంటూ ఉంటామని, దేని మీద అంత తేలికగా ఒక అంగీకారానికి రామని.

చిన్నా పెద్దా, ముసలి ముతకా, ఆడామగా తేడా లేకుండా అన్ని విషయాల గురించి అందరం అంతుపంతూ లేకుండా వాదించుకుంటూనే ఉంటాం. అంతేకాదు ఎదుటివారిని మాట్లాడనివ్వం... పైగా అందరం ఒకేసారి మాట్లాడతాం.

అరుస్తాం. టీవీ చాట్‌షోల్లో, ఇళ్లలో, పార్లమెంట్‌లో, అసెంబ్లీల్లో, మీటింగుల్లో కాని, కంపెనీ బోర్డు రూముల్లో గాని అన్ని చోట్ల నలుగురు చేరినప్పుడు అందరూ అర్గ్యూ చేయటం, అదీ ఒకేసారి గొంతెత్తి అరుస్తూ చేయటం నిత్య జీవితంలో మనందరికి అనుభవంలోకి వచ్చిందే. ఇది మనకో సంప్రదాయంగా మారింది.

ఎందుకింతగా ఆర్గ్యూచేస్తాం మనం? ఎదుటివారు చెప్పే విషయాలపైనా మనకు అవగాహన ఉందనే భ్రమలో మనమెందుకుండిపోతున్నాం? ఈ విషయంపై నాకో చిన్న థియరీ ఉంది. మనం మాటలు నేర్చుకొనే వయసులో మన తల్లిదండ్రులు మనకు మాట్లాడటం నేర్పారు కాని, వినటం నేర్పలేదు! సో, మనం అలా మాట్లాడుకుంటూ పోతూ ఉంటాం, ఎదుటివారు వింటున్నా లేకున్నా. మరో ముఖ్య విషయమేమిటంటే, మనకు ఎవ్వరూ ఏ విషయంలోనూ నిష్ణాతులుగా కనబడరు. మనకు అన్నీ తెలుసనుకుంటాం!

ఈ ఉపోద్ఘాతం దేనికనుకుంటున్నారా?

అన్నా హజారే ఉద్యమకాలంలో, ఆ తర్వాత ఎందరో రకరకాల అభిప్రాయాలు వెళ్లబుచ్చారు. వారిలో కొంతమంది పేరు ప్రతిష్ఠలు ఉన్నవారు, రాజ్యాంగ విషయాలమీద అవగాహన ఉన్నవారు కాగా చాలా మంది మనకు నామమాత్రంగా కూడా తెలియనివారే. వీరందరి నుంచి పార్లమెంటరీ వ్యవస్థ భ్రష్టుపట్టిపోతుందనే వాదన మొదలుకొని, రకరకాల వాదనలు విన్నాం, చదివాం. సూపర్ స్టార్ అమీర్‌ఖాన్ చేసిన వ్యాఖ్య నాకు ఎంతో నచ్చింది. ఆయన అన్నాడు 'పలువురు తమతమ లాభాలకు, ప్రయోజనాలకు లాబీయింగ్ చేసి కొత్తకొత్త చట్టాలు, మార్పులు చేస్తూ ఉంటే, భారత ప్రజలు మనందరి మంచి కోసం లాబీయింగ్ చేయటంలో తప్పేంటి' అని. అమీర్ ఖాన్ మంచి నటుడే కాదు, మంచి ఆలోచనాపరుడనిపించింది నాకు.

కులాలు, మతాలు, ప్రాంతాలే కాకుండా, అన్ని రకాల వ్యాపారస్థులు, ఉద్యోగస్థులు అందరు తమతమ లబ్ధికై లాబీయింగ్ చేస్తుండగా, లంచాల మహమ్మారి నుంచి మనను మనం రక్షించుకోవటానికి మనం లాబీయింగ్ చేయటంలో తప్పేమిటో నాకు అర్థం కావటం లేదు. దీనివల్ల ప్రజాస్వామ్యం బలపడిందేకాని, బలహీనపడలేదే!

ప్రజల కోసమే కదా ప్రజాస్వామ్యం.

ప్రతి విషయానికి ఒక సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్ అంటే రంగానికి సంబంధించిన నిపుణుడు ఉంటాడు. అలాంటి వారి ఉద్దేశాలు, ప్రతిపాదనలు మనకు శిరోధార్యమైతే, భవిష్యత్తు స్పష్టంగా, సాఫీగా ఉంటుంది. లేకుంటే గందరగోళంగా మారిపోతాయి మన జీవితాలు. ఈ గందరగోళం నుంచి మనను వెలుపలికి లాగి మార్గదర్శకత్వాన్ని ఇచ్చేది మంచి నాయకులు.

నాయకత్వం అంటే టెక్స్ట్‌బుక్ అర్థం తెలుసుకుందామని గూగుల్‌కి వెళ్లి లీడర్‌షిప్ అని టైప్ చేశాను. ఎన్ని ఫలితాలు కనబడ్డాయో మీరు ఊహించగలరా? దాదాపు నలభై రెండు కోట్లు. మరో ప్రశ్న వేశాను గూగుల్‌ని... నాయకత్వమంటే ఏమిటి అని? వాట్ ఈజ్ లీడర్‌షిప్? ఇరవై తొమ్మిది కోట్ల పైచిలుకు ఫలితాలు కనబడ్డాయి.

నాయకత్వం మహా సముద్రంలాంటి ఒక లోతైన సబ్జెక్ట్ అని అర్థమైంది. సరైన మార్గదర్శకత్వం లేకపోతే, మరింత గందరగోళానికి లోనవుతాము. వివేకానందుడి లాగా సరైన గురువు కోసం మనం వెతుక్కుంటూ వెళ్లలేము. కనుక మన టీమ్ లీడర్‌కాని, మనం ఎంచుకొన్న గురువు కాని మనకు ఆదర్శప్రాయుడో కాదో తెలుసుకోవటానికి రెండు మూడు సూత్రాలు విశదీకరిస్తాను.

లీడర్‌షిప్ అంటే ఒక గ్రూపు తాము ఎంచుకొన్నగమ్యం చేరుకునే దిశగా దారి చూపే నాయకుడు. ఆ లక్షణాన్ని నాయకత్వం అంటారు. నాడు భారతీయుల గమ్యం స్వాతంత్ర్యం... మహాత్మాగాంధీ నాయకత్వం వహించారు ఈ గమ్యాన్ని మనం చేరుకోవటంలో. నేడు భారత దేశాన్ని లంచగొండితనం నుంచి విముక్తి చేయటం మనందరి గమ్యం... ఈ దిశగా మనకు మార్గదర్శి, నాయకుడు అన్నా హజారే. ఇదే సూత్రం కుటుంబాలకి, సంఘానికి, రాష్ట్రానికి, దేశానికి... అందరికీ వర్తిస్తుంది. ఇటువంటి యజ్ఞాల్లో అందరూ భాగస్వాములు కావాలి. అందరూ తమవంతుగా సమిధలు వెయ్యాలి. మన చేత అలా చేయించగలిగిన వారే నాయకులు.

మేము నాయకులమనుకునే వారు పలు సార్లు మేనేజర్‌కి, లీడర్ షిప్‌కి మధ్య ఉన్న వ్యత్యాసాన్ని గమనించక రెండూ ఒకటే అనుకుంటారు. ఇది మొదటి తప్పిదం. మేనేజర్ ఒక బాధ్యతను నిర్వర్తించగలగాలి. లీడర్ కొంతమంది సమష్టి కృషికి, ఫలితాలకు, ఉన్నతికి బాధ్యత వహించాలి. ఒక డ్రైవర్ చక్కగా కారు నడిపితే ఆయన తన బాధ్యతను చక్కగా నిర్వర్తిస్తున్నాడన్న మాటే. మరో వ్యక్తి కొంత మంది డ్రైవర్లను కూడగట్టి వారిని మంచి డ్రైవర్లుగా తీర్చిదిద్దటమే కాకుండా వారికో చక్కని భవిష్యత్తును గమ్యంగా మార్చి, ఆ దిశగా వారిని నడిపేవాడు లీడర్. ఉదాహరణకి ఈ డ్రైవర్లందరూ కాలక్రమేణా టాక్సీ ఓనర్లుగా మారొచ్చు. చక్కని జీవితాలు స్వంతం చేసుకోవచ్చు. వీరందరికీ కలలు, గమ్యాలు ఇచ్చి మార్గదర్శకం వహిస్తున్న వాడు వీరి నాయకుడు. అలాగే అన్ని రంగాల్లో అన్ని వృత్తుల్లో... సో మేనేజరు వేరు, లీడరు వేరు. ఇద్దరూ ఒకటేననుకుంటే పొరపాటు పడ్డట్లే.

ఇక రెండో తప్పిదం... లీడర్ తన టీమ్ సభ్యుల నుంచి భక్తి విశ్వాసాలు తమ సంస్థకు, తమ సమష్టి కలలకు, గమ్యాలకు చెందేలా చేయగా, ఇతరులు అవి తమకు చెందాలనుకుంటారు. ఒక టీమ్ ఏదైనా సాధించాలంటే వారి లాయల్టీ వారి సంస్థకు, గమ్యాలకు ఉండాలి తప్పితే, ఆ టీమ్ లీడర్‌కు కాదు గదా. అయితే ఈ రెండింటి మధ్య వ్యత్యాసం చాలామంది గ్రహించలేరు. తమ తమ టీమ్ సభ్యులు తమకే లాయల్‌గా ఉండాలనుకుంటారు. పర్సనల్ లాయల్టీ అన్నమాట. పర్సనల్ లాయల్టీ ఆశించే వారు ఒక బలమైన వ్యవస్థను, టీమును ఎలా సృష్టించగలరో నాకు ఎప్పటికీ అర్థం కాని విషయం!

లీడర్‌షిప్ అంటే సమష్టి కలలకు రూపమిచ్చి, వాటిని సాకారం చేసేవాడని మనం ముందు చెప్పుకున్నాం. అటువంటప్పుడు లాయల్టీ సమష్టి కలలకు ఉండాలి గాని, వాటికి రూపురేఖలిచ్చిన లీడర్‌కి కాదు కదా... ఇది కొంచెం క్లిష్టమైన సమస్యే, కాదనను! కొంచెం లోతుగా ఆలోచిస్తే ఈ రెండింటి మధ్య ఉన్న తేడా మీకర్థమవుతుంది. వ్యక్తిపూజకాదు మనకు కావాల్సింది. సంస్థలకు, వాటి ఆశయాలకు, పద్ధతులకు మనం లాయల్‌గా ఉండాలి.


మూడో తప్పిదం... తామెంతో జగమంతా అనే స్పృహ లేకపోవటం! తనకు స్ఫూర్తి కావాలి, పనులు సక్రమంగా టైములో జరగాలి. మంచి జీవితం కావాలి. గుర్తింపు కావాలి. ఈ విషయాలే ఇతరులకు స్ఫూర్తినిస్తాయనే నిజాన్ని విస్మరిస్తూ ఉంటారు చాలా మంది 'మేము నాయకులం' అనుకునేవాళ్లు. ఇదో భయంకరమైన తప్పు. మనలాగే ఇతరులకూ స్ఫూర్తి కావాలి. మనం ఎలా కొత్త పుంతలు తొక్కుతూ, తప్పులు చేస్తూ వాటిని సవరించుకుంటూ ముందు వెళ్తూ ఉంటామో, అలాగే టీమ్ సభ్యులను కొత్త పుంతలు తొక్కనివ్వాలి... తప్పులు చేయనివ్వాలి. వాటిని సరిదిద్దుకోనివ్వాలి. ఇదే నాయకత్వ లక్షణం. దీన్ని అనుసరించకపోవటం; తనదొక దారి, మరో దారి ఇతరులది అని అనుకోవటం గొప్ప తప్పు. నిత్యం జరుగుతున్న తప్పు. మన సమస్యలన్నిటికీ మూలకారణమిదే.

ప్రేరణ, స్ఫూర్తి అందరికీ కావాలి, మనకొక్కరికే కాదు.

# 15

# లీడర్లూ, మారండి...

'కొన్నిదశాబ్దాల క్రితం ఎవరైనా పొలిటికల్ లీడర్ వస్తున్నాడంటే జనంలో వారిని చూడాలనే తపన ప్రస్ఫుటంగా గోచరించేది. వారంటే గౌరవాభిమానా లుండేవి. వారి రాక కోసం గంటల తరబడి నిరీక్షిస్తుండే వారు. నేడో...'



ఈ మధ్యే ప్రపంచ దేశాల లంచగొండితనంపై రేటింగ్స్‌ను విడుదల చేశారు. రేటింగ్ స్కేలు 0–10. జీరో వస్తే కరప్షన్ బాగా ఉన్నట్లు, పది వస్తే అసలు లేనట్లు. అంటే ఎంత తక్కువ స్కోరు వస్తే అంత ఎక్కువ లంచాలు. ఎంత ఎక్కువ స్కోరు వస్తే అంత తక్కువగా లంచాలు.

స్కోరు చూడకుండా ఒక్క క్షణం కళ్లు మూసుకొని ఊహించండి – మన దేశం ఎంత స్కోరు చేసి ఉంటుందో! మన కన్నా కరప్షన్‌లో కొంచెం దిగువన చైనా, పైన పాకిస్తాన్ ఉన్నాయి. వాటి స్కోరు చైనా–3.5, పాకిస్తాన్–2.3, శ్రీలంక–3.2.

మన స్కోరు–3.3. నూట ఇరవై కోట్ల భారతీయులు తలలు వంచుకోవాల్సిన పరిస్థితి.

అత్యంత కరప్ట్ దేశాలు మయన్మార్, సోమాలియాలు.

అతి తక్కువ కరప్ట్ దేశాలు డెన్మార్క్, సింగపూర్, న్యూజిలాండ్ వగైరాలు, వారి స్కోరు 9.3.

మనదేశం ఏనాటికైనా సింగపూర్ లాంటి దేశాల జాబితాలో చేరేనా?

**మీరు నేటి యువతరానికి చెందినవారైతే విపరీతంగా కలలు గమ్యాలు ఉంటే, దేశాన్ని మారుద్దామనే తపన ఉంటే ఇది జరిగే అవకాశముంటుంది. లేకపోతే మన ఖర్మ ఇంతే. ఈ కరప్షన్ ఊబిలోంచి బయటపడలేము!** మా జనరేషన్ మంచి నుంచి చెడులోకి అడుగుపెట్టిన వాళ్లం. ఇంత భయంకరమైన కరప్షన్ అంటువ్యాధి మేమెన్నడు అనుభవించలేదు. ముప్పై, నలభైయేళ్ల క్రితం మన సంఘం వేరుగా ఉండేది. ఎవ్వరూ తమతమ ఆస్తుల్ని, విలాసవంతమైన జీవన విధానాన్ని రోడ్ల మీదకు తెచ్చి అందరికీ కనిపించేలా అసహ్యంగా బతకలేదు. సంపదను, విలాస వంతమైన జీవితాలను ప్రదర్శిస్తే ఇతరులకు జుగుప్స కలుగుతుందేమోనని కొంచెమైనా బిడియం, భయం ఉండేవి ఆ రోజుల్లో.

నేటి లాగా విచ్చలవిడిగా సంపద ప్రదర్శన జరిగేది కాదు ఆ రోజుల్లో. లంచాలు కూడా ఎంతో తక్కువగా, కొంతమందికి మాత్రమే పరిమితమై ఉండేవి. నేడు లంచాలు తీసుకోనివాడు పాపాత్ముడు. తమ సంపదను నలుగురికీ తెలియపరచకపోవటం ఒక ఘోరమైన తప్పిదం. ధనవంతులున్న బీద భారతావనిలో కూటికి, గుడ్డకి నోచుకోక నానా అవస్థలు పడుతున్న వారు ఈ సంపద ప్రదర్శనకు ఎలా రియాక్టు అవుతారు అన్న ఆలోచనే నేడు ఎవరికీ రాదు. ఎంతలాగా మారిపోయింది మనదేశం!

కొన్నిదశాబ్దాల క్రితం ఎవరైనా పొలిటికల్ లీడర్ వస్తున్నాడంటే జనంలో వారిని చూడాలనే తపన ప్రస్ఫుటంగా గోచరించేది. వారంటే గౌరవాభిమానా లుండేవి. వారి రాక కోసం గంటల తరబడి నిరీక్షిస్తుండేవారు. నేడో... డబ్బులిచ్చి, తిండి పెట్టి, మందు పోయించి తోలుకొస్తున్నారు జనాన్ని. అంతేకాదు రాజకీయ నాయకులన్నా, ప్రభుత్వ ఉద్యోగులన్నా ఎనలేని కోపతాపాలు, జుగుప్స నేడు ప్రజల్లో కొట్టొచ్చినట్లు కనబడుతోంది.

ఈ మధ్య తిరుపతి వెళ్లాం మేము. కదలని క్యూలో, క్షణ క్షణానికి పెరుగుతున్న జన సందోహంలో చిక్కుకుపోయాం. కారణం గురించి తెల్సుకోగా ఎవరో రాజకీయ నాయకులు, గవర్నర్లు లోపల శ్రీవారి ఏకాంత దర్శనం చేసుకొంటున్నారట! బైట క్యూలో ఉన్న జనం తిట్టిన తిట్టు తిట్టకుండా దుమ్మెత్తి పోస్తున్నారు వీరి మీద. ఇటువంటి దృశ్యం మునుపెన్నడూ నేను చూడలేదు. నాడు ఇలాంటి సందర్భాల్లో పట్టించుకోకుండా ఉండిపోయేవాళ్లం, నేడు జనం విషంకక్కుతున్నారు.

పేపర్లో చదివినట్టు గుర్తు... ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి స్వామి వారి పూజ చేస్తూ ఇతర భక్తులను గంటల తరబడి నిరీక్షణకు గురి చేస్తే ఆ మహాశయుడు వెలుపలికి వస్తున్నప్పుడు, వేచి ఉన్న ఆ భక్తులు నేరుగా ముఖం మీదే అడిగారట: "మీ గొప్పతనం ఏమిటి? మీ కోసం మేమెందుకు వెయిట్ చేయాలని...?"

ఎంత మార్పు!! దీన్ని మన పాలకులు గమనిస్తున్నారా? గ్రహిస్తున్నారా?

శోభా డే ఇంగ్లీష్ రచయిత. కాలమ్స్. పుస్తకాలు రాస్తారు విరివిగా. ఈ మధ్య ఆమె కాలమ్‌లో రాశారు– 'పాలక వర్గం మీద (ముఖ్యంగా రాజకీయాల్లో ఉన్నవారిపై) ప్రజల ఆగ్రహం, అసహనం అంబరాన్ని తాకుతున్నాయి నేడు. విస్ఫోటనానికి రెడీగా ఉన్న బాంబుల్లా ఉన్నారు దేశ ప్రజలు. అసహనం, అశాంతి, పాలక వర్గం అంటే అసహ్యం మునుపెన్నడు లేనంతగా ఉన్నాయి. ఏ చిన్న సంఘటనైనా ఒక భయంకర విస్ఫోటనానికి దారి తీయవచ్చు. ఉదాహరణగా ఇటీవల ఢిల్లీ బాంబు బ్లాస్టుకు గురైన వారిని పరామర్శించేందుకు వెళ్లిన పలువురి రాజకీయ నాయకులు ప్రజల నుంచి ఛీత్కారాలను ఎదుర్కొనవలసి వచ్చింది...'

దేశంలోని రాజకీయ నాయకులు, ప్రభుత్వ ఉద్యోగులు, లంచగొండులుగా మారుతున్నవారు ఈ ప్రజాభిప్రాయాన్ని గమనిస్తున్నారా? ఎంతో క్లియర్‌గా, తాటికాయంత అక్షరాల్లో దేశంలోని అన్ని గోడల మీద రాయబడిన సందేశమిది: 'మారండి... మాకు మార్పు కావాలి... లేకుంటే జరగబోయే పరిణామాలకు మేము బాధ్యులం కాదు' అని.

ఆఫ్రికాలోని పలు దేశాల్లో ఇటీవల చోటుచేసుకున్న మార్పులను మనందరం గమనించాం కదా. ఓర్పు, సహనం క్షణ క్షణానికి సన్నగిల్లిపోతున్నాయి ప్రజల్లో,

ప్రపంచమంతా! 'ఎనఫ్ ఈజ్ ఎనఫ్' అంటున్నారు ప్రజలు. ఈ అరాచకాన్ని, బంధుప్రీతిని, లంచగొండితనాన్ని ఆపమంటున్నారు ప్రజలు అన్ని దేశాల్లో.

రాజకీయ నాయకులు... ముఖ్యంగా మన రాజకీయ నాయకులు ఇవేమీ గమనిస్తున్నట్లు కనబడదు మనకు. అవే టెర్రరిస్టు దాడులు. అవే సమాధానాలు! రోజూ కరప్షన్ కథనాలు స్కామ్స్! కమిటీని వేసి ఎంక్వైరీ చేస్తామనే అవే స్టాండర్డ్ సమాధానాలు!

**మనం మారేమా? మన దేశం బాగుపడేనా... నేటి యువత కావాలనుకుంటే తప్పక మారుతుంది మనదేశం. ఎప్పుడు? కొత్త లీడర్లు యువతలోంచి పుట్టుకొచ్చినప్పుడు.**

లీడర్ అంటే ఎవరు? వీళ్లు పుట్టుకతోనే లీడర్లవుతారా? లేక లీడర్లుగా ఎదుగుతారా?

చాలా మంది నేటి రాజకీయ నాయకులు అనుకుంటున్నట్లుగా, తమకి తమ కుటుంబానికి మంచి చేసుకోవటం, దేశాన్ని దోచి వారిని కుబేరులుగా మార్చుకోవటం నాయకత్వమనిపించుకోదు. నాయకత్వం అంటే... పది మందికి మార్గదర్శకుడై వారిని ఒక తాటిపైకి తెచ్చి వారి మంచికై శ్రమించే వాడు నాయకుడు.

స్వలాభం కోసం ఎవరి పని వారు చేసుకుపోయేవారు నాయకులు కాదు. వారు వర్కర్లు. వారి పని వారు చేసుకుంటూపోతున్నారు స్వలాభం కోసం. నాయకుడితోపాటు మరికొందరుంటారు. వారందరికి సమష్టిగా కలలు గమ్యాలు ఉంటాయి. వాటి సాకారం కోసం అందరూ కృషి చేస్తారు. అందరూ లాభం పొందుతారు. వీరికి మార్గదర్శకత్వం అందించేవాడు నాయకుడు.

ఇక నాయకత్వ లక్షణాలు పుట్టుకతో అబ్బుతాయా లేక వాటిని నేర్చుకొని అమలు చేయవచ్చా అనే విషయానికొస్తే పలు అభిప్రాయాలు వ్యక్తమౌతాయి. ముఖ్యంగా ఆరేడు రకాల నాయకత్వ లక్షణాల గురించి చర్చ జరుగుతూ ఉంటుంది. క్లుప్తంగా ముచ్చటించు కుందాం వాటి గురించి. ఎందుకంటే నేటి యువతకి ఈ విషయం మీద అవగాహన కలిగి, వారు నాయకత్వ లక్షణాలు పెంపొందించుకొని, నిర్దిష్ట గమ్యాలతో ముందుకు వెళ్తే, నేడు మనం దేశంలో పోరాడుతున్న పలు

సమస్యలకి పరిష్కారాలు లభించవచ్చు. అధికార దాహం, ధనార్జనే గమ్యం కల వృద్ధ నాయకులు, వారు దశాబ్దాలుగా నమ్ముతూ ఆచరిస్తున్న కార్యక్రమాలు ఆపి సద్బుద్ధితో దేశ కళ్యాణానికి పాటు పడతారనుకోవటం అత్యాశే.

కనుక యువత ముందంజ వేసి తాము నమ్మే సిద్ధాంతాలను పదుగురికి నప్పేలా చేసి మార్గదర్శకులయితే మార్పు జరుగుతుంది. మంచి నాయకత్వమే కీలకం ఈ మార్పుకి. యథా రాజా తథా ప్రజ అన్నట్లు... నాయకుడు సత్ప్రవర్తన కలవాడైతే అతని చుట్టూరా ఉన్నవారు అలాగే సత్ప్రవర్తన కలవారుగా మారుతారు.


నాయకులు నాయకత్వ లక్షణాలు పలు విధాలని చెప్పుకొన్నాం కదా. మొదటగా చెరిస్మాటిక్ లీడర్‌షిప్. అంటే వ్యక్తిగత ఆకర్షణతో కూడిన నాయకత్వ మన్నమాట. ఈ నాయకుల మాటలు, వాగ్ధోరణి, వాక్చాతుర్యం, నలుగురిని సంప్రదించి కలుపుకు పోయే లక్షణాలు వారిని నాయకులుగా నిలబెడతాయి.

మదర్ థెరిసా, విన్‌స్టన్ చర్చిల్, బిల్ క్లింటన్, హిట్లర్ ఈ వర్గానికి చెందిన నాయకులు.

# 16

# లీడర్‌షిప్ రకాలు

'మరో తరగతి నాయకత్వ లక్షణం పార్టిసిపేటివ్ లీడర్‌షిప్. అంటే వీరు నియంతలుకారు. ఆకర్షణ వీరి అస్త్రం కాదు. తమ అనుచరులతో మమేకమై ఒక భాగస్వామిలాగా, తమ టీమ్‌కు మార్గదర్శకులవుతారు. కార్పొరేట్ సంస్థల్లో ఇటువంటి నాయకత్వం కనబడుతూ ఉంటుంది.'



పలు రకాల నాయకులుంటారని వారిలో ఒకరుగా చెరిస్మాటిక్ లీడర్ షిప్ గురించి చర్చ మొదలుబెట్టాం. మహాత్మాగాంధీ, మదర్ థెరీసా, విన్‌స్టన్ చర్చిల్, బిల్ క్లింటన్, హిట్లర్ వగైరాలు ఈ తరహాకి చెందిన నాయకులు. మరికొందరు శ్రీమతి ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ, నరేంద్ర మోడి, రాజశేఖర రెడ్డి, జాన్ కెన్నడి... ఇత్యాదులు.

చెరిస్మాటిక్ లీడర్ షిప్‌ను వ్యక్తిగత ఆకర్షణతో కూడిన నాయకత్వ లక్షణం అనుకున్నాం. వ్యక్తిగత ఆకర్షణ చాలా మందికి ఉంటుంది. మన దేశంలో అయితే ముఖ్యంగా సినిమా స్టార్‌లకి, క్రికెట్ ఆటగాళ్లకు. అయితే వీళ్లను నాయకులన లేము. ఎందుకంటే నాయకునికి, నాయకత్వానికి అవసరమైన అనుచరులు, సమష్టి

గమ్యాలు, సమష్టి ప్రయోజనాలు ఇటువంటి వారిలో ఉండవు కనుక. సొంత ఆకర్షణలతో, విజయాలతో వీరు చెరిస్మాటిక్ పర్సనాలిటీస్‌గా మారుతారు.

చెరిస్మాటిక్ పర్సనాలిటీస్ వేరు, చెరిస్మాటిక్ లీడర్స్ వేరు.

మన ముచ్చట్లు చెరిస్మాటిక్ లీడర్ల గురించి.

హిట్లర్ జీవిత చరిత్ర గమనిస్తే ఇటువంటి నాయకులకు ప్రజల మీద, ముఖ్యంగా తమ అనుచరుల మీద ఉన్న ప్రభావం ఇట్టే తెలిసిపోతుంది. హిట్లర్ నియంత. జర్మనీకి ఎంతో అప్రతిష్ఠ తెచ్చినవాడు. అయినా సరే ఆయన నాయకత్వ ఆకర్షణలో పడి, ఆనాటి జర్మనీ దేశస్థులు ఆయన వెంట నడిచారు. నానా కష్టాలపాలయ్యారు. చెరిస్మాటిక్ లీడర్స్‌కి ఉన్న ఆకర్షణ, శక్తి అలాంటివి మరి. అనుచరులకు వారి మీద ఉన్న గురి, భక్తి చెప్పనలవిగానివి.

ఇక మరో తరగతి నాయకత్వ లక్షణం **పార్టిసిపేటివ్ లీడర్‌షిప్.** అంటే వీరు నియంతలుకారు, ఆకర్షణ వీరి అస్త్రం కాదు. తమ అనుచరులతో మమేకమై ఒక భాగస్వామిలాగా, తమ టీమ్‌కు మార్గదర్శకులవుతారు. కార్పొరేట్ సంస్థల్లో ఇటువంటి నాయకత్వం కనబడుతూ ఉంటుంది.

సాధారణంగా పెద్ద పెద్ద కార్పొరేషన్స్‌లో, ముఖ్యంగా బహుళ జాతి సంస్థల్లో చాలామంది సీనియర్స్ కలిసి పనిచేస్తుంటారు. ఏ ఒక్క నాయకుడో ఈ పని ఫలానా విధంగానే చేయాలని తన సహచరులకి చెప్పే అవకాశముండదు. ఎందుకంటే మిగతా వారు కూడా నాయకుడి లాగే చదువు సంస్కారం, అనుభవం, పేరు ప్రతిష్ఠ కలవారు.

ఇటువంటి సందర్భాల్లో టీమ్‌ను ఒక తాటిపైకి తేవాలంటే, ఎంతో అనుభవం, వివేకం, నలుగురిని కూడగట్టుకొని వెళ్లగలిగే చాతుర్యం ఉండాలి.

నేను నాలుగు దశాబ్దాలుగా పనిచేస్తున్న మార్కెటింగ్ రంగంలోని సభ్యులు రకరకాల ప్రజ్ఞాపాటవాలు కలిగి ఉంటారు.

ఒకరు రైటరు కాగా, మరొకరు ఆర్ట్ డైరెక్టరు, ఇంకొకరు మార్కెటింగ్‌లో నిష్ణాతులు.

వీరే కాక ఫిల్మ్ మేకింగ్‌లో, ఫోటోగ్రఫీలో... ఇలా పలు రంగాల్లో నిష్ణాతులైన వారు ఒక టీములో సభ్యులై కలసిమెలసి పనిచేస్తుంటారు.

లీడర్ అందరినీ ఒక అభిప్రాయంలోకి తెచ్చి, అందరికీ పేరు ప్రతిష్ఠలు కలిగేలా చేయటం ఒక ముఖ్యావసరం.

ఏదైనా ఒక మంచి టీవీ ప్రకటనగాని, ప్రింట్ యాడ్‌గాని చేయాలంటే పైన పేర్కొన్నట్లుగా పలు నిష్ణాతులు కూడితేనే గాని ఆ పని జరగదు. వారందరినీ ఉత్తేజపరిచి కార్యోన్ముఖులని చేసి వారిలోని ప్రతిభను వెలికి తీయటమే పార్టిసిపేటివ్ లీడర్ గమ్యం.

ఐటి రంగంలో తదితర సర్వీస్ సెక్టార్ రంగాల్లో వీరి అవసరం ఎంతో ఉంటుంది. ఈ పార్టిసిపేటివ్ లీడర్‌షిప్‌లో విజయాలను సొంతం చేసుకొని, అపజయాలను ఇతరులకు అంటగట్టే తత్వం ఉన్నవారు అసలు రాణించలేరు.

ఈ నాయకుడు అమెరికన్ లీడర్‌షిప్ అనుసరించే 'ఫస్ట్ ఎమాంగ్ ఈక్వల్స్' విధానాన్ని ఆకళింపుచేసుకొని అవలంబించటం ఎంతో ముఖ్యం.

ఎవరి పని వారిని చేసుకోనిస్తూ, వారిని ఎవరో బలవంతంగా ముందుకు లాక్కెళ్తున్నారనే భావన కలగనీయకుండా, సున్నితంగా, తాను అగుపించీ అగుపించకుండా మార్గాన్ని చూపేవాడే ఈ కోవకి చెందిన నాయకుడు.

ఫస్ట్ ఎమాంగ్ ఈక్వల్స్ అనే లీడర్‌షిప్ ఫిలాసఫీ అమెరికాలో ఎంతో ప్రాచుర్యం పొందింది. సమఉజ్జీలుగా ఉన్న టీములో ముందు నిల్చున్న వాడు ఈ నాయకుడు. ఇక్కడ స్పూన్ ఫీడింగ్, అంటే చిన్న పిల్లలను బుజ్జగించి ఎలాగా తల్లి ఆహారం తినిపిస్తుందో, అలాంటి బుజ్జగింపు, లాలన ఉండవు. టీములో సభ్యులు అందరూ తమ తమ రంగాల్లో నిష్ణాతులు. ఎవరి బాధ్యత వారికి అప్పగించ బడుతుంది. వాటిని సక్రమంగా నిర్వహిస్తూ టీమ్‌కు సంబంధించిన సమష్టి గమ్యాల వైపు, ప్రయోజనాల వైపు దూసుకెళ్లేలా చేయగలిగిన వాడే ఈ కోవకి చెందిన లీడరు.

నేర్పుతోపాటు ఓర్పు, పట్టుదల ఎంతో అవసరం ఈ తరహానాయకులకు. ఎందుకంటే నిష్ణాతులైన టీమ్ సభ్యులు వివిధ మనస్తత్వాలు, అభిరుచులు, అభిప్రాయాలు కలవారై ఉంటారు.

నిజానికి ప్రతి వ్యక్తి ఒక దీవి లాంటి వాడు. 'ఎవ్రీవన్ ఈజ్ లైక్ ఏన్ ఐలాండ్'. రూపం నుంచి వ్యక్తిత్వం దాకా ప్రతివారు ఒక ప్రత్యేకమైన వ్యక్తి. ఒకరిని పోలిన వారు మరొకరు ఈ సృష్టిలో ఎక్కడా ఉండరు అనేది ముమ్మాటికీ నిజం.

మనందరం తలా ఒక ద్వీపం లాంటి వారం. ఇటువంటి పలు వ్యక్తుల్ని ఒక గమ్యం వైపుగా సమష్టిగా అందరి మంచికి కృషి చేయించటం నాయకులకు ఎంత కష్టమో ఒక్కసారి ఆలోచించండి.

ఒక గ్రామంలో ఒక తల్లి కొడుకు నివసిస్తున్నారు. చదువు సంస్కారం, వివేకం గలది తల్లి. దానధర్మాలను ఆచరిస్తూ నలుగురితో కలిసిమెలిసి పోయే గుణం ఆమెది. ఆమెకు పూర్తిగా వ్యతిరేక మనస్తత్వం కలవాడు కొడుకు.

తల్లి పేరు గంగ. కొడుకు మోహన్. పదేళ్ల బాలుడు. మోహన్‌కి ఈ ప్రపంచం, ప్రపంచంలోని అన్ని వస్తువులు ఎంతో సుందరంగా తన సొంతం చేసుకోవాల్సినవిగా కనబడేవి. వేటినీ ఇతరులతో పంచుకోవటంగాని, ఇరుగు పొరుగు పిల్లలతో కలసి ఆడుకోవటం గాని చేసేవాడు కాదు.

స్వార్థపరుడిగా మారిపోయాడు.

ఒంటరైపోయాడు.

తన కొడుకు నడవడి గంగకి నచ్చేది కాదు. ఒక పక్కన తనకేమో వయసు మీద పడుతోంది. మరోవైపు మోహన్ ఏకాకిగా మారిపోతున్నాడు. ఎన్నోసార్లు చెప్పి చూచింది కొడుక్కి నలుగురితో కలసిమెలసి ఉండటం సమాజంలో అందరికీ ఎంతో అవసరమని, తద్వారా అందరూ సుఖంగా ఉంటారని. ఈ మాటలు మోహన్‌కి నచ్చేవి కాదు, నమ్మేవాడు కాదు.

ఎలాగైనా మంచి విలువలు, మంచి నడవడి మోహన్‌కి నేర్పాలనే తపన గంగలో బలంగా నాటుకుపోయింది.

పాఠాల ద్వారా, మాటల ద్వారా తన కొడుకు మారడని తెలుసు గంగకి.

ఏదైనా చూస్తే గాని, చూసి దాన్ని నమ్మితే గాని నేర్చుకోడు మోహన్. 'సీయింగ్ ఈజ్ బిలీవింగ్' అంటారు కదా పెద్దలు. చూస్తేనే కదా నమ్మకం. అటువంటి అనుభవాన్నిచ్చే ఒక యాత్రని తలబెట్టింది గంగ.

ఒకరోజు తెల్లవారక ముందే తను రెడీ అయి కొడుకుని లేపింది గంగ.

ఎక్కడికైనా వెళ్తున్నామా అన్నాడు మోహన్.

అవును నీ స్నేహితుడిని కల్సుకోవటానికి వెళ్తున్నామన్నది తల్లి.

స్నేహితుడా? నాకెవ్వరూ స్నేహితులు లేరుగా అన్నాడు మోహన్.

లేదు మోహన్ నీకో చిన్ననాటి మంచి స్నేహితుడున్నాడు. వాడిని నీకు పరిచయం చేస్తాను పద అంది గంగ.

గబగబా రెడీ అయ్యాడు మోహన్.

ఇద్దరూ బయల్దేరారు.

ఎంతో దూరం ప్రయాణం చేశారు. నిమిషనిమిషానికి మోహన్‌కి ఆత్రుత పెరుగుతోంది. ఎవరీ స్నేహితుడు అని తల్లిని ఎన్నోసార్లు అడిగాడు. అన్నిటికీ తొందరేనా, కొంచెం ఓపికపట్టాలి అంది తల్లి. ఓపిక, ఓర్పు గురించి తెలీదు మోహన్‌కి.

ఓర్పు అంటే ఏమిటని అడిగాడు తల్లిని.

ఓర్పు అంటే దేనికోసమైనా శాంతంగా నిరీక్షించటమన్నమాట. ఈ గుణం మానవ జీవితంలో ఎంతో విలువైనది. అతి ముఖ్యమైనది. నీకే కనుక ఓర్పు, పట్టుదల ఉంటే ఎటువంటి గమ్యాన్నైనా చేరుకోగలవు. ఏమైనా సాధించగలవు అంది తల్లి.

పట్టుదల అంటే ఏమిటన్నాడు కొడుకు.

పట్టుదల అంటే ఎన్ని కష్టాలెదు రొచ్చినా మనఃపూర్వకంగా కృషి చేస్తూ, గమ్యాలను వీడకుండటం అంది తల్లి.

ఆ మాటలంటూ ఎంతో ప్రేమగా కొడుకు వీపును నిమిరింది.

మళ్లీ తల్లే అంది "ఇన్ని గంటల సేపు నన్ను విసిగించకుండా ఓర్పుతో, పట్టుదలతో నా వెంట నడిచి వచ్చావు కదా! అందువల్ల నీకు ఓర్పు పట్టుదలా ఉన్నట్లే".

ఎలాగా అన్నాడు కొడుకు.

నీ స్నేహితుణ్ణి కలుసుకోవాలని వేచి ఉన్నావు, అది నీలోని ఓర్పుకి నిదర్శనం. కొన్ని గంటల తరబడి, కష్టపడి, నాతో నడుస్తూ వస్తున్నావు – అది నీ పట్టుదలకి, ఓర్పుకి నిదర్శనం.

మోహన్‌కి ఓర్పు, పట్టుదల గురించి కొంచెం అవగాహన మొదలైంది. మరికొన్ని గంటలు గడిచాక ఒక చిన్న పర్వతం దాన్ని ఎక్కి శిఖరాగ్రం చేరుకొన్నారు.

కిందకి చూస్తే అద్భుతమైన సుందర ప్రకృతి దృశ్యాలు ఇద్దర్నీ సమ్మోహితుల్ని చేసినాయి.

ఇక్కడే నీ ఫ్రెండ్‌ని కలుసుకోబోతున్నావు అంది కొడుకుతో, వీపు మరోసారి ప్రేమగా నిమిరి.

నలువైపులా చూచాడు మోహన్. ఎవ్వరూ కనబడలేదు. గొంతెత్తి పిలవమంది తన స్నేహితుణ్ణి తల్లి.

నేస్తమా ఎక్కడున్నావు అని ఎలుగెత్తి పిలిచాడు.

మళ్లీ పిలిచాడు.

నీ కోసం ఎంతో ఆత్రుతగా ఎదురు చూస్తున్నాను వచ్చేయి మిత్రమా అంటూ పదే పదే గొంతెత్తి పిలిచాడు.

ఎన్నిసార్లు పిలిచినా పలకవు. రావు. నీవో పిరికిపందలా ఉన్నావు. త్వరగా వచ్చేయి నేస్తమా! అని మళ్లీ మళ్లీ పిలుస్తూనే ఉన్నాడు.

విసుగుపుట్టి, ఓ మిత్రమా! అని గావుకేక పెట్టాడు.

ఓ మిత్రమా అన్న పలుకులు ప్రతిధ్వనించాయి నలువైపుల నుంచి.

తల్లివైపు ఆశ్చర్యంగా చూచాడు ఇక్కడ ఏం జరుగుతుందన్నట్లు.

నీ స్నేహితుడు అలిగాడేమో, బుజ్జగించరాదా అంది తల్లి.

ఓ మిత్రమా నువ్వంటే ప్రాణం నాకు. నువ్వో ఆణిముత్యానివి అని అరిచాడు మోహన్. అవే మాటలు నలుదిశల నుంచి ప్రతిధ్వనించాయి.

ఓ మిత్రమా నువ్వంటే ప్రాణం నాకు నువ్వో ఆణిముత్యానివి.

తన మిత్రుడే తనను సంబోధించి ఈ మాటలంటున్నాడేమో ననిపించింది మోహన్‌కి.

తల్లిని అడిగాడు మోహన్ నా మిత్రుడు ఎక్కడ? కనబడడేం అని.

నీ స్నేహితుణ్ణి కలుసుకున్నావు కదా అంది గంగ.

ఎక్కడ? ఎప్పుడు?

"మన భావాలకు, మన వ్యక్తిత్వాలకు ప్రతిరూపమే మన జీవితాలు. మనం ఏమిస్తే అదే తిరిగిస్తుంది జీవితం. మంచికి మంచి, చెడుకి చెడు ప్రతిరూపాలు. నీ స్నేహితుణ్ణి పిరికిపంద అని పిలిస్తే అదే మాట తిరిగి వినబడింది నీకు. అలాగే నువ్వో ఆణిముత్యం అంటే అవే మాటలు తిరిగి వినబడ్డాయి నీకు. దీన్ని ప్రతిధ్వని అంటాం. జీవితం కేవలం ఒక ప్రతిధ్వని మాత్రమే. మనం దానికేమిస్తే దాన్నే తిరిగి ఇస్తుంది. ఇతరులు నిన్ను విడిచిపోయినా, జీవిత మంతా ఈ ప్రతిధ్వని నీతోనే నిలిచి ఉంటుంది..." అంది గద్గదమైన గొంతుతో గంగ.


తల్లి పాదాలను కళ్లకద్దుకొన్నాడు మోహన్.

ఈ ప్రతిధ్వని రహస్యం బాగా ఆకళింపు చేసుకొన్నవారు పార్టిసిపేటిక్ లీడర్స్. తామెంతో జగమంతా అనే నానుడిని నమ్మి ఆచరించేవారే ఈ నాయకులు.

# 17

# సిట్యుయేషనల్ లీడర్

'ఊసరవెల్లిలా పరిస్థితులకనుగుణంగా, సమయాను కూలంగా మారుతూ వ్యవస్థని, టీమ్ సభ్యులని ముందుకు నడిపించే వాడే ఈ సిట్యుయేషనల్ లీడర్. పరిస్థితులు, వ్యక్తులు విధించే హద్దుల్లో వ్యవహరించటం ఎంతో అవసరం ఈ నాయకులకు.'



మన లీడర్‌షిప్ చర్చలో భాగంగా చెరిస్మాటిక్ లీడర్స్ గురించి, పార్టిసిపేటివ్ లీడర్స్ గురించి ఇంతవరకు చర్చించుకున్నాం. పదండి ముందుకి... సిట్యుయేషనల్ లీడర్‌షిప్ దిశగా. సమయానుకూలంగా వ్యవహరిస్తూ మార్గదర్శకుడయ్యే వాడు సిట్యుయేషనల్ లీడర్.

పరిస్థితుల ప్రభావంగా, అనుకోని సంఘటనలు జరగటం వల్ల కొంత మంది క్షణాల్లో నాయకులుగా మారిపోతారు. రాజకీయాల్లో, వ్యాపార సంస్థల్లో, ప్రభుత్వ కార్యాలయాల్లో, కుటుంబాలలో ప్రతి చోటా తరచు మనం చూస్తూనే ఉంటాం. సడన్‌గా మార్పులు సంభవిస్తాయి.... ఫలితంగా కొత్త లీడర్ రంగం పైకి వస్తాడు. ఊసరవెల్లిలా పరిస్థితులకనుగుణంగా, సమయానుకూలంగా మారుతూ వ్యవస్థని, టీమ్ సభ్యులని ముందుకు నడిపించే వాడే ఈ సిట్యుయేషనల్ లీడర్.

పరిస్థితులు, వ్యక్తులు విధించే హద్దుల్లో వ్యవహరించటం ఎంతో అవసరం ఈ నాయకులకు. టీములోని వ్యక్తులు నాయకుడు ఎంచుకొన్న వారు కాదు. ఉదాహరణకి ముద్రా వ్యవస్థాపకుడుగా సంస్థలోని పలువురు సభ్యులను నేను స్వయంగా ఎంచుకొన్నాను. నా తర్వాత ముద్రాకు నాయకత్వం వహించిన వ్యక్తికి చాలా అంశాలు, టీము సభ్యులతో సహా సంస్థతో పాటు సంక్రమించాయి.

మరో ఉదాహరణ: సడన్‌గా స్వర్గస్థులైన మన రాజశేఖర రెడ్డి గారి తర్వాత ముఖ్యమంత్రి పదవినలంకరించిన రోశయ్య గారికి మంత్రి వర్గంతో సహా, ఎన్నో పరిస్థితులు సంక్రమించినాయి. వారు ఎన్నుకొన్నవి కావు ఇవేవి... పరిస్థితుల ప్రభావం ద్వారా సంక్రమించినవి. ఈ పరిస్థితుల్లో ఇలాంటి నాయకులకు తమకు సంక్రమించిన టీమ్ మెంబర్లను, పరిస్థితులనూ క్షుణ్ణంగా ఆకళింపు చేసుకొని, తమ ధర్మాన్ని, బాధ్యతలని నిర్వహించటం ఎంతో ముఖ్యం.

పరిస్థితులకనుకూలంగా మారుతూనే, తనదైన ముద్రవేసే వాడే నిజమైన సిట్యుయేషనల్ లీడర్.

అమెరికన్ ప్రెసిడెంట్ ఐసెన్ హోవర్‌ని ప్రస్తావిస్తూ ఉంటారు సిట్యుయేషనల్ లీడర్‌షిప్ గురించి ప్రస్తావనకు వచ్చినప్పుడు. సోవియెట్ యూనియన్‌కి, అమెరికాకు మధ్య కోల్డ్ వార్ పరాకాష్ఠకు చేరుకొన్న రోజులవి. అణు బాంబుల ఉత్పత్తిలో రెండు దేశాల మధ్య పరుగు పందెం నడుస్తున్న కాలమది. అప్పట్లో అమెరికా అణుశక్తి ఎన్నో రెట్లు అధికంగా ఉన్నప్పటికీ, తమకున్న అణు బాంబులన్నీ ఉపయోగిస్తే సోవియెట్ యూనియన్‌కి జరగబోయే నష్టంకన్నా పర్యావరణంలోని మార్పుల వల్ల తమ దేశానికి జరగబోయే ప్రమాదమే ఎక్కువని గ్రహించాడాయన. పరిస్థితుల అవగాహన, వాటికనుగుణంగా వ్యూహ రచన చేయటం ఆయనకున్న ముఖ్య నైపుణ్యంగా చెబుతారు చరిత్రకారులు.

పరిస్థితుల ప్రాబల్యం, తన సొంత బలాబలాలు, తనకు సంక్రమించిన టీము సభ్యుల బలాబలాలు, ఇష్టాలు, అయిష్టాలు... ఇలా అన్ని వైవిధ్యాలను అధ్యయనం చేసి టీము సభ్యులకి గమ్యాలను, ప్రేరణను కల్పించి దరి చేర్చగల సమర్థులే సిట్యుయేషనల్ లీడర్స్.

ఒక చిన్న కాశీ మజిలీ కథ చెప్తాను వినండి... అనగనగా ఎప్పుడో ఒకప్పుడు ఒక వ్యాపారి ఉండేవాడు. దేశ దేశాలు తిరుగుతూ వ్యాపారం చేస్తుండేవాడు. ఒక రోజున ఒక కొత్త రాజ్యం చేరుకొన్నాడు. అక్కడ చూస్తున్నది నమ్మలేక పోతున్నాడు. నిజమా కలా అనుకొని కళ్లునులుముకొని మరోసారి నలువైపులా పరికించాడు. అన్నీ తెల్లటి తెలుపులో మెరిసిపోతున్నాయి... చెట్లు, పూలు, భవనాలు, రోడ్లు... ఒకటేమిటి అన్నీ తెల్లగానే ఉన్నాయి ఆ రాజ్యంలో. ఇదేమి వింతరా అనుకుంటూ ఉండగా రోడ్డు వెంబడి పోతున్న ఒక కుర్రవాడు కనిపించాడు. అతణ్ణి ఆపి "ఎందుకు ఇక్కడ అన్నీ తెల్లగా ఉన్నాయి" అన్నాడు. "మరెట్లా ఉండా"లన్నాడు ఆ బాలుడు. "ఎరుపు, పసుపు, ఆకుపచ్చ... ఈ రంగులన్ని ఎక్కడ మాయమైనాయి" అన్నాడు వ్యాపారి. "ఎరుపు, పసుపు, ఆకుపచ్చ... అంటే ఏమి"టని ఆశ్చర్యపోయాడు బాలుడు. ఇంతలో ఓ మధ్య వయస్కుడు దారిన పోతూ కనబడ్డాడు. ఆయన దగ్గరకెళ్లి "ఏమిటీ తెల్లవింత" అని అడిగాడు.

"ఇతర దేశాల్లోలాగా మా దేశంలో కూడా ఒకప్పుడు హరివిల్లులాంటి సప్తవర్ణాలు ఉండేవి. మా రాజ్యంలో ఉన్న గంధర్వ రాణికి ఒకరోజున కోపమొచ్చి శపించి వెళ్లిపోయింది. శాప ఫలితంగా అన్ని రంగులు తెల్లగా మారిపోయినాయి". "కోపం దేనికొచ్చింది" అడిగాడు వ్యాపారి. "గంధర్వ రాణి శరీరం, వస్త్రాలు అందంగా పలు రంగుల్లో ఉన్నప్పటికీ ఆమె ముఖం మాత్రం మంచులాగా తెల్లగా కళావిహీనంగా ఉండేది. కొంతమంది క్రూరులు ఆమె ముఖాన్ని రూపాన్ని ఆట పట్టించారు. కోపమొచ్చి మీ దేశమంతా తెల్లగా మంచులాగా మారిపోతుంది అని శపించి వెళ్లిపోయింది ఆ గంధర్వరాణి. అప్పట్నుంచి మేమిలా కళావిహీనంగా ఉన్నాం" అన్నాడు ఆ మధ్య వయస్కుడు.

వ్యాపారి తనతో ఎన్నో రంగు రంగుల వస్తువులు, వస్త్రాలు తెచ్చాడు ఆ రాజ్యంలో అమ్మి లాభాలు పొందుదామని. అయితే అనుకోని ఈ సమస్య వచ్చిపడింది. ఈ కథ ఎందుకు చెబుతున్నానంటే సిట్యుయేషనల్ లీడర్స్‌కి ఇలాంటి అనూహ్యమైన సంఘటనలు, వ్యక్తులు పరిచయమవుతారు. వాటిని జయించి అందరి మేలే తన మేలని నిరూపించగలిగే వాడే అసలు సిసలైన నాయకుడు.

మనం కథలోకి తిరిగి వెళ్తే, వ్యాపారి అడిగాడు. "మరి ఈ సమస్యకు పరిష్కారం లేదా? శాపవిముక్తికి మార్గమే లేదా?" అని. "ఉంది. మా గంధర్వ రాణి శాంతిస్తే శాప విముక్తి అవుతుంది." "గంధర్వ రాణి ఎక్కడుందో చెప్పు" మన్నాడు వ్యాపారి. "తెలీదు కాని నాకు తెలిసిన ఒక మాంత్రికుడున్నాడు. ఆయన ఇట్టే తెలుసుకోగలడు గంధర్వ రాణి జాడ గురించి" అని, ఆ మాంత్రికుడిస్థావరాన్ని చేరుకొనే గుర్తులు చెప్పాడు. హుటాహుటిన మాంత్రికుని స్థావరం చేరుకొని గంధర్వ రాణి ఎక్కడుందో చెప్పమన్నాడు. మనస్సు లగ్నం చేసి తనకున్న శక్తులతో ఆమె జాడ తెలుసుకుని, అన్నాడు మాంత్రికుడు : "ఉత్తర దిశగా వెళ్లు... లేత నీలి రంగు పర్వతాలు కనబడ్తాయి. అక్కడే నివసిస్తుంది గంధర్వ రాణి. అయితే ఆమె ఇంకా ఎంతో కోపంగా ఉంది. అందుకని నీతో మాట్లాడదు" అన్నాడు మాంత్రికుడు. "మరి ఎలా" అని అడిగాడు వ్యాపారి. "నీవే ఆమెను ప్రసన్నురాలిని చేసుకోవాలి". "ఎలాగో చెప్పండి మహాశయా" అన్నాడు వ్యాపారి. "ప్రపంచంలో కెల్లా అత్యంత మధురమైన పదార్థాన్ని ఆమెకివ్వు... ఆమె సంతసించి తన కోపాన్ని విడ నాడుతుంది" అన్నాడు మాంత్రికుడు.

మళ్లీ మాంత్రికుడే అన్నాడు "ఇక్కడకు కొంచెం దూరంలో ఒక అడవి ఉంది. అడవి మధ్యలో ఒక పెద్ద చెట్టు. ఆ చెట్టుపైన గంధర్వరాణికి ఇష్టమైన అతి మధురమైన పదార్థముంది. అయితే వచ్చిన చిక్కల్లా అడవి అంతా భయంకరమైన మృగాలతో నిండి ఉంది. నువ్వక్కడికి చేరుకోవటం చాలా కష్టం". మన వ్యాపారి పట్టుదల, దీక్ష, ఓర్పు కలవాడు. అడ్డంకులెన్ని వచ్చినా, విపరీతాలు ఎన్ని ఎదురైనా గమ్యాన్ని వీడనివాడు.

మాంత్రికుడికి ధన్యవాదాలు చెప్పి అడవిలోకి ప్రవేశించాడు. ఎన్నో కష్టాల నెదుర్కొని చివరకు అడవి మధ్యలోని చెట్టును చేరుకొన్నాడు. చెట్టు అంచున ప్రపంచంలో కెల్లా మధురాతి మధురమైన తేనె ఉంది ఒక గిన్నెలో. ఆ గిన్నె తీసుకుని గంధర్వ రాణిని వెతుక్కుంటూ ఉత్తర దిశగా బయల్దేరాడు వ్యాపారి. ఎన్నో దినాలు ఓపిగ్గా, ఎంతో శ్రమించి లేత నీలం రంగులో ఎంతో మోహనంగా ఉన్న పర్వత శ్రేణిని చేరుకొన్నాడు. ఒక పర్వతం దిగువ భాగంలో కింద కూర్చొని ఎంతో హృదయవిదారకంగా రోదిస్తున్న గంధర్వ రాణిని చూచాడు. చెంత చేరి ఆమె కన్నీటిని తుడిచి "గంధర్వ రాణీ నీకిష్టమైనది తెచ్చాను. దయచేసి

దీన్ని అందుకో" అని అభ్యర్థించాడు. ఆమె ప్రసన్నురాలై ఆ పాత్రనందుకొంది. అందులో ప్రపంచంలోకెల్లా తీయనైన చిక్కని తేనె ఉంది.

"తల్లీ నీవిచ్చిన శాపాన్ని ఉపసంహరించుకొని రాజ్యాన్ని తిరిగి రంగుల హరివిల్లు చేయమని" ప్రార్థించాడు వ్యాపారి. గంధర్వ రాణి అంగీకరించి, శాపాన్ని ఉపసంహరించుకొని తిరిగి రాజ్య ప్రవేశం చేసింది. వెంటనే ఆ రాజ్యం తన పూర్వపు రూపు రేఖలను, వైభవాన్ని సంతరించుకొని రంగులమయంగా మారిపోయింది. అందరి ముఖాల్లో సంతోషం వెల్లివిరిసింది.

మన ఈ వ్యాపారికి సిట్యుయేషనల్ లీడర్‌కి తేడా ఉండదు. ఓర్పు, సాహసం, శ్రమ, నలుగురి మేలే తన మేలు అనే భావన... ఇవన్నీ ఇలాంటి నాయకులకు కావాల్సిన ముఖ్య లక్షణాలు.

# 18

# ఫలితాలే ప్రధానం ఈ నాయకులకు

'ప్రతిభావంతులకి పట్టం కట్టటం, వాజమ్మలను శిక్షించటం! బాగుంది కదూ ఈ పద్ధతి!'



మరో తరగతికి చెందిన లీడర్‌షిప్ : ట్రాన్సాక్షనల్ లీడర్‌షిప్ – ఫలితాలను మాత్రమే ప్రామాణికంగా చేసుకొని వ్యవహరించే నాయకుడు.

గమ్యం చేరితే పురోభివృద్ధి.

విఫలమైతే ఇంటికి! చాలా సింపుల్ కదూ.

రివార్డ్, పనిష్‌మెంట్ అని అంటూంటాం సంస్థల్లో. ప్రయోజకులకు రివార్డు – బహుమానాలు; అప్రయోజకులకు పనిష్‌మెంట్ – శిక్ష.

చాలా వ్యాపార సంస్థల్లో ఇది జరుగుతూ ఉంటుంది. సంవత్సరం మొదట్లోనే నిర్ధారించుకున్న ఫలితాలను రాబడితే అటువంటి వారికి ప్రమోషన్లు, బోనసులు, వగైరాలు. విఫలమైతే శిక్ష – ఇంక్రిమెంట్లు ఆపటం, ఉద్యోగాలు ఊడదీయటం వగైరాలు.

'ఫియర్ ఈజ్ ది కీ' అంటారు పెద్దలు. భయం అనే అస్త్రం పలుమారులు ఎంతో అద్భుతంగా పనిచేస్తుంది. అందుకే సింగపూర్ లాంటి నగరాలలో రోడ్లమీద చెత్తా చెదారం విసరని భారతీయుడు, స్వదేశంలో అడుగిడగానే మొదటగా చేసేపని అదే.

ఇష్టారాజ్యంగా ప్రవర్తిస్తాడిక్కడ. అక్కడ సింగపూర్‌లో జేబులు ఖాళీ అయ్యేలాంటి ఫైనువేస్తారు. మనదేశంలో ఏం చేసినా ఏంలేదు!!! భయం లేదు, భక్తి లేదు.

అలాగే ఎన్నో ప్రభుత్వ సంస్థల్లో రివార్డ్ పనిష్‌మెంట్ లాంటి ఎలాంటి ప్రక్రియ లేకపోవటంవల్ల, పనిచేసే వాళ్లు చేస్తారు.. లేనివాళ్లు లేదు.

చేసినా చేయకపోయినా తేడాలేదు.

సో... ఫైళ్లు కదలవు.

ఫైళ్లు కదలాలంటే ముడుపులు చెల్లించుకోవాలి.

ముడుపులు తీసుకోవటం సర్వసాధారణమైపోయింది కనుక, పైగా పట్టుబడ్డాకూడా ఎలాంటి కఠినమైన శిక్ష ఉండదు కనుక, హాయిగా దిగులు చింతా లేకుండా ముడుపులు స్వీకరిస్తారు.

ముడుపులంటే గుర్తుకొచ్చింది –

ఒకసారి ఒక ప్రభుత్వ సంస్థలో పని బడి, ఆ సంస్థలో పనిచేస్తున్న మా పొరుగింటాయన్ను నావెంట తీసుకెళ్లాను.

ఆయన నన్ను, నా సమస్యను ఆఫీసరుగారికి పరిచయం చేసి, సహాయం చేయమని అర్థించి వెళ్లాడు.

ఆఫీసరుగారు పనికావాలంటే ఖర్చు అవుతుందన్నాడు!

ఎంత అన్నాను!!

చెప్పాడు.

మరి మా పొరుగింటాయన మీ సంస్థలోనే పనిచేస్తాడు, పైగా నాకు హెల్ప్ చేయమని మీకు చెప్పాడు కదా అంటే, ఆయన కూడా ఏపనీ ఊరికే చేయడు కదా అన్నాడు.

నా నోట్లో కరక్కాయ పడింది. మింగలేక, కక్కలేక ఇంకా నానా అవస్థపడుతున్నాను– ఆ కరక్కాయతో.

**కరప్షన్ తర్వాత, రివార్డ్ పనిష్మెంట్ లేకపోవటమే మన దేశాన్ని, మనని పట్టిపీడిస్తున్న మరో ముఖ్య సమస్య. నిష్ణాతులకి, వ్యర్థులకి – ఒకటే ఫలితం. కనుక శ్రమించి ఏదైనా సాధిద్దామనే ప్రేరణ, తపన చాలా మందిలో లోపిస్తాయి. ఈ సమస్యకు విరుగుడే– ట్రాన్సాక్షనల్ లీడర్‌షిప్.**

ప్రతిభావంతులకి పట్టం కట్టటం. వాజమ్మలను శిక్షించటం!

బాగుంది కదూ ఈ పద్ధతి!

ఇలాంటి సంస్థల్లో ప్రతివారికి వారివారి బాధ్యతలు, సాధించవలసిన ఫలితాల గురించి పూర్తి అవగాహన కలగచేస్తారు.

ఫలితాలు సాధిస్తే పొందబోయే లాభాలు, విఫలమైతే ఎదుర్కొనబోయే నష్టాల గురించిన అవగాహన కలిగిస్తారు.

ప్రతి పనికి, ప్రతి అడుగుకి తనిఖీలు ఉండవు.

ఎంత అవసరమో అంత స్వతంత్రం కలుగచేస్తారు. ఈ విషయం గురించి ప్రస్తావన వచ్చినప్పుడల్లా ధీరూభాయి గారు, డాక్టర్ వర్గీస్ కురియన్‌గారు (అముల్ సృష్టికర్త) నా మనస్సులో మెదుల్తారు.

ముద్రా సంస్థ నిర్మాణదశ నుంచి, ధీరూభాయి పూర్తి స్వతంత్రం కలిగించారు నాకు. ట్రాన్సాక్షనల్ లీడర్‌షిప్ వ్యూహాన్ని అనుసరిస్తూ నా బాధ్యతలను గమ్యాలను విడమర్చి చెప్పారు.

నేను విఫలమయితే రాజీనామా చేయాల్సి వచ్చేది.

రాజీనామాలంటే గుర్తుకొచ్చింది.

గతంలో వ్యక్తులు, సంస్థల్లో, ప్రభుత్వాలలో జరిగిన తప్పులను అంగీకరిస్తూ రాజీనామాలు చేసేవారు. ఎంతో మంది మంత్రులు ఇలా రాజీనామాలు చేశారు.

ఆ పద్ధతి నేడు పూర్తిగా అడుగంటి పోయింది.

బాధ్యతను స్వీకరించటం, తప్పులకు శిక్షను తామే స్వయంగా వేసుకోవటం, రాజీనామాలు చేయటం అంటే నేడు ఏ నాయకుడికి తెలిసినట్లులేదు. జైళ్ల కెళ్లటం ఆనవాయితీగా మారింది.

డాక్టర్ వర్గీస్ కురియన్‌గారు కూడా మా బాధ్యతలను (వారి ఆధ్వర్యంలోని కొన్ని సంస్థలకు ముద్రా ఎడ్వర్‌టైజింగ్ ఏజన్సీగా ఉండేది అప్పట్లో) మాకప్పగించే వారు. మంచైనా చెడైనా పూర్తి బాధ్యులం మేమే.

దీన్నే ట్రాన్సాక్షనల్ లీడర్‌షిప్ అనేది.

ఈ తరహా లీడర్‌షిప్‌లో ఏ ఒక్క నాయకుడి మీదో పూర్తి బరువు బాధ్యతలు వేసి, మంచికీ చెడుకీ ఆయన్నే బాధ్యుడిని చేయటం జరగదు.

అందరూ వారి వారి బాధ్యతలను స్వీకరిస్తారు.

కనుక నాయకులకు బాధ్యత, విచక్షణ ఉన్న సహచరులు ఎంతో అవసరం. లేకుంటే అందరికీ ఇక్కట్లే.

విచక్షణ ప్రస్తావన రాగానే చిన్నప్పుడు ఎప్పుడో విన్న ఈ కథ గుర్తుకొస్తుంది.

ఒక చిన్న ఊరు. తండ్రి, కొడుకు, కోడలు - ఇదీ వారి కుటుంబం. అందరూ కష్టపడి పనిచేస్తూ, హాయిగా జీవిస్తున్నారు.

ఒక రోజున కోడలు చెట్లకు నీరు పోస్తుండగా, ముగ్గురు ఆగంతకులు కనబడ్డారు ఇంటి బయట కూర్చొని. వారిని మునుపెన్నడూ చూడలేదు ఆమె. ఆమె పేరు ప్రసన్న అనుకుందాం.

ఆ ముగ్గురూ పొడుగాటి గడ్డాలు, జడలు కట్టిన జుట్టు, చాలీచాలని వలువలు ధరించి ఉన్నారు. అయితే ముఖాల్లో మాత్రం ప్రత్యేకమైన ఒక వెలుగులాంటిది కనబడింది ప్రసన్నకు. వారి వద్దకు వెళ్లి, “తమరెవరు? ఎందుకిక్కడ నిరీక్షిస్తున్నారు?” అని అడిగింది.

"ఒక ముఖ్యమైన పనిమీద ఇక్కడున్నాము" అన్నారు వారు.

"బయట చాలా వేడిగా ఉంది, దాహమేస్తుందేమో మీకు, లోపలికి రండి. చల్లని నీళ్లిస్తాను" అంది.

"ఈ ఇంటి గృహిణివా అమ్మా" అన్నాడు ఆ ముగ్గురిలోని ఒకరు.

"అవును" అంది ప్రసన్న.

"ఇంటి యజమానిలేడా?"

"లేరు. నా భర్త, మామగారు ఇద్దరూ పనిమీద బైటికెళ్లారు. సాయంత్రం వస్తారు" అంది.

"అయితే వారు వచ్చేదాకా ఇక్కడే ఉంటాము" అన్నారు వారు.

సాయంత్రమయింది.

మామగారు, భర్త ఇద్దరూ ఇంటికొచ్చారు.

బయట వేచి ఉన్న ముగ్గురి గురించి అడిగాడు మామగారు ప్రసన్నను.

"మీ కోసమే ఉదయం నుంచి వేచిఉన్నారు. కారణం చెప్పలేదు..." అంది.

"సరే వాళ్లకి చెప్పు నేను ఇంటికొచ్చానని. అడుగు ఏంకావాలో" అన్నాడు మామగారు.

ప్రసన్న వెలుపలికొచ్చి వారికి చెప్పింది, ఇంటి యజమాని వచ్చాడని, లోపలికొచ్చి ఏం కావాలో మాట్లాడమని.

"సంతోషమమ్మా; అయితే ఒక షరతు. మేము ముగ్గురం ఎప్పుడూ కలిసి లోపలికి రాము. ఒకళ్ల తర్వాత ఒకళ్లం లోపలికొస్తాం. మీరు మమ్మల్ని మీ కిష్టమైన క్రమంలో లోపలికి ఆహ్వానించాలి..." అన్నాడు ఆ ముగ్గురిలో ఒకడు.

ఆశ్చర్యపోయింది ప్రసన్న.

"నా పేరు సంపద. సంపదకు మూలాధికారిని?..." అని ఒక వృద్ధుడు తనను తాను పరిచయం చేసుకున్నాడు.

"నా పేరు విజయ్. విజయానికి అధిపతిని?" అని మరో వృద్ధుడు చెప్పాడు.

మూడో వృద్ధుడు "నన్ను ప్రేమ అంటారు. నాతోపాటుగా అనురాగాన్ని, స్నేహాన్ని, కుటుంబ సభ్యులు కలసి మెలసి ఉండే గుణాన్ని తెస్తాను" అని అన్నాడు.

"మా ముగ్గుర్లో – సంపద, విజయం, ప్రేమానురాగాలు – ఏది కావాలో నిర్ణయించుకొని, వారినే లోపలికి పిలవండి" అన్నారు ఆ వృద్ధులు.

గబగబా ఇంట్లోకి వెళ్లి మామగారికి, భర్తకి ఆవృద్ధులన్న మాటలు చెప్పింది ప్రసన్న.

సంపద, విజయం, ప్రేమానురాగాలు.

ఈ మూడు అందరికీ కావాలి కదా.

ఏ ఒక్కదాన్నో కోరుకోమంటే ఎలా? ఎంతో తర్జన భర్జన జరిగింది ఆ కుటుంబంలో.

చివరికి కొడుకన్నాడు "సంపదను ఆహ్వానిద్దాం. ధనధాన్యాలతో జీవితాంతం సుఖంగా ఉండొచ్చు."

తండ్రి ససేమిరా అన్నాడు "మనం విజయాన్ని ఆహ్వానిద్దాం. విజయానికి ప్రతి ఫలంగా బోల్డెంత సంపద మన సొంతమవుతుం"దని చెప్పాడు.

కొంచెం సేపు నిశ్శబ్దం రాజ్యమేలింది ఆ ముగ్గురి మధ్య.

చివ్వరికి ప్రసన్న అంది.

"మనం ప్రేమను ఆహ్వానిద్దాం. మన కుటుంబమంతా సంతోషంతో ఉండొచ్చు. ధనం, విజయం లాంటివి మనం కోరుకొనేది సంతోషంగా ఉండటం కోసమేకదా... అది లభించేది కేవలం ప్రేమానురాగాల ద్వారానే కదా..."

అందరూ ఒప్పుకొన్నారు.

ముగ్గురూ బయటకెళ్లి ప్రేమను ఆహ్వానించారు.

ముందుగా ప్రేమ.

తర్వాత సంపద.

ఆ తర్వాత విజయం – ముగ్గురూ వరసగా గృహ ప్రవేశం చేశారు.

ప్రసన్న ఎంతో ఆశ్చర్యపోతూ అడిగింది ఆ ముగ్గుర్ని... "మేము ప్రేమనే కదా ఆహ్వానించాం. పైగా ముందుగానే మీరు చెప్పారు, ముగ్గురూ ఎప్పుడూ కలసివెళ్లమని?"

"మీరు సంపదనో, విజయాన్నో కోరుకొని ఉంటే, ఒక్కరమే వచ్చి ఉండేవాళ్లం. ప్రేమను కోరుకున్నారు కనుక, మిగతా ఇద్దరూ కూడా వచ్చాం లోపలికి.

మీరు ఎంతో విజ్ఞతతో, విచక్షణతో ప్రేమను ఎంచుకొన్నారు. ఎక్కడైతే ప్రేమానురాగాలు వెల్లివిరుస్తాయో, అక్కడే సంపద, విజయం తప్పక కొలువు తీర్తాయి... మీ విచక్షణకు జోహార్లు" అన్నారు ఆ ముగ్గురు మహానుభావులు.

విచక్షణ కలిగిన సభ్యులు, నాయకులు ఉన్నప్పుడే ట్రాన్సాక్షనల్ లీడర్‌షిప్ మూడుపువ్వులు, ఆరుకాయలుగా విలసిల్లేది.

# 19

# నిశ్శబ్ద నాయకులు

'నేటి సమాజ ధర్మం ఇది. డాబు, దర్పం, లేని గొప్పతనాన్ని ఆపాదించుకొని, తాము నిజంగానే గొప్ప వారమనుకోవటం... వీటికి బహుదూరం 'క్వయట్ లీడర్‌షిప్' – గీరాబెన్‌గారి లాంటి వారి నాయకత్వం.

వారు తమ కర్తవ్యాన్ని, ధర్మాన్ని నిర్వర్తించుకుంటూ పోతూ ఉంటారు. మనం గమనించి వారి పద్ధతులను వారి ప్రతిభాపాటవాలనుంచి కొంతైనా నేర్చుకొని విజయ మార్గంలో ప్రయాణించవచ్చు.'



మరో తరహా నాయకత్వం 'క్వయెట్ లీడర్‌షిప్'– అంటే నిశ్శబ్ద నాయకత్వం.

వారిని చూచి మనం నేర్చుకొని వారి అడుగు జాడల్లో నడవాలి తప్పితే, దద్దరిల్లే ఉపన్యాసాలు, అదుపాజ్ఞలు, వగైరాలు ఉండవు. ప్రకటనలు, డంభాలు పలకటం, అరచేతిలో స్వర్గాన్ని చూపటం లాంటి వ్యసనాలకు దూరంగా ఉంటారు ఈ నాయకులు.

గతంలో పలుసార్లు ప్రస్తావించాను – నాకు ముగ్గురు ప్రతిభావంతులైన గురువులున్నారని.

శరాభాయ్ కుటుంబానికి చెందిన గీరాబెన్ శరాభాయి ఒక గురువుకాగా, మిగతా ఇద్దరు ధీరూభాయి అంబానీగారు, డాక్టర్ వర్గీస్ కురియన్‌గారు.

నిశ్శబ్దనాయకత్వానికి ఒక చక్కని ఉదాహరణగా గీరాబెన్ గారిని ఉదాహరించుకోవచ్చు.

భారతీయులు గర్వింపదగ్గ టెక్స్‌టైల్ మ్యూజియమ్–కేలికో మ్యూజియమ్ ఆఫ్ టెక్స్‌టైల్స్– ఆమె స్వహస్తాలతో నిర్మించారు. ఆ మ్యూజియమ్‌లో వేల సంఖ్యలో మనకు దర్శనమిస్తాయి భారతీయ వస్త్ర సంపదకు ప్రతీకలు. దాదాపు నాలుగైదు దశాబ్దాల ఆమె శ్రమకు ఫలితం ప్రపంచంలోని అత్యుత్తమమైన ఈ ఇండియన్ టెక్స్‌టైల్ మ్యూజియమ్. నేడు వేల కోట్ల రూపాయలు వెచ్చించినా ఇంత ఘన వస్త్ర సంపదను తిరిగి ఒకచోట ప్రదర్శించలేము. 15వ శతాబ్దంనుంచి నేటి దాక మన భారతీయ వస్త్ర సంపదను అహమ్మదాబాద్‌లో ఉన్న ఈ మ్యూజియమ్‌లో చూడొచ్చు.

నేను మొట్టమొదటి సారిగా నవంబర్ 1968లో ఈమెను కల్సుకున్నాను. ఎంతో ప్రతిభావంతురాలైనప్పటికీ; ఆ నాటి కుబేరుల వంశంలో జన్మించినప్పటికీ (1960, 70 వ దశకాల్లో శరాభాయి వ్యాపార సంస్థలు దేశ విదేశాల్లో అగ్రగణ్య వ్యాపార సంస్థలుగా పేరుగాంచినాయి); ఎంతో సింపుల్‌గా, అతి సాధారణంగా ఉండేవారు ఆమె. ప్రపంచ ఖ్యాతి గణించిన అంత గొప్ప కేలికో మ్యూజియమ్ తన స్వహస్థాలతో స్థాపించినప్పటికీ, ఏనాడు ఆ మ్యూజియం గురించి వార్తా పత్రికల్లో ఇంటర్వ్యూలివ్వటం కాని, దాన్ని గురించి పలువురితో ముచ్చటించటం కాని నేను చూడలేదు.

అతి స్వల్ప విజయాలను భూతద్దంలో చూస్తూ, ఇతరులకు చూపిస్తూ తమకి చెందని గౌరవ మర్యాదలను ఆపాదించుకునే ఈ కలికాలంలో, నభూతో నభవిష్యతి కోవకు చెందిన విజయాలను సొంతం చేసుకొని, నిశ్శబ్దంగా ఎంతో సహజంగా ఉండటం ఒక అద్భుతమే కదూ!

ఒక రోజున పొరుగింటావిడ మన సత్యభామ గారింటికొచ్చి, “అక్కయ్యా! అక్కయ్యా ఇంటి బయట బావగారి బోర్డుచూచాను – ఎన్ని బిరుదులో కదూ! ఎవరిచ్చారిన్ని బిరుదులక్కా” అందిట.

“ఎవరి దగ్గరో బిరుదులు తీసుకోవాల్సిన ఖర్మ మీ బావగారికి పట్టలేదమ్మా. మంచి రోజు చూచుకొని అన్ని బిరుదులు తానే స్వయంగా తగిలించుకున్నారన్నది” సత్యభామ ఎంతో గర్వంగా.

నేటి సమాజ ధర్మం ఇది. డాబు, దర్పం, లేని గొప్పతనాన్ని ఆపాదించుకొని, తాము నిజంగానే గొప్ప వారమనుకోవటం... వీటికి బహుదూరం ‘క్వయట్ లీడర్‌షిప్’ గీరాబెన్‌గారి లాంటి వారి నాయకత్వం.

వారు తమ కర్తవ్యాన్ని, ధర్మాన్ని నిర్వర్తించుకుంటూ పోతూ ఉంటారు. మనం గమనించి, వారి పద్ధతులను వారి ప్రతిభాపాటవాలనుంచి కొంతైనా నేర్చుకొని విజయమార్గంలో ప్రయాణించవచ్చు.

ఒక గొప్ప మ్యూజియమ్ సృష్టికర్తే కాకుండా, గీరాబెన్‌గారు ఒక అసామాన్యమైన సృజనాత్మక శక్తిగా చెప్పుకోవచ్చు. భారతదేశ ప్రకటనా రంగంలో ఒక కొత్త వరవడికి నాంది పలికిన గొప్ప క్రియేటివ్ జీనియస్ గీరాబెన్‌గారు.

ఆరోజుల్లో శరాభాయ్ బిజినెస్ గ్రూప్‌లో ఒక ఎడ్వర్‌టైజింగ్ ఏజెన్సీ ఉండేది. దానిపేరు శిల్పీ ఎడ్వర్‌టైజింగ్. 1960, 70, 80వ దశకాల్లో ఒక టాప్ ఎడ్వర్‌టైజింగ్ ఏజెన్సీ అది. ప్రకటనా రంగంలో నా అక్షరాభ్యాసం జరిగింది ఆ సంస్థలోనే, 1972లో అహమ్మదాబాదులో. ఈ సంస్థ గీరాబెన్‌గారి కనుసన్నల్లో నడిచేది.

ఎడ్వర్‌టైజింగ్ రంగం గురించిన అవగాహన నేను గీరాబెన్‌గారి దగ్గర చూచి నేర్చుకొన్నదే. 1968 నవంబరు నుంచి, 1976 ఫిబ్రవరి దాకా నేను గీరాబెన్ గారితో కలిసి పనిచేసే అవకాశం నా జీవితంలో ఒక పెను మార్పుకి నాంది పలికింది. క్రియేటివిటీ, ముఖ్యంగా ఎడ్వర్‌టైజింగ్ క్రియేటివిటీ మీద నా నమ్మకాలకు, పద్ధతులకు పునాదులు పడింది ఈ కాలంలోనే.

ఆ రోజుల్లో ప్రకటనల్లో వాటి ఉత్పాదనల గురించి విస్తృతంగా రాయటం జరుగుతుండేది. మాటల్లో వర్ణనను ఎడ్వర్‌టైజింగ్ భాషలో ‘కాపీ’ అంటారు. అంటే ‘మాటల్లో వర్ణన’ అన్నమాట... ఈ వర్ణన నేటి ప్రకటనల పంథాతో పోలిస్తే, చాలా ఎక్కువగా ఉండేది ఆరోజుల్లో.

ఈ వరవడికి ఎదురీది ఒక కొత్త వరవడని సృష్టించింది గీరాబెన్‌గారే. ఆమె శిష్యులమైన నేను, సుబ్రతో భౌమిక్ (పేరు ప్రఖ్యాతులున్న గ్రాఫిక్ డిజైనర్) లాంటి వారం ఈ వరవడి ననుసరించి మంచి ప్రకటనలు, తద్వారా పేరు ప్రఖ్యాతులు గడించాము.

ఈ వరవడికి మూలాధారం గీరాబెన్‌గారి నమ్మకం : 'ఏ పిక్చర్ ఈజ్ వర్త్ ఏ థౌజండ్ వర్డ్స్' అంటే ఒక బొమ్మ వెయ్యి మాటలకు సమానం అని. ఇంకొంచెం లోతుగా వెళ్తే, వెయ్యి మాటలు అందించే భావాన్ని ఒకే ఒక్క బొమ్మ చెప్పగలదు. అందుకే బొమ్మల కథలు... సినిమాలు, ఇలాంటి విజువల్ ఆర్ట్స్‌తో మన జీవితం ఎంతో ప్రభావితం అవుతోంది.

ఈ నమ్మకంతో – ఒక బొమ్మ వెయ్యి మాటల పెట్టు – గీరాబెన్ ఒక కొత్త తరహా ప్రకటనలకు ప్రేరణ, మార్గదర్శకత్వం వహించారు. ఫలితంగా కన్నుల పండుగగా ఎన్నో సంవత్సరాల తరబడి కేలికో మిల్స్‌వారి ప్రకటనలు వచ్చేవి. ఆ తర్వాత కాలంలో అదే వరవడిలో విమల్ వారి ప్రకటనలు వచ్చేవి. ఈ ప్రకటనలన్నీ విజువల్‌గా ఎంతో ఆహ్లాదకరంగా, సుందరంగా, మనస్సుకి హత్తుకొనేలా ఉండేవి. స్త్రీ కోమలత్వానికి, ఆమె కోరికలకు, మనో భావాలకు అద్దం పట్టేవి ఈ ప్రకటనలు.

గీరాబెన్ గారి నేతృత్వంలో సృష్టించబడిన కేలికో ప్రకటనలకి ఎన్నో జాతీయ, అంతర్జాతీయ పురస్కారాలు లభించాయి. అయినప్పటికీ ఏనాడూ తన విజయాలను ఆమె ప్రకటించటం నేను ఎన్నడూ చూడలేదు.

ఈ మధ్యే ఆమెను నేను అహమ్మదాబాద్‌లో ఆమె సృష్టించిన కేలికో మ్యూజియమ్‌లో కల్సుకోవటం జరిగింది. మాటల్లో, "కేలికో మ్యూజియమ్ మీ కెంతో గర్వకారణంకదా" అని నేను అనగా, ఆమె ఇచ్చిన జవాబు నేటికీ నాకు ఎంతో స్పష్టంగా గుర్తుంది.

"ఇటీస్ ఏ ఫంక్షన్ ఆఫ్ టైమ్"

అంటే, "నాదేం లేదు కాలమే సమకూర్చింది" అని.

తమ విజయాలను ఎంతో సింపుల్‌గా కాలానికి ఆపాదించటం మన జీవితాల్లో చాలా రేర్‌గా అనుభవంలోకి వచ్చే విషయం. అటువంటి అనుభవాలను

మనకందిస్తూ, మనకు స్ఫూర్తి ప్రదాతలుగా మారేవారే ఈ క్వయెట్ లీడర్స్ – నిశ్శబ్ద నాయకులు. గీరాబెన్ లాంటి వారు.

ప్రపంచ విఖ్యాతి గాంచిన రమణ మహర్షిని ఈ కోవకు చెందిన గొప్ప స్పిరిట్యుయెల్ లీడర్‌గా చెప్పుకోవచ్చు. వారు పవిత్రంచేసిన తమిళనాడులోని అరుణాచలం నేటికీ ఎంతో ప్రసిద్ధిగాంచింది.

రమణ మహర్షిగారు మనను ప్రభావితంచేసే ఉపన్యాసాలివ్వటంకాని, దేశ విదేశాల పర్యటనలు చేస్తూ, శిష్యకోటిని తన బృందంలోకి చేర్చుకోవటంగాని చేసేవారు కాదుట. ఆయనను దర్శించిన వారికి ఒకే సలహా, ఉపదేశం ఇచ్చేవారట! "నీవెవరో తెల్సుకో" అని. వేదాంతమంతా నిండి ఉన్న ఒకే ఒక్క వాక్యం ఇది. మనం ఎవరమో తెల్సుకుంటే, మనకు ఏంకావాలో తెలుస్తుంది. ఈ రెండూ తెల్సిన నాడు మనకు గమ్యం స్పష్టంగా గోచరిస్తుంది. ఆ గమ్యాన్ని ఎలా చేరుకోవాలో బోధపడ్తుంది. మనమెవరమో తెలియకే ఈ ఈతి బాధలన్నీ! ఈ ప్రయోగాలన్నీ!!

ఏదో ఒక వస్తువు మీదో, గమ్యం మీదో మనసు పెంచుకుంటాం. అది అందిందాకా అహోరాత్రాలు కృషిచేస్తాం. ఆ గమ్యం చేరాక దాని విలువ సడన్‌గా పడిపోతుంది. మరో గమ్యం ఎంచుకుంటాం... మళ్లీ అహోరాత్రులు విసుగు విరామం లేకుండా కృషిచేస్తాం. చరిత్ర పునరావృత్తమవుతుంది. ఆ గమ్యం చేరాక దానిమీద మోహం తగ్గి, మరో గమ్యం చేరుకొనే దిశగా పయనిస్తాం. నిత్యం మనందరికీ ఎదురవుతున్న జీవన విధానమిది. రమణ మహర్షి చెప్పినట్లుగా, మనమెవరమో తెల్సుకొంటే మన జీవిత పరమార్థమేమిటో ఇట్టే తెలిసిపోతుంది కదూ.

ఏమిటీ గోల అనుకుంటున్నారా? నిశ్శబ్ద నాయకత్వానికి ఉదాహరణగా శ్రీ రమణమహర్షి గారికి, వారి బోధనకున్న శక్తి గురించి రెండు ముక్కలు చెప్పాను.

ఈ నిశ్శబ్ద నాయకులు మన చుట్టుతా ఉన్న సమాజంలో వేలల్లో, లక్షల్లో కనబడ్తారు. వారు వ్యాపార సంస్థలకు ముఖ్యాధిపతులుగానో లేక రాజకీయ నాయకులుగానో ఉండాల్సిన అవసరంలేదు. తమ పని తాము చేసుకుంటూ, సంస్థలకి, సమాజానికి తద్వారా దేశానికి మేలుచేసే ప్రతివ్యక్తి ఒక నిశ్శబ్ద నాయకుడే.

ఈ దృష్టితో పరిశీలించి చూడండి. మీ కుటుంబంలో, మీ సంఘంలో, మీ సంస్థల్లో మీకు ఎంతో మంది కనబడ్తారు. నవమాసాలు మోసి, కనిపెంచి మనకు అస్తిత్వాన్ని, వ్యక్తిత్వాన్ని ఇచ్చిన మన తల్లి నిశ్శబ్దనాయకురాలేకదా. తాను సాధించిన విజయాల గురించి ఏనాడైనా తల్లి తన పిల్లలకు దండోరావేయటం చూశారా మీరు?

ఎంత మంది గృహిణులు నిశ్శబ్దంగా కుటుంబాలను తీర్చి దిద్దుతారో గమనించారా?

అలాగే సంస్థల్లో పలువురు నిశ్శబ్ద నాయకులు కనబడ్తారు మనకు.

ముద్రాలో రవి అరోరా అనే ఫైనాన్స్ ఛీఫ్ ఉండేవాడు. ఎంతో ప్రతిభావంతుడు, ఫైనాన్స్‌కు చెందిన వ్యక్తి. నిశ్శబ్దంగా ముద్రాకు ఒక బలోపేతమైన వ్యాపార సంస్థగా రూపురేఖలందించాడు. వ్యాపార సంస్థలకు తగురీతిలో లాభాలు రావటం ఎంతో ముఖ్యం. విలువలను, సంస్థ గౌరవాన్ని తాకట్టుపెట్టకుండా, ప్రతి ఏడు లాభాలనార్జించటం, అవి ఎదిగేలా చేయటం అంత సులువైన విషయంకాదు. నిర్దిష్టమైన వ్యూహాలు; పద్ధతులు; సంస్థయొక్క పేరు ప్రఖ్యాతులకు మచ్చరాకుండా లాభాలనార్జించే విధానాలు... వీటన్నిటి సంగమమే ఒక మంచి సంస్థకు పునాది రాళ్లు. వీటిని బలోపేతం చేశాడు రవి అరోరా ముద్రా వ్యాపార సంస్థకి.

అలాగే ముద్రాలో మరో వ్యక్తి – ట్రీసా ఫెర్నాండెజ్ అనే ఆవిడ. నా సెక్రటరీగా దాదాపు ఒక దశాబ్దంపైగానే పనిచేసింది. ప్రతి విజేత వెనుక అండదండలుగా ఒక వనిత ఉంటుందనేది ఎంత సత్యమో అలాగే ప్రతి వ్యాపారవేత్త లేక ఉన్నతాధికారి వెనుక ఒక సెక్రటరీ ఉంటుందనేది ఎంతో నిజం. పలు కార్యక్రమాల్ని, పలు బాధ్యతల్ని సక్రమంగా జరిగేలా చూచేది ట్రీసా లాంటి సెక్రటరీలే. ఒక చెడు సెక్రటరీ ఫోర్జరీచేసి మా కుంటుంబ సంపదను హరించి జైలుకెళ్తే, మరో సెక్రటరీ నావృత్తిని ఒక అందమైన అనుభూతిగా మార్చింది. ఎంతో నిశ్శబ్దంగా, ఎలాంటి హంగామా, ప్రకటనలు లేకుండా.

చెప్పి చేయించుకోవటం; లేదా తన చిటికెన వేలునిచ్చి మార్గదర్శకత్వం వహించటం; లేదా ఇతరులతో మమేకమై సున్నితంగా, చెప్పీ చెప్పక మార్గదర్శకత్వం వహించటం– ఇలా ఎన్నో నాయకత్వ లక్షణాలున్నాయి. అయితే మనం చర్చించుకుంటున్న నిశ్శబ్ద నాయకత్వంలో మనం సొంతంగా ఆలోచించటం, తద్వారా మన ఆలోచనా శక్తి పెరగటం, మన వ్యక్తిత్వం వికాసం చెందటం జరుగుతుంది.

ఇలాంటి నాయకులు తమ జీవితాలనే మనకు పాఠ్య పుస్తకాలుగా మారుస్తారు.

వారి జీవితాలే మనకు బోధలు.

వెను తిరిగి చూస్తే గీరాబెన్ శరాభాయిగారు ప్రకటనా రంగంలో నాకెలాంటి పాఠాలు నేర్పలేదు. ఎలాంటి పద్ధతుల గురించి వివరణ ఇవ్వలేదు. ఆమె తన పని తాను చేసుకుంటూ పోతూ ఉండేది. నేనో విద్యార్థిలాగా అన్నీ చూస్తూ, గ్రహిస్తూ, కొంచెం కొంచెం నేర్చుకొనేవాణ్ణి. కొన్ని అనుభవంలోకి తెచ్చుకొనే వాణ్ణి నా సొంత పద్ధతుల ద్వారా. ఇలాంటి గురువులు మనకి ఏంచేయాలో, ఎలా చేయాలో చెప్పే కోచెస్ కారు. మనం చూచి నేర్చుకోవాలి. ఆపైన బుద్ధిని ఉపయోగించి ముందుకెళ్లాలి.

మనను సొంతంగా ఆలోచింపచేయగలిగే గురువు సర్వోత్తమ గురువేకదా! ఆలోచించకుండా ఎవరో చేసిన పనిని మనమూ చేసుకుంటూ పోతే, మనమో యంత్రంగా మారిపోమూ? మనం యంత్రాలం కాదు కదా!... బుద్ధి, ఆలోచన, వివేకం గల సజీవ వ్యక్తులం. సొంతంగా పనులు చేయటం నేర్చుకొని, వాటిని మెరుగు పరుస్తూ ముందుకెళ్లటం మన విధ్యుక్త ధర్మం.

మన ఆలోచనా రీతి మెరుగైతే మన జీవితాలు మెరుగవుతాయి. జీవితంలో భాగమేగా మన వృత్తి, మానవ సంబంధాలు, కుటుంబ సంబంధాలు, సామాజిక బాధ్యతలు వగైరాలు. మెరుగ్గా ఆలోచించే మనిషి మెరుగైన సమాజ నిర్మాణానికి తోడ్పడుతాడు.

ఈ మెరుగైన సమాజ నిర్మాణంలో ఒక కీలకమైన వ్యక్తి – నాయకుడు. అరచేతిలో స్వర్గాన్ని; మాటల గారడీల ద్వారా అమర సుఖాలని; చెప్పేదొకటి చేసేదొకటి లాంటి వ్యక్తిత్వంద్వారా మనను మాయచేయటం; కరుడుగట్టిన స్వార్థం – వీటన్నింటికీ దూరం మన నిశ్శబ్ద నాయకులు.

ద్రోణాచార్యుడి వద్ద చూచి నేర్చుకొని చరిత్రలో చిరంజీవిగా నిలిచాడు కదా ఏకలవ్యుడు.

నిశ్శబ్ద నాయకులు మనకు స్ఫూర్తినిచ్చి; ఆలోచింపచేసి; కార్యోన్ముఖులుగా మార్చి; మనలో దాగివున్న ప్రతిభాపాటవాలను మనదైన సొంత ప్రక్రియల ద్వారా వెలుపలికి తెచ్చే వ్యక్తులుగా నిలిచిపోతారు.

చిన్న పిల్లలు ఎలా చూచి నేర్చుకొంటారో, అలాగే మనంకూడా ఈ నిశ్శబ్ద నాయకుల నుంచి చూచి నేర్చుకొంటాం. నిజానికి ఎవరినైనా మాటలద్వారా బోధల ద్వారా మార్చటం ఎంత కష్టమో మనందరికి అనుభవంలో ఉన్నదే. మార్పు మనెవ్వరికీ అంత సులభంగా రాదు.

మార్పును తేవటం వ్యక్తుల్లో కానీండి, సంస్థల్లో కానీయండి – అత్యంత కష్టతరంగా, దాదాపు అసాధ్యమైందిగా భావిస్తారు ఈ రంగానికి చెందిన నిపుణులు.

మనలో మార్పంటూ జరిగితే అది చూచి నేర్చుకొనే ప్రక్రియ ద్వారా తప్పితే; మాటలవల్ల, బోధనలవల్ల లేక పనిష్‌మెంట్ ద్వారానో జరిగేదికాదు.

సిగరెట్టు తాగే తండ్రి కొడుకు సిగరెట్ మానేయాలంటే తను మానుకోవటమే ఏకైక పద్ధతి. ఉపన్యాసాలు, పనిష్‌మెంట్‌లు ఈ మార్పును కొడుకులో తేలేవు. గతంలో జాతిపిత మహాత్మాగాంధీ గురించి ముచ్చటించుకుంటూ జ్ఞాపకం తెచ్చుకొన్నాం గుర్తుందా? ఒక తల్లి తన కొడుకుని గాంధీజీ వద్దకు తెచ్చి, అతిగా బెల్లంతినే అలవాటున్న కొడుకుని ఆ అలవాటుకి దూరం చేయమంటే, మహాత్ముడు పదిహేను రోజుల తర్వాత తిరిగి రమ్మంటాడు. అలాగే తల్లీ కొడుకులు వస్తారు గాంధీజీ దగ్గరకు. అప్పుడు గాంధీజీ బెల్లం అతిగా తినటంలోని అపాయాలను గురించి చెప్తాడు ఆ బాలుడికి. తల్లి అడుగుతుంది గాంధీజీని : ఈ బోధ 15 రోజుల క్రితం మేం వచ్చినప్పుడు చేసి ఉండొచ్చుకదా అని. అప్పుడు నేను బెల్లం

తింటూండే వాడినని అంటాడు గాంధీజీ. చేసి చూపించటమే తను నమ్ముకున్న సిద్ధాంతం అని నిరూపించిన మహోన్నతుడు గాంధీజీ.

ఏ రంగంలో ఉన్నా, ఎలాంటి పొజిషన్‌లో ఉన్నా, నిశ్శబ్ద నాయకులు ఉన్నతులుగా, ఉత్తమ తరగతికి చెందిన స్ఫూర్తి దాతలుగా, అత్యుత్తమ నాయకులుగా మిగిలిపోతారు.

ఈ మహానుభావుల్ని గుర్తించి, వారిని అనుసరించటం నిస్సందేహంగా ఒక ఉత్తమమైన మార్గం మనందరికి.

# 20

# మార్పును తెచ్చే నాయకులు

'వ్యవస్థలోని లోటుపాట్లు గ్రహించి, దాని అవసరాలను అధ్యయనం చేసి, మార్పును ప్రతిపాదిస్తూ, ఆ మార్పును తాను జీవించే వాడే పరిణామాన్ని తెచ్చే నాయకుడు... వీరి వ్యక్తిగత విలువలు,... జీవన విధానాలు మనకు సంపూర్ణంగా స్ఫూర్తినిస్తాయి. వారి బాటలో పయనించేలా చేస్తాయి.'



మరో విధమైన నాయకత్వం – ట్రాన్స్‌ఫార్మేషనల్ లీడర్‌షిప్ – మార్పు లేక పరిణామాన్ని తెచ్చే నాయకత్వం.

ఇటువంటి నాయకులకు బలమైన నమ్మకాలు, విలువలు ఉంటాయి. ఉదాహరణకి మహాత్మా గాంధీజీ. ఆయన జీవితమే మనకొక పాఠం. మనకి స్ఫూర్తి ప్రదాయిని.

వ్యవస్థలోని లోటుపాట్లు గ్రహించి, దాని అవసరాలను అధ్యయనం చేసి, మార్పును ప్రతిపాదిస్తూ, ఆ మార్పును తాను జీవించే వాడే పరిణామాన్ని తెచ్చే నాయకుడు. ముందుగా చెప్పుకొన్నట్లుగా వీరి వ్యక్తిగత విలువలు, జీవన విధానాలు మనకు సంపూర్ణంగా స్ఫూర్తినిస్తాయి. వారి బాటలో పయనించేలా చేస్తాయి.

సంఘంలో ఇటువంటి నాయకులు నేడు అతి తక్కువగా కనబడుతున్నప్పటికీ, వ్యాపార రంగంలో, ఆధ్యాత్మిక రంగంలో 'మార్పును' మనలో తెచ్చే నాయకులు చాలామంది దర్శనమిస్తారు మనకు. వ్యాపార సంస్థలు కాలానుగుణంగా మార్పుచెందక, క్షీణించిపోతున్న దశలో, కొత్త నాయకులొచ్చి ఆ సంస్థలను, అవి పాటించే సూత్రాలను, వ్యాపార విలువలను మార్చి వాటిని తిరిగి విజయ పథంలో నడిపిన వారు ఎందరో కనబడ్తారు మనకు.

లైసెన్స్‌లు, కోటాలు, అన్నిటికీ కొరతలు విచ్చల విడిగా రాజ్యమేలుతున్న రోజుల్లో రంగప్రవేశం చేసి, సామాన్యులు కూడా కలలు కనే ధైర్యం చేయవచ్చు... అంతేకాకుండా వాటిని సాకారంచేసుకొనే దిశగా పయనించవచ్చును అనే ధైర్యాన్ని ఇచ్చి, మనదేశంలోని  ఎందరో సామాన్యులకు స్ఫూర్తినిచ్చాడు ధీరూభాయి. లైసెన్సులు, కోటాలు ఆ రోజుల్లో అంటే 1980 దశకందాకా ఎంత భయంకరంగా ఉండేవంటే ప్రతి దానికి అంతులేని నిరీక్షణే. నేడు సునాయాసంగా చాలా మధ్య తరగతి వారికి అందుబాటులో ఉన్న విమానసేవలు ఊహామాత్రంగా కూడా ఎవ్వరూ అందుకోవాలనుకునేవారు కాదు ఆరోజుల్లో.

మా పెద్ద అమ్మాయికి అముల్ స్ప్రే పాలడబ్బా కోసం ప్రతినెలా ఒక భయంకర పోరాటమే. అన్నిటికీ కరువే. అటువంటి రోజుల్లో ఒక యువ వ్యాపారవేత్త మనదేశ వ్యాపార రంగంలో ప్రవేశించి నేను అత్యాధునికమైన అంతర్జాతీయ తరగతికి చెందిన పరిశ్రమలు నెలకొల్పుతాను అని కలలుకని, వాటిని సాకారం చేసుకోవటం ఎంత అనూహ్యమైనదో ఆలోచించి చూడండి. ఇటువంటి వారే ట్రాన్స్‌ఫార్మేషనల్ లీడర్స్. మార్పుకి నాంది పలికి, మార్పును తెచ్చేవారే ఈ కోవకు చెందినవారు.

మదర్ థెరీసా మరో పరిణామానికి నాంది పలికిన నేత.

నిస్వార్థంగా, బీదవారికి అండగా నిలిచి వారికి మదర్ అందించిన సేవలను మరెవ్వరూ అందించలేదు. తన జీవిత కాలమంతా తోటి మానవులకు జాలి, కరుణ చూపించమని ప్రపంచానికి ఎలుగెత్తి చాటిచెప్పిన మానవజాతి అంతటికీ మాతృమూర్తి – మదర్ థెరీసా. తనకోసమని ఎలాంటి పేరు ప్రతిష్ఠలకుగాని,

గుర్తింపుకోసం కాని ఆలోచించని మహోన్నత వ్యక్తి థెరీసా. అందుకే మన దేశ చరిత్రలో ఒక ముఖ్యమైన వ్యక్తిగా నిలిచిపోయింది మదర్ థెరీసా.

హింసలతో నిండిన మనదేశ స్వతంత్ర పోరాటాన్ని శాంతియుతంగా, 'అహింస' అనే అస్త్రంతో మలుపుతిప్పిన వాడు జాతిపిత గాంధీజీ. మనదేశానికే కాదు, యావత్ ప్రపంచానికే ఒక గొప్ప ట్రాన్స్‌ఫార్మేషనల్ లీడర్‌గా నిలిచిపోయాడు మన మహాత్ముడు. అంతేకాదు, నిరాడంబరమైన జీవనం, క్షమాగుణాన్ని ప్రపంచానికి చాటి చెప్పిన వాడు మన గాంధీజీయే.

పరిణామానికి నాంది పలికిన నాయకుల జాబితాలలో ఇటీవలే మరణించిన 'ఏపిల్' సంస్థ సృష్టికర్త – స్టీవ్ జాబ్స్... ఇంకా ఎడ్వర్‌టైజింగ్ రంగానికి చెందిన డేవిడ్ ఒగిల్వీ, చరిత్ర ఎన్నటికీ మరువలేని నెపోలియన్, హిట్లర్, చక్రవర్తి అశోకుడు, చైనాకి చెందిన మావో... ఇలా ఎందరో. వీరందరు సమాజంలోని మార్పుకి, మంచి కానీయండి, చెడుకానీయండి... నాంది పలికినవారే.

సమాజంలో కాని, సంస్థలోకాని, ఒక పెద్ద కుటుంబంలోకాని, ఒక గ్రామంలోకానీ మార్పు తేవాల్సిన అవసరముంటే దాన్ని గుర్తించి ఆ మార్పుకై నలుగురిని తన వెంటనడిపిస్తూ, మార్పును తెచ్చేవాడే ట్రాన్స్‌ఫార్మేషనల్ లీడర్. పైన ఉదాహరించిన వ్యక్తులు అందరూ మార్పును తెచ్చినవారే.

**మరో రకమైన నాయకత్వం – అటోక్రాటిక్ లీడర్‌షిప్ – నియంతలాగా వ్యవహరించటం.** నిరంకుశంగా తన వారిని తాను అనుకున్న విధంగా తీర్చిదిద్దే నాయకులని అటోక్రాటిక్ లీడర్స్ అంటాం.

మన చుట్టూతా ఈ తరగతికి చెందినవారు కోకొల్లలు. నిజానికి కొద్దిమందిని మినహాయిస్తే, అందరూ ఈ కోవకు చెందినవారే. ఎందుకంటే సమాజంలో, సంస్థల్లో, ప్రభుత్వంలో, రాజకీయాల్లో కాస్తో కూస్తో పేరు ప్రఖ్యాతులు రాగానే తాబట్టిన కుందేటికి మూడు కాళ్లుగా వ్యవహరించే వారే అందరూ. ఎదుటివారి అభిప్రాయాలకు, అవసరాలకు విలువనిచ్చి, నిర్ణయాలు తీసుకునేవారు బహు కొద్ది సంఖ్యలో ఉంటారు.

ఈ అటో[క్రాటిక్ ప్రవర్తన గురించిన ప్రస్తావన వచ్చినప్పుడల్లా అహమ్మదాబాద్‌లో నేను కేలికో మిల్స్‌లో ఉద్యోగానికి చేరిన తొలి రోజుల్లో జరిగిన సంఘటన తపీమని గుర్తుకొస్తుందినాకు. నియంతల నడవడికి, వ్యవహార తీరుకి అద్దంపట్టే సంఘటన ఇది. కేలికోకి చెందిన ఒక కంపెనీ డెరెక్టరుగారి తల్లి నాకు ఫోనుచేసి కేలికో హాస్పిటల్‌కి చెందిన డాక్టరుగారిని తమింటికి పంపించమని ఆర్డరేసింది. సరేనని, ఆ డాక్టరుగారికి ఫోనుచేశాను. ఆయన అడిగారు – ఏమిటి విశేషమని? బహుశా ఆమెకు ఆరోగ్య సమస్య ఏదైనా ఉందేమోనని అన్నాను. సరేనని డాక్టరుగారు ఫోనుపెట్టేశారు. ఐదునిమిషాలన్నా గడవక మునుపే, డైరెక్టర్‌గారి తల్లి మళ్లీ నాకు ఫోనుచేసి, "చెప్పింది మాత్రమే చేయి, నాకు ఆరోగ్య సమస్య ఉందని నీకు చెప్పానా?" అని తపీమని ఫోనుపెట్టేసింది.

ఇలా ఉంటాయి నియంతల నిరంకుశ ప్రవర్తన... వారి వాక్కే వేదవాక్కు.

మరో ఉదంతం : బరోడాలో ఒక సెంట్రల్ గవర్నమెంట్‌కి చెందిన సంస్థ, నేను శిల్పీలో పనిచేస్తున్నప్పుడు మాకు క్లయింట్‌గా ఉండేది. ఆ సంస్థ ఎమ్.డి.గారి భార్య సంస్థాగత విషయాల్లో వేలేకాదు, శరీరాన్నంతా దూర్చేది. ఒక ఆడియో విజువల్ కోసం ఆ ఎమ్.డి.గారి ఫోటో కావాల్సివచ్చింది మాకు. నమ్మండి, నమ్మకపోండి, ఆయనగారి ఫోటోను పది పన్నెండు సార్లు, పది పన్నెండు వేరు వేరు రోజుల్లో తీయాల్సి వచ్చింది!!! అదీ, ఆ రోజుల్లో ఎంతో పేరు ప్రఖ్యాతులున్న ఫోటోగ్రాఫర్ ద్వారా. ఎందుకంటే ఆయన సతీమణికి ఏ ఫొటో నచ్చేదికాదు. ఇలా ఉంటాయి నియంతల ధోరణులు.

ఏ సంస్థలో అయితే ముఖ్యాధికారుల భార్యామణులు వేళ్లు, తలలు దూరుస్తారో చాలాసార్లు ఇలాంటి ధోరణులు వ్యక్తమవుతుంటాయి. తమకి పరిచయం లేని రంగాలలో నియంతల్లాగా నిర్ణయాలు తీసుకుంటే జరిగే ప్రమాదాలకు ఇవి అతి సాధారణ ఉదాహరణలు మాత్రమే. కుటుంబ సభ్యులు రాజకీయాల్లో ప్రవేశించి, తెర వెనుక నుంచి దేశానికి చేస్తున్న అపకారం మనందరం చూస్తున్నాంకదా. ఇవి ఆయా నాయకుల నిరంకుశత్వానికి ఉదాహరణలే కదా.

ఎవరి పని వారు చేసుకొంటూపోతే నిరంకుశత్వానికి అవసరముండదు. అలా జరగనప్పుడు, జరగనీయనప్పుడు జరిగే పరిణామాలను నియంత ధోరణులంటాము.

డాక్టర్ వద్దకెళ్లి, ఫలానా మందివ్వమనటం ఇలాంటి ధోరణేకదా!

ఇలాగా కుటుంబ విషయాల నుంచి దేశ పరిపాలన దాకా ఈ అటోక్రాటిక్ ధోరణులు స్పష్టంగా కనబడ్తాయి.

మహావృక్షమయిన మర్రిచెట్టు నీడన మరే చెట్టూ ఎలాగా ఎదగలేదో, ఇటువంటి నియంతల నీడన మరే నాయకుడు ఎదగలేడు.


ఇది మంచో, చెడో మీరే నిర్ణయించు కోండి.

# 21

# నిచ్చెనలాంటి నాయకులు

'ఆత్మ గౌరవాన్ని అందించే వాడే అసలైన నాయకుడు. భారత జాతికి విదేశ పాలన నుంచి విముక్తి కలిగించి, ఎంతో ఆత్మగౌరవాన్ని ఇచ్చాడు మనందరికి మన జాతిపిత మహాత్మాగాంధి. అలా ఎందరో మహానుభావులు నిస్వార్థ సేవతో దేశం కోసం ప్రజల కోసం పాటుబడి మనందరికి మన దేశం మీద, జాతి మీద, మనపై మనకు గౌరవం కలిగేలా చేశారు.

నలుగురి కోసం నడుంకట్టి వారి సమష్టి కలలను సాకారం చేసేవాడే నాయకుడు.'



'లీడర్ ఈజ్ ఎ లేడర్' – అంటే నాయకుడు మనకు ఒక నిచ్చెనలాంటి వాడు.

ఈ నిచ్చెనలాంటి నాయకులు 'నేను', 'నాది' లాంటి పదప్రయోగాలు చేయరు.

'మనము', 'మనది' లాంటి మాటలకు అలవాటు పడి ఉంటారు.

ఎందుకంటే ముందే మనం చెప్పుకొన్నట్లుగా, కొంత మంది సమష్టి కలలను సాకారం చేసే దిశగా నడిపించేవాడే నాయకుడని.

వ్యక్తిగతంగా ఉన్న కోర్కెలను అనుభవంలోకి తెచ్చుకొనేవాడు, ఆ ప్రక్రియలో ఎదురొచ్చిన అడ్డంకులను నిర్దాక్షిణ్యంగా అణచివేసి తన సొంత గమ్యాలను చేరుకొనేవాడు నాయకుడు ఎలా అవుతాడు?

అలాగే తియ్యని మాటలతో మనను సమ్మోహితులను చేసే వాడు కూడా నాయకుడుకాడు. వీళ్లని 'గ్లిబ్ టాకర్స్' అంటారు సాధారణంగా. మెత్తగా, సున్నితంగా, చక్కగా, అందంగా మాట్లాడి పబ్బంగడుపుకు పోయేవాళ్లు. మన చుట్టూరా ఇటువంటి 'గ్లిబ్ టాకర్స్'కి కొదువలేదు. మాయమాటలతో మనని మైమరపించి పనులు చేసుకుపోయే వాళ్లన్నమాట ఈ మహానుభావులు.

క్షణాల్లో స్నేహాలు ఏర్పరచుకోవటం, వారిని మాటల్తో ఇన్‌ఫ్లూయెన్స్ చేయటం ఒక కళ కావచ్చునేమోకాని, నాయకత్వ లక్షణమనిపించుకోదు.

సామాన్యులను అసామాన్యులుగా తీర్చిదిద్దగలిగిన వాడే నాయకుడు. అసాధ్యాలుగా కనుపించే గమ్యాలను నిర్దేశించి, వాటి సాకార దిశగా మనను నడిపించే వాడే అసలు సిసలైన నాయకుడు.

బలి చక్రవర్తి కథ విన్నారుకదా మీరు. ఆదర్శప్రాయుడైన నాయకుడు ఈ మహోన్నతుడు.

హిరణ్యకశిపుడి మరణానంతరం ఆయన తనయుడు ప్రహ్లాదుడు దానవ రాజవుతాడు. ప్రహ్లాదుడి కొడుకు విరోచనుడు. ఆయన భార్య దేవాంబ. ఈ దంపతుల తనయుడే బలి.

తాతగారైన ప్రహ్లాదుడి వళ్లో పెరిగాడు బలి. తాతగారంటే అపరిమితమైన భక్తి, అనురాగం బలికి. తాతగారి దగ్గరనుంచి సద్బుద్ధి, సకల శాస్త్రాలు, వేదాలు, యుద్ధ శాస్త్రం అన్ని కూలంకషంగా నేర్చుకొన్నాడు. దానవులలో అగ్రగణ్యుడుగా నిలిచిపోయాడు. అత్యంత బలశాలిగా (బలిగా) పేరుతెచ్చుకొన్నాడు. యుక్తవయస్సు రాగానే వింధ్యావళిని పెళ్లిచేసుకొన్నాడు. యువరాజుగా నియుక్తుడయ్యాడు.

దేవతలు దానవులపై తరచు విజయాలు సాధిస్తూ దానవలోకాన్ని భయపెడుతూ ఉండటం రుచించలేదు బలికి. ఎలాగైనా ఈ భయంనుంచి దానవులను విముక్తుల్ని చేయాలనే దృఢసంకల్పంతో, ఘోరతపస్సు మొదలు బెట్టాడు బలి. బ్రహ్మ ప్రత్యక్షమై కావాల్సిన వరం కోరుకోమన్నాడు. నిజమైన నాయకుడిలా తనకోసం ఏమి కోరక, తన దానవ కులాన్ని రక్షించటానికై ఇంద్రుడి అంత శక్తిమంతుడిగా, చావులేని వాడుగా వరాలీయమన్నాడు బలి. తథాస్తు అన్నాడు బ్రహ్మ.

విజయుడై రాజధానికి తిరిగి వచ్చిన బలిని రాజుగా పట్టాభిషేకం చేసుకోమన్నాడు ప్రహ్లాదుడు. కొన్నాళ్లు ఆగాక అన్నాడు బలి. కొంతకాలం గడిచాక ప్రహ్లాదుడు మళ్లా అడిగాడు బలిని రాజుగా బాధ్యతలు స్వీకరించమని. వానప్రస్థాశ్రమం లాంటి జీవన విధానాలు, పద్ధతులు ఉన్న రోజులవి. బలి తాతగారైన ప్రహ్లాదుని కోరాడు – వానప్రస్థాశ్రమం స్వీకరించక రాజ్యంలోనే ఉండి తనను, రాజ్యాన్ని మంచిదారిలో వెళ్లేలా మార్గదర్శకత్వం వహించమని. సరేనన్నాడు ప్రహ్లాదుడు.

అసురజాతికి గురువైన శుక్రాచార్యుడు, ప్రహ్లాదుడు తదితరులు బలికి అండదండలుగా నిలిచి రాజ్య పరిపాలనను మెరుగుపరచే విధంగా ఎన్నో పద్ధతులను, కొత్త శాసనాలను అమలుచేసారు. రాజ్యంలోని ప్రతి వ్యక్తికి కూడు, నీడ ఏర్పాటుచేస్తాడు బలి. అందరూ సంతృప్తితో, సంతోషంగా జీవించే పలు ప్రక్రియలను అమలులోకి తెస్తాడు బలి చక్రవర్తి.

రాజ్యంలో నలు చెరగులా సమృద్ధి, సుఖసంతోషాలు వెల్లువిరుస్తాయి.

ఇటువంటి పాలన ఇవ్వటమే కదా నాటి రాజులకు కాని, నేటి నాయకులకు గాని వారి విధ్యుక్తధర్మం. ఈ నీతిని పాటించినవారు సరైన రాజనీతిని పాటించినట్లు, లేకుంటే స్వయం సమృద్ధికోసం తపించి దేశాన్ని దేశ ప్రజలను దోచుకుతిన్నట్లు. నేడు జరుగుతున్నది ఇదేకదా.

బలి చక్రవర్తిని మంత్రులు, సామంతులు వేనోళ్ల పొగిడి, భూమిని స్వర్గతుల్యం చేసి లేమిని నిర్మూలించి అందరికీ అన్ని సుఖాలు అందించావు కనుక, ఇక ఇంద్రుడిపై దండెత్తమని ప్రోత్సహిస్తారు. శుక్రాచార్యుడు ఒక శుభముహూర్తం నిర్ణయించాక, దేవతలపై దండయాత్ర చేస్తాడు బలి తన సైన్యంతో... వరుణ కుబేరులు, సూర్యుడు, యముడు, ఇంకా ఎందరో దేవతలు యుద్ధంలో ఓడిపోయి పలాయనం చిత్తగిస్తారు.

ఇంద్రుడు యుద్ధంలో గాయపడి, దేవతల గురువైన బృహస్పతి వద్దకు వెళ్తాడు. "దేవేంద్రా, నీవు చేస్తున్న యుద్ధం నిష్ప్రయోజనమైనది. నీవు బలిని ఓడించలేవు. న్యాయం, ధర్మం, సత్యం బలిని అజేయుడిగా మార్చినాయి. అందువల్ల

కొంతకాలం నీవు ఎక్కడైనా మర్మంగా ఉండటం మంచిది” అని బృహస్పతి సలహా ఇస్తాడు దేవేంద్రుడికి.

ముల్లోకాలకు బలి ఆధిపత్యం వహించటం, ఆ తర్వాత అశ్వమేధం తలపెట్టి, తొంభైతొమ్మిది యజ్ఞాలను పూర్తిగావించి, వందో యజ్ఞం చేయబోయే తరుణంలో, విష్ణుమూర్తి వామనావతారంలో వచ్చి, మూడడుగులు దానమడిగి, బలి పాలిస్తున్న ముల్లోకాలను దానంగా తీసుకోవటం మనందరికి తెల్సిందే.

ఈ బలిచక్రవర్తి కథలోని సారాంశం నాకైతే నాయకునికి ఉండాల్సిన అసలు సిసలైన లక్షణాలుగా గోచరిస్తుంది. తన జాతివారికోసం ఘోరమైన తపస్సుచేసి వరాలు పొంది రాజ్యాన్ని సుభిక్షంచేయటం, రాజ్య ప్రజలకు సర్వసుఖాలు, వాటితోపాటు ఆత్మగౌరవం అందించటం ముఖ్యమైన విశేషాలుగా స్ఫురిస్తాయి. ఏ నాయకుడికైనా ఇంతకన్నా ముఖ్యమైన ఆదర్శాలుకాని, గమ్యాలుకాని ఉండవుకదా.

తిండి, గుడ్డ,తలదాచుకోవటానికి ఒక చూరు – ఇవన్నీ లభ్యమైతే ఆనందంతో పాటు మనకి దక్కేది ఆత్మగౌరవమే కదా.

ఆత్మ గౌరవాన్ని అందించే వాడే అసలైన నాయకుడు. భారత జాతికి విదేశ పాలన నుంచి విముక్తి కలిగించి, ఎంతో ఆత్మగౌరవాన్ని ఇచ్చాడు మనందరికి మన జాతిపిత మహాత్మాగాంధి. అలా ఎందరో మహానుభావులు నిస్వార్థ సేవతో దేశం కోసం, ప్రజల కోసం పాటుబడి మనందరికి మన దేశం మీద, జాతి మీద, మనపై మనకు గౌరవం కలిగేలా చేశారు.

నలుగురి కోసం నడుంకట్టి వారి సమష్టి కలలను సాకారం చేసేవాడే నాయకుడు.

నాయకుడంటే దేశాన్ని పరిపాలించే ప్రధానమంత్రో, ముఖ్యమంత్రో, మంత్రో కానవసరంలేదు. మనందరం మన మన పరిధుల్లో నాయకులమే.

బడిలో క్లాసులోని లీడరూ ఒక నాయకుడే.

గ్రామ పెద్దా ఒక నాయకుడే.

పెద్ద పెద్ద సంస్థల్లో పలు విభాగాలకు బాధ్యులైన వారూ నాయకులే.

కూలీలకు మేస్త్రీ నాయకుడే.

కుటుంబ పెద్దా నాయకుడే.

ఇద్దరూ లేక ముగ్గురి సమష్టి బాగోగులకు బాధ్యత తీసుకొని, వారిని ఒక తాటిపైకి తెచ్చి, వారిని ముందంజ వేయించే అందరూ నాయకులే.

మన ప్రగతికి నిచ్చెనలు ఈ నాయకులే.

# మలి పలుకు

నీతి, నిజాయితీ, న్యాయవర్తన కలవారు; అందరికీ అందుబాటులో ఉండేవారు; అభయమిచ్చి మనలో సహజంగా ఉండే అనుమానాలను, ఆత్మన్యూనతను పోగొట్టేవారు; సమష్టి ప్రగతికి కృషి చేసేవారు అసలు సిసలైన నాయకులుగా, మార్గదర్శకులుగా గుర్తించాం.

ప్రతి వ్యవస్థకూ చిన్నది కానీయండి, పెద్దదికానీయండి, కుటుంబం నుంచి అన్ని వ్యవస్థలకు నాయకత్వం ఎంతో అవసరం. నాయకులంటే ప్రతి వారూ సామాన్యంగా అనుకొనే మేనేజర్లు, స్వలాభాపేక్షతో నలుగురిని పోగేసుకొని దేశాన్ని దోచుకునేవారు కాదు. ఈ కోవకి చెందిన వారి కొరతలేదు దేశంలో. ఎటుచూచినా వీరే. ఉన్నకొదవల్లా నిజమైన నాయకత్వ లక్షణాలుగల నాయకులకు మాత్రమే.

నా సుదీర్ఘ వ్యాపార ప్రయాణంలో చాలామంది మేనేజర్లను, నాయకులను కల్సుకొన్నాను. మేనేజర్లను సామాన్యంగా వారికిచ్చినపనికి వారు అందించే ఫలితాలను బట్టి అంచనా వేయటం జరుగుతుంది. సక్రమంగా ఇచ్చిన గడువుల్లో తక్కువ వ్యయంతో ఎక్కువ లాభాలను పొందగలిగితే మంచి మేనేజరంటాం.

ఈ గణాంకాలు నాయకుల విషయానికొస్తే వర్తించవు. వీరి వ్యక్తిత్వాలు, దృక్పథాలు, గమ్యాలు పూర్తిగా వేరుగా ఉంటాయి. దేశ కాల పరిస్థితులను ఆకళింపు చేసుకొని, వాటికి అనుగుణంగా మసలుకుంటూ మంచిని, నలుగురి ప్రయోజనాన్ని పెంచుతారు వీరు.

ప్రతి దేశం, ప్రతి సమాజం, ప్రతి వ్యక్తి ఎంతో ప్రత్యేకత గలిగినవారు. అమెరికాలోనో, మరే ఇతర దేశంలోనో మంచి ప్రయోజనాలనిచ్చిన వ్యూహాలు మన దేశంలో మంచి ఫలితాలనివ్వకపోవచ్చు. మన జీవన దృక్పథం, మన ఆశలు, కలలు, గమ్యాలు, వాటిని చేరుకొనే విధానాలు పూర్తిగా వేరుగా ఉంటాయి. మన కుటుంబ వ్యవస్థ వేరు. తండ్రి తన కుంటుంబ సభ్యుల చిటికెన వేళ్లు పట్టుకొని

వారికి మార్గదర్శకత్వం వహిస్తాడు. పశ్చిమదేశాల కుటుంబ వ్యవస్థలు వేరుగా ఉంటాయి. ఎవరి గమ్యాలను వారే నిర్దేశించుకొని వాటి సాకారం కోసం సొంతంగా జీవిస్తారు. ఈ అవగాహన లేకపోతే, నాయకులు మన దేశంలో తగిన ఫలితాలను పొందలేరు.

మన దేశంలో కుటుంబంనుంచీ ప్రతి వ్యవస్థలోని సభ్యులందరు నాయకుడి నుంచి అడుగడుగునా మార్గదర్శకత్వం ఆశిస్తారు. ఎవరి పని వారికి అప్పచెప్పి, ఫలితాలను ఇవ్వమంటే నాయకుడు తన బాధ్యతలను ఇతరులకు వప్పచెప్పి, తాను బాధ్యతా రహితంగా వ్యవహరిస్తున్నాడనుకొంటారు. ప్రతి మలుపులో నాయకుల మెప్పు, నాయకుల గైడెన్సు ఎంతో అవసరం మన వ్యవస్థల్లో. ఒక వైపు అందరికీ బాధ్యతలను పంచుతూ, మరోవైపు వారిని గమనిస్తూ, వారికి మార్గదర్శక మివ్వటం ఎంతో అవసరం మన సమాజంలో.

అలాగే ప్రతి వ్యక్తికి వారి వారి బలాబలాలననుసరించి గమ్యాలను ఏర్పరచటం కూడా ఎంతో ముఖ్యం. గమ్యాల నుంచి వారి దృష్టి మళ్లకుండా, వాటి సాకారం కోసం కృషిచేసేలా స్ఫూర్తిని, ప్రోద్బలాన్ని కూడా అందించవలసింది నాయకుడే.

వ్యవస్థలోని ప్రతి సభ్యుడు నాయకుడి ప్రతి కదలికను ఎంతో నిశితంగా గమనిస్తూ, తాను వాటినే అనుకరిస్తాడు కనుక, ఈ స్పృహ నాయకుడికుండటం ఎంతో అవసరం. యథారాజా తథాప్రజా లాంటి సమాజం మనది. అంతేకాదు, మనకి చేతల నాయకులు కావాలి, మాటల నాయకులు కాదు.

తన టీములోని ప్రతి సభ్యుడికి తన కలలు సాకారం కావడం రెండు నిమిషాలలో తయారయ్యే నూడిల్స్‌కాదు; ఎంతో శ్రమ, ఓర్పుతో కూడుకున్నదనే నగ్న సత్యాన్ని తెలియచేయాల్సిన బాధ్యత నాయకత్వానిదే. లేకుంటే రోజుకో కల, పూటకో వ్యూహంగా మారిపోతాయి జీవితాలు.

నేను కన్సల్టెంట్‌గా పనిచేసే సంస్థల్లో పలుమార్లు కొత్త ఉద్యోగుల నియామకాల్లో సహాయంచేస్తుంటాను. ఇంటర్వ్యూలకొచ్చే అభ్యర్థుల్లో ఎంతోమంది ఎన్నో సంస్థలు, రంగాలు మార్చటం గమనిస్తుంటాను. వారిని ఎందుకీ మార్పులు అని అడిగితే, మంచి భవిష్యత్తు కోసమనో లేక మరో జవాబు వస్తుంది తప్పితే,

ఒక గమ్యంతో నిర్దిష్టమైన వ్యూహంతో తమ తమ భవిష్యత్తును వారు నిర్మించుకొన్నట్లుగా కనబడదు. నాయకత్వ లోపమే కదా ఇది. వారి తల్లిదండ్రులు గాని, గురువులుకాని, వారు పనిచేస్తున్న సంస్థలుకాని సరైన గమ్య నిర్ధారణ చేయకపోవటమే దారీదిక్కూ తెలియక రకరకాల ప్రయోగాలు చేస్తున్న యువతీ యువకుల సమస్యలకు కారణాలు.

జీవితం ఎంతో పెద్ద నాటక రంగమని, మనం ఎంచుకోవలసిన పాత్ర – మన అభిరుచి, నైపుణ్యం మీద ఆధారపడి ఉండాల్సినదని విడమరచి ఎవరు చెప్తారు మనకు? తల్లో, తండ్రో, గురువో కదా...! ఈ రహస్యం మనం ఎంత తొందరగా గ్రహిస్తే, మన జీవితం అంతగా రాణిస్తుంది. అందరూ అన్ని పనులూ చేయలేరు. ప్రతి పనితో కాస్తో, కూస్తో పరిచయ జ్ఞానం ఉండొచ్చు. మన అభిరుచిని బాల్యంలోనే గ్రహించి, ఆ రంగంలో ప్రావీణ్యం పొందేలా చేయగలిగింది మన వ్యవస్థలోని నాయకత్వమేకదా. లేదంటే రకరకాలు ప్రయోగాలు, నిరాశలు, నిట్టూర్పులు, ఓటములు.. నిష్ప్రయోజకాలుగా మారిన జీవితాలు.

మన ఆశలకు, కలలకు రూపు రేఖలనే కాకుండా, వాటిని సాకారం చేసే నైపుణ్యాన్ని, ధైర్యాన్ని, ఆత్మగౌరవాన్ని మనలో నింపుతారు సలక్షణమైన నాయకులు... ఆత్మవిశ్వాసం, ఆత్మబలం లేనిదే ఒక అడుగైనా ముందుకు వేయలేం మనం. ఇది నిత్యం ఊపిరికి కావాల్సిన ఆక్సిజన్ లాంటిది. సామాన్యులను అసామాన్యులుగా మార్చేదే నాయకత్వం.

మంచి నాయకులు మనకు ఏది ఎప్పుడు కావాలో గ్రహించి, మనం వాటికోసం పోరాటం చేయకముందే మనకందిస్తారు. పిల్లలకు ఏంకావాలో గ్రహించి, వాటిని అందించే తల్లితండ్రిలాంటి వారు నాయకులు. ప్రతి తల్లికి తండ్రికి తమ పిల్లల మానసిక ప్రవృత్తులపై పూర్తి అవగాహన ఉంటుంది. అలాగే మంచి నాయకులు తమ తమ వ్యవస్థల్లోని సభ్యులపై అవగాహన పెంచుకొని, వారి అవసరాలను గ్రహించి, అవి సాకారమయ్యే దిశగా పయనింపచేస్తారు.

మనలోని బలహీనతలను గుర్తించినా గుర్తించనట్లే ప్రవర్తిస్తూ, మనలోని సద్గుణాలపైనే దృష్టి కేంద్రీకరింప చేసి, వాటిని పెంచి ప్రయోజకులుగా తీర్చి

దిద్దుతారు. తప్పులను వేలెత్తి పదేపదే చూపరు. ఒప్పులను పొగుడుతారు. వాటిని పెంచుతారు.

నలుగురిలో మన బలహీనతలను చర్చించరు. మన విఫల ప్రయత్నాలను గర్హించరు.

మనలోని మంచిని, తెచ్చిన సత్ఫలితాలను పొగుడుతారు.

తమను తాము గౌరవించుకొంటూ, ఇతరులను గౌరవిస్తారు నాయకులు.

గెలవటానికే ఆడతారు. గెలవటం చాలా ముఖ్యం వీరికి. వేదాంతుల్లాగా గెలుపు, ఓటమి సహజమని చెప్పరువీరు. గెలుపుకోసం అన్ని విధాల కృషిచేయమని ప్రోత్సహించి, ఓడితే అదో పాఠంగా, రాబోయే విజయానికి ఒక మెట్టుగా వర్ణిస్తారు.

మంచి నాయకులు తాము లేకపోతే ఈ ప్రపంచం మునిగిపోతుందనుకోరు. తమ తదనంతరం నాయకత్వ బాధ్యతల్ని తీసుకోవాల్సిన వారిని గుర్తించి, నాయకత్వ లక్షణాలను, బాధ్యతలను వారికి నేర్పుతారు. కుటుంబ వ్యాపారాల్లో ఎలాగా తమ పిల్లలకు ఆయా వ్యాపారాల నైపుణ్యాన్ని, అనుభవాన్ని అందేలా చూస్తారో, అలాగా.

ఏదైనా మార్పు అవసరమైతే, ఆ మార్పు తమతోనే మొదలయ్యేలా కృషిచేస్తారు నాయకులు. నేటి రాజకీయ నాయకుల్లాగా, చెప్పేది ఒకటి చేసేది మరొకటి అనేదానికి ఎంతో దూరంగా ఉంటారు నిజమైన నాయకులు.

మారుతున్న ప్రపంచంలో రోజూ ఏదో ఒకటి నేర్చుకోవలసిన అవసరాన్ని గుర్తించి, నిరంతరం విద్యార్థుల్లాగా ఉండిపోతారు వీరు. మిడిమిడి జ్ఞానంతో మూర్ఖుల్లాగా వ్యవహరించరు వీరు.

ఎదుటివారి అభిప్రాయాలకు విలువనిచ్చి వారు చెప్పేది మనస్సు లగ్నం చేసి వింటారు. వినటం ద్వారా నేర్చుకోవచ్చనే సత్యం వీరు ఎన్నడో గ్రహించారు కనుకే, ఎదుటివారి అభిప్రాయాలను వినటం, గౌరవించటం.

నాయకత్వం అంటే తీయగా హాయిగా మాట్లాడి, మాయచేసి పబ్బం గడుపుకొనిపోవటం కాదని వీరికి తెలుసు. అందుకే వీరు నిర్మొహమాటంగా నిజాన్ని ఇతరులకు చెప్పగలరు.

ఎలాగోలా స్నేహాలు ఏర్పరచుకొని, నెట్ వర్కింగ్ ద్వారా విజేతలవ్వాలను కోవటం వీరి ఆశయంకాదు. కష్టేఫలి మీద నమ్మకముంచి ముందంజ వేయటం వీరి నైజం. ఇతరులకు మార్గదర్శిగా ఉండటం వీరి అలవాటు.

స్వార్థం తక్కువ, అందరి మేలుకై కృషిచేయటం ఎక్కువ. నలుగురికి స్ఫూర్తినివ్వగలరు. సంతోషంగా ఉంటారు. సంతోషాన్ని పంచుతారు.

వీరికి పద్ధతులపైన అమితమైన గౌరవం – స్వప్రయోజనాల కోసం పద్ధతులను విస్మరించరు. షార్ట్‌కట్స్ ద్వారా సొంత రాజ్యాలను స్థాపించాలనుకోరు.

వీరి వ్యక్తిత్వాలు, నమ్మకాలు స్థిరంగా బలంగా ఉంటాయి. గాలి వాటానికి మారుతూ ఉండవు.

ఆరోగ్యంమీద ధ్యాస ఉంచి, శ్రద్ధగా దాన్ని కాపాడుకుంటారు.

కష్టపడి పనిచేస్తారు.

అలాగే సుఖంగా జీవిస్తారు.

తమ విమర్శకులను ద్వేషించరు. విమర్శను ఒక అభిప్రాయంగానో, లేక మార్పుకి నాందీగానో భావిస్తారు.

భట్రాజులకి తమ తమ ఆస్థానాలలో చోటు కల్పించరు.

ఓటమికి తలవంచి పారిపోరు. మరోసారి, మరోసారి అంటూ కృషి చేస్తూనే ఉంటారు, విజయ లక్ష్మి వరించిందాకా.

పాజిటివ్‌గా ఉంటారు.

నెగిటివ్‌కి చోటులేదు వీరి జీవితాల్లో.

తమ భావోద్రేకాలను స్వాధీనంలో ఉంచుకొంటారు.

ఏతా వాతా వీరు మంచి వ్యక్తుల్లాగా, మనకు మార్గ దర్శకుల్లాగా గోచరిస్తారు.

ఇటువంటివారు ఎవరైనా ఉన్నారా అనే అపనమ్మకం మీకుంటే, చుట్టూ పరికించండి. ఎందరో కనబడ్తారు. బహుశా మీలోనే ఇటువంటి గుణాలు, వ్యక్తిత్వ

లక్షణాలు నిక్షిప్తమై ఉండొచ్చు. వాటిని వెలుపలికి తెచ్చి నిర్దిష్టమైన గమ్యాన్ని చేకూర్చటమే మన లక్ష్యం.

నాయకులుగా ఎవ్వరూ పుట్టరు.

నాయకత్వ లక్షణాలను గమనించి సొంతం చేసుకొని నలుగురికి ప్రయోజనకారులుగా మారి తాము రాణిస్తారు. మనను రాణింప చేస్తారు.

ఈ జీవితం మనది. ఈ సంఘం మనది. ఈ వ్యవస్థ మనది. ఈ దేశం మనది. ఇదో అద్దె ఇల్లో లేక అద్దె దేశమో కాదు, మన దేశం ఇది. దీని బాగోగులు మనలోని ప్రతి ఒక్కరి బాధ్యత అనే స్పృహకలిగితే, మనం మంచి నాయకులుగా, మంచి టీము సభ్యులుగా మారుతాము.

చుట్టూతా ఎన్ని ఘోరాలు జరుగుతున్నా, ఏం పట్టనట్లు, మనవి కానట్లు మౌనంగా జీవించుకుంటూపోతే ఈ వ్యవస్థ మారదు. మనం మారం. మన భవిష్యత్తు మరింత అంధకార బంధురమౌతుంది.

ఈ దేశం మనకు అద్దె దేశం కాదు. మన సొంత దేశం, మన పిల్లా పాప, వారి భవిష్యత్తు ఈ దేశం బాగోగులపైనే ఆధారపడి ఉందనే స్పృహ కలిగితే, వచ్చే మార్పు అద్భుతంగా ఉంటుంది. ప్రశ్నించటం మొదలుపెడతాం! ఒకసారి ప్రశ్నించటం మొదలయ్యాక, సమాధానాలు రాక మానవు. సమాజం, ప్రభుత్వం; మన వ్యవస్థలు – అన్నీ మారక మానవు. మార్పును తెచ్చేది మంచి నాయకత్వమే.

అది ఎవరోకాదు, మనమే.

మీరూ, నేనే.

**–ఎ.జి.కృష్ణమూర్తి**

# రచయిత గురించి

ముద్ర కమ్యూనికేషన్స్ లిమిటెడ్ ఫౌండర్, ఛైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ శ్రీ ఎ.జి. కృష్ణమూర్తి 35,000 రూపాయల మూలధనంతో ఒకే క్లయింటుతో ఏజెన్సీని ప్రారంభించారు. కేవలం తొమ్మిదేళ్లలో ముద్ర భారతదేశంలో అతిపెద్ద అడ్వర్టయిజింగు ఏజెన్సీలలో మూడో స్థానాన్ని, భారతీయ అడ్వర్టయిజింగు ఏజెన్సీలలో ప్రథమస్థానాన్ని చేరుకోగలిగింది.

ఆంధ్రప్రదేశ్‌లోని వినుకొండలో ఏప్రిల్ 28, 1942న కృష్ణమూర్తి జన్మించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుండి చరిత్రలో డిగ్రీ తీసుకున్నారు. 1960–70లలో చాలా పేరున్న కేలికో మిల్స్ టెక్స్‌టైల్ కంపెనీలో శ్రీమతి గీరాబెన్ శరాభాయి గారి అసిస్టెంటుగా 1968లో ఉద్యోగంలో చేరారు. ఈ కంపెనీ అడ్వర్టయిజింగు ఏజెన్సీ శిల్పిలో అకౌంట్సు ఎగ్జిక్యూటివ్‌గా 1972లో ప్రవేశించారు. 1976లో అడ్వర్టయిజింగు మేనేజరుగా రిలయన్స్ ఇండస్ట్రీస్‌లో చేరారు. నాలుగేళ్ల తర్వాత మార్చి 25, 1980న ఆయన ముద్ర కమ్యూనికేషన్స్‌ను స్థాపించారు.

ఏజెన్సీ ప్రధానమైన బ్రాండ్లలో రెండు బ్రాండ్లు – విమల్ ఫాబ్రిక్స్, రస్నా సాఫ్ట్‌డ్రింక్ కాన్సంట్రేట్‌లను ప్రారంభదశ నుండి భారతదేశపు అగ్రగామి బ్రాండ్లుగా గుర్తింపు పొందేంతవరకూ బాధ్యత వహించింది ఆయనే. విమల్, రస్నాలతోపాటు వివిధ రంగాలలో మరెన్నో బ్రాండ్లు అగ్రగాములుగా రూపొందాయి. 1991 మార్చిలో ఆయన ముద్ర ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కమ్యూనికేషన్స్, అహ్మదాబాదు (మైకా)ను స్థాపించారు. ఆసియాలోనే ఇది ఏకైక అడ్వర్టయిజింగు ఇన్‌స్టిట్యూటు. భారతీయ అడ్వర్టయిజింగు పరిశ్రమకు అవసరమైన సుశిక్షితులయిన ప్రతిభావంతులను అందించడం కోసం మైకా స్థాపన జరిగింది. మరో రెండేళ్ల తర్వాత ఆయన ముద్ర ఇంటర్నేషనల్‌ను స్థాపించారు. ఒక భారతీయ ఏజెన్సీ విదేశాల్లో తన శాఖను నెలకొల్పడం విషయంలోనూ ముద్రదే తొలి అడుగు.


కృష్ణమూర్తి గారి ఇరవైమూడేళ్ల నాయకత్వంలో ముద్ర కమ్యూనికేషన్స్ లిమిటెడ్ 844 అవార్డులు, బహుమతులు గెలుచుకుంది. వీటిలో ప్రెసిడెంటు అవార్డులు, ఏజెన్సీ ఆఫ్ ది ఇయర్ అవార్డులూ ఉన్నాయి. ఏజెన్సీ ఆఫ్ ది ఇయర్ అవార్డును ముద్ర వరుసగా ఆరేళ్లు గెలుచుకుంది. భారతదేశ అగ్రగామి మార్కెటింగ్ జర్నల్ ఎ & ఎం అడ్వర్టయిజింగ్ పర్సన్ ఆఫ్ ది ఇయరుగా కృష్ణమూర్తిని 1995లో సన్మానించింది. 1997లో ది అడ్వర్టయిజింగ్ క్లబ్, కలకత్తా తమ 'హాల్ ఆఫ్ ఫేమ్'లో కృష్ణమూర్తికి స్థానం కల్పించింది. బ్రిటిష్ మాగజైన్ 'మీడియా ఇంటర్నేషనల్' డిశంబరు 1998లో అంతర్జాతీయ అడ్వర్టయిజింగు పరిశ్రమకు కీలకమయిన 25 మంది ప్రముఖుల్లో ఒకరిగా శ్రీ ఎ.జి. కృష్ణమూర్తి పేరును ప్రకటించింది. ఆయన 'పయనీరింగ్ స్పిరిట్ అండ్ ఎంట్రప్రెన్యూరియల్ విజన్' కు గుర్తింపుగా 1999లో ప్రతిష్ఠాత్మకమైన ఎఎఎఐ–ప్రేం నారాయణ్ అవార్డు లభించింది. దేశంలోనే తొలిసారిగా ఆయన 2000 సంవత్సరంలో ఆన్‌లైన్ రిఫరెన్స్ లైబ్రరీ ఫర్ అడ్వర్టయిజింగ్ – మాగిండియా.కాం ను స్థాపించారు. ఇంటర్నేషనల్ హూ ఈజ్ హూ ఆఫ్ ప్రొఫెషనల్స్ 2002–2003 ఎడిషన్‌లో ఆయనకు స్థానం లభించింది. 2003లో జీవితంలో ఘన విజయాలు సాధించిన ఆంధ్రులలో ఒకరుగా మాటీవి సన్మానాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ద్వారా అందుకున్నారు.

ప్రస్తుతం శ్రీ కృష్ణమూర్తి ఎజికె బ్రాండ్ కన్సల్టింగుకు చైర్మన్. కృష్ణమూర్తికి ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు. తన కుటుంబంతో ఆయన హైదరాబాదులో నివసిస్తున్నారు.

నేటి వరకు ఆంగ్లంలో ఆరు, తెలుగులో పది పుస్తకాలను ప్రచురించారు. ఇది పదకొండో తెలుగు పుస్తకం. అన్ని పుస్తకాలు పునర్ముద్రణలు పొంది పాఠకుల అభిమానానికి నోచుకున్నవే. కాలమిస్టుగా 'ఎజికె వారం వారం' ద్వారా తెలుగు పాఠకులకు, 'ఎజికె స్పీక్' ద్వారా ఆంగ్ల పాఠకులకు సుపరిచితులు. రచయితగా కూడా పలు ప్రశంసలు, పురస్కారాలు అందుకున్నారు శ్రీ కృష్ణమూర్తి.

## ముద్ర కమ్యూనికేషన్స్ వ్యవస్థాపక అధ్యక్షులు
## **ఎ.జి.కృష్ణమూర్తి** రచనలు

### జయహో





***విజయానికి పదిసూత్రాలు & స్ఫూర్తినిచ్చే విజయగాథలు***

డబ్బు సంపాదించాలంటే
అయిడియాలు కావాలి.
పద్ధతులు కావాలి.
అడ్డదార్లు కాదు.
పదిసూత్రాలతో, ఏభైకి పైగా ఉత్తేజాన్ని కలిగించే
నిజమైన గాథలతో మన జీవితాల్ని సరికొత్త బాటలో
పెట్టగలిగిన పుస్తకం –
**జయహో.**

**వెల. రూ. 60/-**

### ఎదురీత




***ఆశ, ధైర్యం, పట్టుదలతో శిఖరాగ్రం చేరిన ఓ విజేత కథ***

పెద్ద పెద్ద కలలు కను.
కొత్త మార్గాలు ఎంచుకో.
అవి సహజంగా తెచ్చే ఇక్కట్లనుంచి పారిపోకు.
ఎదురొడ్డి పోరాడి ఎదురీదు.
అంతిమ విజయంనీదే.
ధీరూభాయి అంబాని జీవితకథ – ఎదురీత నిరూపించే సత్యాలు ఇవే.
మనల్ని ఎంతో ఉత్తేజపరచి, కార్యోన్ముఖులని చేసి
మనకు జవసత్వాలనిస్తుంది ధీరూభాయి ఎదురీత.

**వెల. రూ. 60/-**

### మనందరం విజేతలు కావచ్చు




విజేతగా రూపాంతరం చెందటం మనందరి జన్మహక్కు. బీద దేశమైన మన దేశంలో ఇది నా 'ఖర్మ' అని అన్నిటినీ సహించేకంటే కలలు కని, వాటిని గమ్యాలుగా మార్చుకొని, కుటుంబానికొకడైనా విజేతగా మారాలి. ఆ విజేత ఆ కుటుంబానికి ఇంజనై ప్రగతిపథంలోకి తీసుకెళ్ళాలి.

ఎవ్వరూ విజేతలుగా పుట్టరు. విజేతలుగా ఎదుగుతారు.

**వెల. రూ. 60/-**

## నేస్తమా... జయమ్ము నిశ్చయమ్ము!

***విజేతలుగా మారటం మనందరి జన్మహక్కు***




వెల. రూ. 60/-

నిద్రాణంగా ఉన్న కలల్ని, ఆత్మ విశ్వాసాన్ని మేలుకొలిపి, విజయపథ మేమిటో నిర్ధారించుకొని, విజయ మార్గంలో పయనించటమే నేటి యువత ముందున్న ఒకే ఒక్క దారి. కలలు, పట్టుదల, గమ్యాలు చేరేదాకా అవిరామంగా శ్రమించటం, పోరాడటం– ఈ సంగ్రామంలో ఆయుధాలు. ఇవి వెలుపలినుంచి మనకు లభించేవికావు. మనలో అంతర్లీనంగా ఉన్నాయి. వాటిని వెలికితీయటమే మన ముందున్న ఒకే ఒక్క గమ్యం. ఉదాహరణలు కావాలా?

ప్రపంచం తలుపులు తెరిస్తే దేదీప్యమానంగా ఎన్నో కాంతి పుంజాలు... ఈ పుస్తకం పేజీలు తెరిస్తే ఎంతో ఉత్తేజం....

## ధీరూభాయిజమ్

***ధీరూభాయి అంబాని తత్వదర్శనం***





వెల. రూ. 60/-

మట్టిలోంచే కాదు, మనుషుల్లోంచి కూడా మాణిక్యాల్ని వెలికి తీయాలనేది ధీరూభాయ్‌గారి తపన! ప్రతి భారతీయుడిలోనూ దాగివున్న ప్రతిభ, పట్టుదల వంటివి అతని అంచనాలకు మించినవని ధీరూభాయ్‌గారు గట్టిగా నమ్ముతారు. అందుకే అందరూ తమ శక్తి సామర్థ్యాల్ని తమంతట తాము గ్రహించేలా చేయాలన్నది ఆయన సంకల్పం. ఫలితంగా ఆయన సాధించిన ఉద్యమం, నాలాంటి ఎంతోమందికి కార్పొరేట్ జీవితాన్ని ప్రసాదించింది.

(ముకేష్ అంబాని తొలిపలుకు నుంచి)

## నేస్తమా... నీ కలలను జీవించు

***నెరవేరని కలలుండవు***




వెల. రూ. 60/-

కలలకున్న శక్తి సామర్థ్యాలతో పరిచయం, అనుభవం ఉన్నవాణ్ణి నేను. నెరవేరని కలలుండవనేది ముమ్మాటికీ నిజం. నేను అనుభవించిన సత్యం.

నా కలలెన్నో నిజమయ్యాయి. వాటిలో కొన్ని దశాబ్దాలుగా జీవిస్తూ వస్తున్నాను. నడుంకట్టి, పట్టుదలతో రంగప్రవేశం చేయండి. మీ కలలు నిజమవుతాయి. మీ కలలని మీరు తప్పక జీవిస్తారు.

## నేస్తమా... డ్రీమ్ బిగ్

***సామాన్యంగా ఉండటం ఒక శాపం, ఒక పాపం అందుకే డ్రీమ్‌బిగ్***





వెల. రూ. 60/-

ఒక్కసారి ఆకాశంలోకి చూడండి దీక్షగా... ఇంకొంచెం దీక్షగా... మరి కొంచెం మనస్సు, దృష్టి కేంద్రీకరించి చూడండి. అవిగో... అనంతమైన ఆకాశంలో, లక్షలాది, కోట్లాది నిచ్చెనలు ఆకాశం అంచులను తాకుతూ కనబడటంలేదా మీకు? నాకైతే ఆకాశమంతా నిచ్చెనలమయం. అంతేకాదు, ఆ నిచ్చెనల అంచుల పైన పలువురు కూర్చొని, చిరునవ్వుతో మొదటిమెట్టులో కింద ఉన్న మనని పైకి రమ్మని ఆహ్వానిస్తున్నారు.

## నేస్తమా... బి. పాజిటివ్

***మనం నమ్మవలసిందల్లా మనశక్తిని, కృషిని, మన విశ్వాసాన్ని***

నాకు తెలిసిన పలువురు, తమకు అందుబాటులో ఉన్న వనరులతో, తమ స్వంత శక్తి సామర్థ్యాలతో ప్రపంచమే గుర్తించిన విజేతలయ్యారు. ధీరూభాయి అంబానీగారు, డాక్టర్ వర్గీస్ కురియన్‌గారు, శ్రీమతి గీరాబెన్ శరాభాయిగారు ఈ కోవకి చెందిన వారే. వీరందరినుంచి నేను నేర్చుకున్నపాఠం ఒక్కటే... ఇతరుల కలిమిలేములను కష్టసుఖాలను వారికే వదిలిపెట్టి, మనం మన గమ్యాలపై దృష్టిసారించి, దీక్షతో శ్రమిస్తే, మనం సాధించని విజయం ఉండదు. నెరవేరని కలలుండవు.



వెల. రూ. 60/-

## ఆకాశానికి నిచ్చెనలు

***ఆకాశానికి నిచ్చెనలువేసి, విజేతలమై ఇతరులకు మార్గదర్శకం కావచ్చు***

ఎజికె చెప్పేదొక్కటే – మనకో లక్ష్యం అంటూ వుంటే అది కచ్చితంగా నెరవేరుతుంది అని. ఎజికె తన లక్ష్యాన్ని ఎలా నెరవేర్చారో ఆయన మాటల్లో, ఆయనతో కలిసి పనిచేసినవాళ్ళ మాటల్లో విందాం. ఆయన విజయం వెనుక దాగివున్న అంతఃసూత్రాన్ని మన విజయాలకు మార్గదర్శకంగా చేసుకుందాం.




వెల. రూ. 60/-

## అందిన ఆకాశం

***విజేతల కథలన్నీ ఆకాశం అంచులని తాకినవే***

మన మీద మనకు గౌరవ మర్యాదలు ఉంటే (ఇది అహంకాదు. అహం అంటే తనకు లేని దాన్ని ఆపాదించుకొని బాధపడటం... బాధ పెట్టటం!) భగవంతుడు మనకు ప్రసాదించిన ఈ జీవితాన్ని, దాంతో పాటు లభించిన మన శక్తి సామర్థ్యాలు, ప్రకృతి సంపదలాంటి అన్నిటిని మన భాగస్వాములుగా చేర్చుకొని ఆకాశాన్నందుకునే ప్రయాణం మొదలు పెట్టవచ్చు. ఇక్కడి నుండి మొదలయిన ప్రతి కథ సుఖాంతమే అవుతుంది. అసాధ్యమంటూ ఏమీ ఉండదు. అశాంతి అసలే ఉండదు. ఆకాశం నిర్మలంగా, ప్రశాంతంగా మనకు అందుబాటులో ఉంటుంది.



వెల. రూ. 50/-

---

## ఎ.జి. కృష్ణమూర్తి ఆంగ్ల రచనలు

1. The Invisible CEO
2. Desi Dream Merchants
3. Dhirubhaism
4. Against All Odds
5. TEN MUCH
6. The Learnings of an Advertising Practitioner

# లీడర్‌షిప్ ముచ్చట్లు

లీడర్ షిప్ అంటే నలుగురి సమష్టి ప్రయోజనాలకు కృషి చేయటం; వారికి ఆత్మగౌరవం కలిగేలా చేయటం. ఈ లక్షణాలు మనందరిలో మెండుగా ఉన్నాయి. వాటిని వెలికితీసి మనదేశాన్ని, మన సమాజాన్ని, మన పిల్లల భవిష్యత్తును శాంతిమంతంగా, సుందరంగా తీర్చి దిద్దవచ్చు.

---


## ఎ.జి.కృష్ణమూర్తి

ముద్ర కమ్యూనికేషన్స్ ఫౌండర్ ఛైర్మన్ ఎ.జి. కృష్ణమూర్తి 35 వేల రూపాయల పెట్టుబడి తోను, ఒకే ఒక్క క్లయింట్‌తోను అడ్వర్టయిజింగ్ ఏజెన్సీ ప్రారంభించారు. కేవలం తొమ్మిదేళ్ళలో ముద్ర భారతదేశంలోని అతి పెద్ద అడ్వర్టయిజింగ్ ఏజెన్సీలలో మూడవ స్థానాన్ని, భారతీయ అడ్వర్టయిజింగ్ ఏజెన్సీలలో ప్రథమ స్థానాన్ని చేరుకుంది.

ప్రభుత్వంలో చిన్న గుమస్తా ఉద్యోగంతో జీవితాన్ని ప్రారంభించి, ఆ ఉద్యోగాన్ని వదిలివేసి అడ్వర్టయిజింగ్ రంగంలోకి ప్రవేశించిన ఎ.జి.కె. భారతీయ కార్పొరేట్ రంగంతో అతిచేరువగా కలిసి పనిచేసి అతికొద్ది కాలంలో తెలుగువారు గర్వించదగ్గ అత్యున్నత శిఖరాలకు చేరుకున్నారు.

ముద్ర కమ్యూనికేషన్సు ఛైర్మన్‌గా పదవీ విరమణ చేసిన తరువాత ఎ.జి.కె. బ్రాండ్ కన్సల్టింగ్‌ను స్థాపించారు. కాలమిస్టుగా, రచయితగా ఆంగ్లంలోను, తెలుగులోను పలు వ్యాసాలు, పుస్తకాలు ప్రచురించారు. వారి పుస్తకాలు అతి కొద్దికాలంలో పలు భారతీయ భాషల్లో ప్రచురింపబడి, ఎంతోమందికి స్ఫూర్తినిచ్చి ఒక కొత్త ఒరవడిని సృష్టించాయి.

ప్రస్తుతం వీరి నివాసం హైదరాబాదు. వీరికి ముగ్గురు కుమార్తెలూ, ఒక కుమారుడు.



రూ. **75/-**

ఎమెస్కో బుక్స్

978 93 80409 99 3